PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 271 | విజయవాడ, సోమవారం 6 మే 2024 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 6 May 2024 | Rs

జార్ఖండ్ రాజకీయాలపై
కల్పన సోరెన్ ముద్ర

- హేమంత్ అరెస్ట్‌తో అనూహ్యంగా పొలిటికల్ ఎంట్రీ
- గండే అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పోటీ
- అక్రమ కేసులపై బిజెపి, మోడీకి పదునైన విమర్శనాస్త్రాలు

4

సమ సమాజ నిర్మాణానికి మార్గం చూపిన మహాశయుడు కార్ల్ మార్క్స్ 206వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. విజయవాడలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, సిపిఐ నేత వనజ, ప్రొ. నర్సింహారావు తదితర వామపక్షవాదులు, అభ్యుదయ సాహితీకారులు మార్క్స్‌కు ఘన నివాళులర్పించారు.

2

పార్వతిపురం మన్యం జిల్లా పాలకొండలో నిర్వహించిన ర్యాలీలో బృందా కరత్, పుణ్యవతి, సుబ్బరావమ్మ, రెడ్డి వేణు, సిపిఎం అరకు ఎంపి అభ్యర్థి అప్పలనర్స, పాలకొండ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి చంటిబాబు తదితరులు

మూడో దశ ప్రచారానికి తెర

- 95 లోక్‌సభ స్థానాలకు రేపు పోలింగ్
- మొత్తం 1,351 మంది అభ్యర్థులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల్లో మూడో దశ పోలింగ్ మంగళవారం జరగనుంది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం ఆదివారం సాయంత్రంతో ముగిసింది. మూడవ విడతలో 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని మొత్తం 95 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 1,351 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మూడవ దశలో బరిలో ఉన్న ముఖ్యుల్లో కేంద్ర మంత్రులు అమిత్ షా (గాంధీనగర్), జ్యోతిరాదిత్య సింధియా (గుణ), బిజెపి తిరుగుబాటు నాయకుడు కెఎస్ ఈశ్వరప్ప (షిమోగా), డింపుల్ యాదవ్ (మెయిన్‌పురి), శివరాజ్ సింగ్ చౌహాన్ (విదిశ), సుప్రియా సులే (బారామతి) తదితరులు ఉన్నారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీ, సమాజ్‌వాదీ పార్టీ, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీల అభ్యర్థుల మధ్య ప్రధానంగా పోరు జరగనుంది. మరోవైపు ఇప్పటికే ఏప్రిల్ 19న తొలి దశ పోలింగ్, ఇక ఏప్రిల్ 29న రెండో దశ పోలింగ్ పూర్తయ్యింది. ఓట్ల లెక్కింపు జూన్ 4న జరగనుంది.

తగ్గుతున్న పోలింగ్ శాతం

తొలి రెండు దశల్లో పోలింగ్ శాతం తగ్గింది. మొదటి దశలో 66.14%, రెండో దశలో 66.71% ఓటింగ్ నమోదైంది. బిజెపికి కీలకంగా ఉన్న రాష్ట్రాల్లో ఓటింగ్ శాతం తగ్గిపోవడం ఆ పార్టీని ఆందోళనకు గురిచేస్తోంది. మొత్తంగా మరో 350 స్థానాల్లో పోలింగ్ జరగాల్సి ఉంది.

డిజిపిపై బదిలీ వేటు

ఇద్దరు డిఎస్‌పిలనూ తప్పించిన ఎన్నికల కమిషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలింగ్‌కు వారం రోజుల ముందు ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డిపై బదిలీ వేటు వేసింది. తక్షణమే విధుల నుంచి వైదొలగాలని పేర్కొంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆయనకు ఎలాంటి బాధ్యతలు అప్పగించొద్దని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డికి ఆదేశాలిచ్చింది. సోమవారం ఉదయం 11 గంటల్లోగా సీనియర్ ఐపిఎస్ అధికారులతో కూడిన ముగ్గురి పేర్ల జాబితాను పంపించాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొంది. జాబితాలో చేర్చేవారి ఐదేళ్ల పనితీరు నివేదిక, విజిలెన్స్ క్లియరెన్స్ నివేదికల్ని కూడా కమిషన్‌కు పంపించాల్సిందిగా సూచించింది. రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియకు ముందు నుండే డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి పనితీరుపై ఫిర్యాదులు అందాయి. విపక్ష పార్టీలకు చెందిన కీలకనేతలు వచ్చినపుడు కనీసం వారి నుంచి వినతిపత్రాలను

రాజేంద్రనాథ్‌రెడ్డి

తీసుకునేందుకు చొరవచూపని డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి అధికార పార్టీకి సంబంధించి ఎవరొచ్చినా అపాయింట్‌మెంటు ఇచ్చి వినతిని తీసుకోవడం పట్ల విపక్షాలు మండిపడ్డాయి. అధికార పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారన్న విమర్శలు మూటగట్టుకున్నారు. ప్రతిపక్షాలపై ఎన్ని దాడులు జరిగినా పట్టించుకోరన్న విమర్శలూ వున్నాయి. సోషల్ మీడియాలో పోస్టుల అంశంలో మరీ పచ్చిగా వైసిపికి అనుకూలంగా వ్యవహరించారని పలువురు అభిప్రాయపడుతున్నారు. మాచర్లలో అధికార పార్టీ విధ్వంసాన్ని వెనకేసుకు రావడంతోపాటు తెలుగుదేశం నేతలదే తప్పన్నట్లుగా మాట్లాడటం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది. అలాగే కెవి రాజేంద్రనాథ్‌రెడ్డికి డిజిపి బాధ్యతలు ఇచ్చే అంశాల్లో కూడా అధికార పార్టీ తీసుకున్న నిర్ణయం ఐపిఎస్ అధికారుల్లో చర్చనీయాంశమైంది. ఆయన కంటే ముందున్న 11 మంది సీనియర్ ఐపిఎస్ అధికారులను పక్కనపెట్టి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డిని ఇన్‌ఛార్జి డిజిపిగా ప్రభుత్వం నియమించినపుడే పెద్దయెత్తున విమర్శలు వచ్చాయి.

ఇద్దరు డిఎస్‌పిలపైనా చర్యలు

రాష్ట్రంలో ఎన్నికల సంఘం ఇద్దరు డిఎస్‌పిలను ఎన్నికల విధుల్లోంచి తప్పించింది. తెలుగుదేశం పార్టీ ఫిర్యాదుతో అనంతపురం టౌన్ డిఎస్‌పి వీరరాఘవరెడ్డి, రాయచోటి డిఎస్‌పి సయ్యద్ మహబూబ్‌బాషాను బదిలీ చేస్తూ ఎన్నికల విధులకు దూరంగా వుంచాలని ఎన్నికల సంఘం ఉత్తర్వుల్లో పేర్కొంది.

దేశమంతటా
బిజెపి వ్యతిరేక గాలి

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి

హోదా ఇవ్వని బిజెపి కూటమిలో చంద్రబాబు ఎలా చేరారు?

విశాఖలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కరత్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

దేశంలోని అత్యధిక రాష్ట్రాల్లో బిజెపి వ్యతిరేక గాలి వీస్తోందని, గడచిన పదేళ్లలో ఎన్‌డిఎ పాలనలో అధిక ధరలు, ప్రభుత్వ రంగ సంస్థల విధ్వంసానికి పాల్పడుతూ దేశాన్ని ప్రమాదంలో పడేసిందని, దేశ రక్షణ, ప్రజల అజెండాతో ఇండియా వేదిక 2024 ఎన్నికల్లో అధికారంలోకి రానుందని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కరత్ వెల్లడించారు. ఉత్తరాంధ్రలో ఇండియా వేదిక తరపున ప్రచారానికి విచ్చేసిన ఆమె ఆదివారం ఉదయం విశాఖలోని సిపిఎం కార్యాలయం (ఎన్‌పిఆర్ భవన్) లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రసంగించారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి, గాజువాక అభ్యర్థి ఎం.జగ్గునాయుడు, కాంగ్రెస్ పార్టీ తరపున విశాఖ పార్లమెంట్ బరిలో దిగిన సత్యారెడ్డి, పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సిపిఐ అభ్యర్థి విమల అభ్యర్థిత్వాలకు మద్దతుగా తాను విచ్చేశానన్నారు.

ఏపికి విభజన హామీలైన ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వేజోన్, పోలవరం ప్రాజెక్టు అమలులో బిజెపి విఫలమైందని బృందా ఎద్దేవా చేశారు. 2018లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసమే తాను బయటకొస్తున్నానని చెప్పి , ఏపికి హోదా ఇవ్వని బిజెపితో 2024 ఎన్నికల్లో కూటమి ఎలా కడతారని చంద్రబాబును ప్రశ్నించారు. దేశంలోని ఇండియా వేదికలో అనేక ప్రతిపక్షాలు,

మిగతా 10లో

ఉల్లంఘనలపై సిఐడి నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికల నిబంధనావళి ఉల్లంఘుల కింద తెలుగుదేశం పార్టీకి సిఐడి నోటీసులు జారీ చేసింది. ల్యాండ్ టైట్లింగ్ యాక్టుపై దుష్ప్రచారంతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, ఈ అంశంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేష్‌పై చర్యలు తీసుకోవాలని వైసిపి చేసిన ఫిర్యాదుపై ఇసి స్పందించి సిఐడి విచారణకు ఆదేశించింది. దీంతో సిఐడి ఇన్‌స్పెక్టరు తిరుమలరావు మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయానికి ఆదివారం నాడు వెళ్లి భూ యాజమాన్య హక్కు చట్టంపై మీ వద్ద వున్న సాక్ష్యాధారాలను తీసుకుని సోమవారం గుంటూరులోని సిఐడి కార్యాలయానికి విచారణకు రావాలని నోటీసు అందజేశారు. అలాగే ఇంటింటికీ పెన్షన్ల పంపిణీని చంద్రబాబు అడ్డుకున్నారని వైసిపి సోషల్ మీడియా దుష్ప్రచారం చేస్తోందని టిడిపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్పందించింది. వైసిపి సోషల్ మీడియా ఇన్‌ఛార్జి సజ్జల భార్గవ్‌ను విచారించి నివేదిక ఇవ్వాలని సిఐడిని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశించింది.

క్రిమినల్ కేసుల్లో విచారణ
స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరగడం లేదు

- ప్రజల్లో నెలకొన్న ఈ భావనను తొలగించాలి
- పబ్లిక్ ప్రాసిక్యూటర్లు టేప్ రికార్డర్లుగా వ్యవహరించొద్దు
- జస్టిస్ చంద్రచూడ్ హితవు

9

రాజ్యాంగం మార్చేందుకు బిజెపి కుట్ర

- రిజర్వేషన్లు మొత్తంగా తొలగించే యత్నం
- తెలంగాణ సభల్లో రాహుల్‌గాంధీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో బడుగు, బలహీన వర్గాలకు హక్కులు కల్పిస్తున్న రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర జరుగుతోందని, ఇదే జరిగితే రిజర్వేషన్లు తొలగిపోతాయని ఎఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. వెనుకబడిన తరగతులు, దళితులు, గిరిజనులు, మైనార్టీల హక్కులను బిజెపి లాక్కొనే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశంలో రాజ్యాంగ విధ్వంసానికి, ప్రజల హక్కుల పరిరక్షణకూ మధ్య యుద్ధం జరుగుతోందని చెప్పారు. కొద్దిమంది ధనికులకు లాభం చేసేందుకే మోడీ పనిచేస్తున్నారని, 22 కార్పొరేట్ కుటుంబాలకు రూ.16 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేశారని, అదే తాము రైతులకు రుణమాఫీ చేస్తామంటే రైతులను సోమరిపోతులను చేస్తున్నారని మమ్మల్ని గోడీ మీడియా ప్రశ్నిస్తోందని తెలిపారు. ఆదివారం ఆదిలాబాద్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజవకర్గాల ఎన్నికల ప్రచారంలో భాగంగా..

నిర్మల్ జిల్లా కేంద్రం, గద్వాల జిల్లా ఎర్రవల్లి చౌరస్తా దగ్గర నిర్వహించిన ఎన్నికల జనజాతర సభలో రాహుల్ గాంధీతో పాటు సిఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ప్రధాని మోడీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేయడం అంటే రిజర్వేషన్లను తొలగించడమేనని చెప్పారు. రాజ్యాంగాన్ని కూలగొట్టడం ద్వారా బిజెపి రిజర్వేషన్ వ్యవస్థను నాశనం చేయాలని చూస్తోందని విమర్శించారు. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే 50శాతం ఉన్న రిజర్వేషన్లను మరింత పెంచుతామని తెలిపారు. 80 శాతం ఉన్న పేదలకు నిధులు అందించడంతో పాటు వారి హక్కులు పరిరక్షిస్తామని భరోసా ఇచ్చారు. తెలంగాణలో ఇప్పటికే ఆరు గ్యారంటీల ద్వారా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలను దేశంలోనూ అమలు చేసేలా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కుటుంబంలోని ప్రతి మహిళ ఖాతాలో ఏడాదికి రూ.లక్ష వారి ఖాతాల్లో జమ చేస్తామని హామీనిచ్చారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా డిప్లమా, డిగ్రీ, పీజీ చేసిన నిరుద్యోగ యువతకు ఏడాది పాటు శిక్షణ అందించి ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగాలు కల్పిస్తామని, బాగా పనిచేసిన వారికి ఉద్యోగాన్ని పర్మినెంట్ చేస్తామని తెలిపారు. తెలంగాణలో ఆదివాసీలకు భూమి మీద సర్వహక్కులు కల్పిస్తామన్నారు. మంత్రి సీతక్క సూచన మేరకు ఉపాధిహామీ చట్టంలో భాగంగా ప్రస్తుతం సగటు కూలి రూ.250వరకు వస్తుందని, తాము అధికారంలోకి రాగానే రూ.400 చేస్తామని చెప్పారు. ఆదిలాబాద్ నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల్లో అభ్యర్థులను గెలిపించి పార్లమెంటుకు పంపించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క, తదితరులు హాజరయ్యారు.

ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తాం

- కాగజ్‌నగర్‌సభలో అమిత్ షా
- రెండేళ్లలో పోలవరం పూర్తి చేస్తాం
- ధర్మవరం సభలో హామీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో, అనంతపురం ప్రతినిధి

ముస్లిం రిజర్వేషన్లు రద్దుచేసి వాటిని ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు కేటాయిస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. తన వ్యాఖ్యలను తప్పుగా వక్రీకరించి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. త్రిపుల్ తలాక్ రద్దుతో ముస్లిం సోదరీమణులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో పదికిపైగా ఎంపి స్థానాలు, కేంద్రంలో 400 స్థానాలు బిజెపి దక్కించుకోవడం ఖాయమని, మూడోసారీ మోడీ సర్కార్ ఏర్పాటు కాబోతోందని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ బిజెపి ఎంపి అభ్యర్థి గొడం నగేష్‌కు మద్దతుగా ఆదివారం కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్‌లోని ఎస్పీఎం క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన జనసభలో అమిత్ షా మాట్లాడారు. తెలంగాణలో బిజెపి క్రమక్రమంగా తమ ఓటుశాతాన్ని పెంచుకుంటూ వస్తోందని, విజయం



ధర్మవరం సభలో అభివాదం చేస్తున్న అమిత్‌షా, చంద్రబాబు, బికె పార్థసారథి, పరిటాల సునీతమ్మ తదితరులు

సాధించనున్న పదిస్థానాల్లో ఆదిలాబాద్ ఎంపి స్థానం ఉంటుందన్నారు.

పోలవరాన్ని రెండేళ్లలో పూర్తి చేస్తామని, రాష్ట్ర రాజధానిగా అమరావతే ఉంటుందని శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గ కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో అమిత్‌షా అన్నారు. వైసిపి వల్లే పోలవరం నిర్మాణంలో తీరని జాప్యం జరిగిందని విమర్శించారు. ఈ ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ అప్పులు రూ.13.50 లక్షల కోట్లకు చేరాయని పేర్కొన్నారు. ఈ ఐదేళ్లలో రాష్ట్రాభివృద్ధి పూర్తిగా గాడి తప్పిందని విమర్శించారు. ఇచ్చిన హామీలను కూడా వైసిపి అమలు చేయలేదన్నారు. రాయలసీమకు సాగునీటిని అందించే హంద్రీనీవా, గాలేరు నగరి, వెలుగొండ ప్రాజెక్టులను పూర్తి చేసి కరువు ప్రాంతాలకు సాగునీరందిస్తామని హామీ ఇచ్చారు. ప్రచారంలో ఈ రెండు అంశాలను ప్రస్తావించిన ఆయన రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ అంశాన్నిగానీ, ప్రత్యేక హోదా అంశాన్నిగానీ

మిగతా 2లో

బజరంగ్ పూనియాపై వేటు

- శాంపిళ్లు ఇవ్వనందుకే సస్పెన్షన్ : నాడా
- తానెన్నడూ నిరాకరించలేదన్న రెజ్లర్

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌కు సిద్ధమవుతున్న కుస్తీ యోధుడు, ఒలింపిక్ పతక విజేత బజరంగ్ పూనియాపై 'నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (నాడా)' సస్పెన్షన్ వేటు వేసింది. డోపింగ్ పరీక్షకు మూత్ర నమూనాను ఇవ్వనందునే బజ్‌రంగ్‌పె చర్య తీసుకున్నట్లు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) నియమించిన తాత్కాలిక కమిటీ పేఉర్కొంది. మూత్ర నమూనా ఇవ్వడానికి తాను ఎన్నడూ నిరాకరించలేదని పునియా స్పష్టం చేశారు. నాడా చేసిన ఆరోపణను ఆయన ఖండించారు. కాలం చెల్లిన పరికరాలను డోప్ టెస్టులో ఎందుకు ఉపయోగిస్తున్నారని తాను అడిగితే నాడా నుంచి సమాధానం లేదని ఆయన అన్నారు. అంతకుముందు నాడా ఒక ప్రకటన చేస్తూ మార్చి 10న సోనిపట్‌లో అంతర్జాతీయ వేదికల్లో పోటీపడే అథ్లెట్లు, రెజ్లర్ల నుంచి యూరిన్ శాంపిల్స్ కోరామని, నిర్దిష్ట గడువలోగా పునియా మూత్ర నమూనాలను ఇవ్వలేదని పేర్కొంది. అంతేకాదు శాంపిల్స్ ఇచ్చేందుకు అతడు విముఖంగా ఉన్నాడని కూడా నాడా ట్విటర్ (ఎక్స్) వెల్లడించింది. నాడా ఈ సస్పెన్షన్ వేటు వేయడం ద్వారా ఏప్రిల్ 24న వారణాసిలో జరిగిన పారిస్ ఒలింపిక్స్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు వీలులేకుండా చేసింది. పునియా ఇచ్చే సమాధానాన్ని బట్టి సస్పెన్షన్ ఎంతవరకు ఉంటుందనేది ఆధారపడి ఉంటుందని నాడా తెలిపింది.

ప్రారంభ రౌండ్‌లో రోహిత్ కుమార్‌తో జరిగిన మ్యాచ్‌లో పునియా ఓటమిపాలయ్యాడు. ఇప్పుడీ సస్పెన్షన్ వేటుతో పారిస్ ఒలింపిక్స్‌కు అవశాకాలు మూసుకుపోయినట్టేనని పరిశీలకులు భావిస్తున్నారు.మహిళా రెజ్లర్ల పట్ల కీచకుడిగా వ్యవహరించిన బిజెపి ఎంపి, రెజ్లింగ్

మిగతా 3లో

భూ హక్కుల చట్టంలో
ఎన్‌డిఎ, వైసిపి రెండూ నేరస్తులే

ఈ చట్టంతో గిరిజనులు, పేదరైతులు, గుడిసెవాసులకు తీవ్ర నష్టం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- రాష్ట్రానికి అన్యాయం చేసిన మోడీ ప్రజలకు సంజాయిషీ ఇవ్వాలి
- విశాఖ ఉక్కుపై ప్రధాని ప్రకటన చేయాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భూ హక్కుల చట్టం విషయంలో ఎన్‌డిఎ, వైసిపి రెండూ నేరస్తులేనని, చట్టాన్ని అమలు చేయాలని బిజెపి హుకుం జారీ చేస్తే, వైసిపి ఆగమేఘాల మీద ఆమోదించిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఉదయం విజయవాడ బాలోత్సవ భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావుతో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్రంలో చట్టం తీసుకొచ్చిన బిజెపితో కలిసి ఎన్నికల్లోకి వెళుతున్న చంద్రబాబు దీన్ని ఎలా రద్దు చేస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలను మోసగించేందుకే ఇలా చెబుతున్నారన్నారు. కార్పొరేట్ కంపెనీలకు భూములు కట్టబెట్టేందుకు తీసుకొచ్చిన ఈ చట్టాన్ని అమలు చేయాలని కేంద్రం నీతి ఆయోగ్ ద్వారా అన్ని రాష్ట్రాలకూ హుకుం జారీచేసిందని తెలిపారు. కార్పొరేట్లకు సులభంగా భూముల బదలాయింపు కోసమే ఈ చట్టం తెస్తున్నామని నీతి ఆయోగ్ ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. దీన్ని రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఆమోదించిందని పేర్కొన్నారు. దీని ప్రకారం ప్రతి యజమాని భూమి తనదే అని ప్రాథమిక కమిటీకి దరఖాస్తు చేసుకోవాలని, రెండేళ్ల తరువాత శాశ్వత పట్టా ఇస్తారని పేర్కొన్నారు. ఈలోగా వివాదం వస్తే చిన్న యజమానులు భూములు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల రైతుల భూములకు భద్రతలేని పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్లకు వేల ఎకరాలు కట్టబెట్టేందుకు తీసుకొచ్చిన ఈ చట్టం అమలు చేస్తే రైతుల భూములన్నీ కొద్దిమంది చేతుల్లోకి వెళ్లిపోతాయని అన్నారు. దీనికోసం ఇప్పటికే ఆన్‌లైన్ మ్యుటేషన్ తీసుకొచ్చారని, ఇది కూడా అమలైతే ఎవరి భూములు ఎప్పుడు ఎవరి చేతుల్లోకి వెళతాయో తెలియని దుస్థితి నెలకొంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే సుందరీకరణ పేరుతోనూ ప్రభుత్వ పోరంబోకు భూముల్లో ఇళ్లేసుకున్న పేదల భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తారని పేర్కొన్నారు. చట్టం అమల్లోకి వస్తే ఎవరు అధికారంలో ఉంటే వారు రైతులను బెదిరించి భూములు లాక్కుంటారని, దీనిపై అప్పీలుకు సామాన్య రైతులు కూడా హైకోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతర భూస్వాములు తప్పుడు రికార్డులు సృష్టించి అనుభవిస్తున్నారని, ఆ భూములకు ఇప్పుడు చట్టబద్ధత వస్తుందని హెచ్చరించారు. భూములను ఇష్టం వచ్చినట్లు లాక్కునేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. ఇప్పటికే గిరిజనులు భూముల కోసం న్యాయ పోరాటాలు చేస్తున్నారని, భూ హక్కుల చట్టం వల్ల ఎక్కువగా నష్టపోయేది

మిగతా 2లో

ఎన్నికల విధుల్లోని
ఉద్యోగులందరికీ పోస్టల్ బ్యాలెట్

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగి ఓటు హక్కును ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించరాదని, స్పాట్‌లోనే ఫారమ్-12ను తీసుకోవడంతోపాటు అర్హులైన ఉద్యోగులందరికీ ఓటు హక్కును కల్పించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. ఈ మేరకు ఆదివారం జిల్లా ఎన్నికల అధికారులు, ఆర్ఓలకు ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల విధుల వల్ల కొందరు ఫారం-12ను సకాలంలో సమర్పించకపోయారు. ఈ నేపథ్యంలో ఎన్నికల విధుల్లో ఉన్న ఏ ఉద్యోగి/ఓటరుకు ఓటు హక్కును తిరస్కరించరాదని పునరుద్ఘాటించారు. అనివార్య పరిస్థితుల్లో విధుల్లో ఉన్న ఉద్యోగులు మే 1న సమర్పించలేకపోతే ఎఆర్ఓ పరిధిలో ఆ ఉద్యోగి ఓటరుగా నమోదు అయ్యారో, ఆ ఆర్ఓకు ఫారమ్-12 సమర్పించేందుకు, ఆయా పెసిలిటేషన్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకు అనుమతించాలని సిఇఒ ఆదేశించారు. ఈ నెల 7, 8 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఆ కేంద్రాలు పనిచేస్తాయని తెలిపారు.

వడదెబ్బతో ముగ్గురు మృతి



సుబ్బారావు

సుశీలమ్మ

ప్రజాశక్తి - యంత్రాంగం

ఎండ వేడిమి, వడగాలులకు తాళలేక ఆదివారం ముగ్గురు మృతి చెందారు. ఎన్‌టిఆర్ జిల్లాలో ఇద్దరు, పల్నాడు జిల్లాలో ఒకరు మృత్యువాత పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం అబ్బూరుకు చెందిన గంగదారి సుబ్బారావు (65) వ్యవసాయ పనులతోపాటు పశుపోషణ చేసుకునే జీవనం సాగిస్తున్నారు. రోజుమాదిరే గేదెలను మేపడం కోసం పొలాలకు వెళ్లారు. ఎండకు తాళలేక తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సాయంత్రం ఇంటికి వచ్చి నీరసంతో కూలబడిపోయారు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేయగా అప్పటికే ఆయన మృతి చెందాడు. ఎన్‌టిఆర్ జిల్లా వీరులపాడు మండలం చెన్నారావుపాలెం గ్రామానికి చెందిన కోటా సుశీలమ్మ (80) తీవ్ర వడగాల్పులకు మృతి చెందారు. ఇదే గ్రామానికి చెందిన మేలుగులూరి స్వరాజ్యం (65) ఎండలకు తాళలేక తీవ్ర అస్వస్థతతో మృతి చెందారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు
పంపవచ్చు.

ఆగని ఉక్కపోత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా గత వారం రోజులుగా అత్యధిక ఉష్ణోగ్రతలతో ప్రజలను వడగాడ్పులు ఉక్కిరిబిక్కిరి చేశాయి. దీనికి తోడు ఉక్కపోత ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. 47.7 డిగ్రీల వరకూ నమోదైన ఉష్ణోగ్రతలు ఆదివారం 45.8 డిగ్రీలకు తగ్గింది. నంద్యాల జిల్లా మహానందిలో అత్యధికంగా 45.8 డిగ్రీలు నమోదైంది. అలాగే కర్నూలు జిల్లా జి సింగవరంలో 45.6 డిగ్రీలు, నెల్లూరు జిల్లా వేదనాపి అక్కమాంబపురంలో 45.5, ప్రకాశం జిల్లా వెలిగొండలో 45.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 117 మండలాల్లో వడగాడ్పులు వీచాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కుర్మనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం 29 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం వుందని తెలిపారు.

కేంద్రం నిధులిస్తే రెండేళ్ల ముందే పోలవరం పూర్తయ్యేది: సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం సరిగ్గా నిధులిచ్చి వుంటే రెండేళ్ల ముందే పూర్తయ్యేదని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. పోలవరాన్ని చంద్రబాబు ఎటిఎంలా అవినీతికి వాడుకున్నారని నాడు ప్రధాని నరేంద్ర మోడీ చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రజలకు బిజెపి, టిడిపి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా.. చంద్రబాబు చెప్పిందే మాట్లాడారని విమర్శించారు. కూటమిలో పార్ట్‌నర్ కాబట్టే అమిత్ షా ధర్మవరంలో ఇపుడు మాట మారుస్తున్నారని అన్నారు. ఐదేళ్ల కాలంలో పోలవరాన్ని టిడిపి ఎందుకు పూర్తిచేయలేదో చెప్పాలన్నారు.ల్యాండ్ టైటిలింగ్ యాక్టు అమలైతే భూ కబ్జాలన్నీ వెలుగులోకి వస్తాయనే భూ కబ్జాదారులతో కలిసి చంద్రబాబు, పవన్ కల్యాణ్ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ చట్టంపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా టిడిపి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ చాలా మంచి చట్టం అని కితాబు ఇచ్చారని గుర్తుచేశారు.

ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తావించకపోవడం గమనార్హం. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ.. ల్యాండ్ టైటిల్ యాక్టును తీసుకొచ్చి భూములను కొట్టేసే కుట్రను వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్నారని ఆరోపించారు. పత్రాలపైనా ఆయన బొమ్మలు కూడా వేసుకుంటున్నారని మండిపడ్డారు. ఆయన భూములిచ్చేవాడు కాదని.. దోచేవాడని ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి వస్తే చేనేతపై ఉన్న జిఎస్‌టిని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. మరమగ్గాలకు రూ.500కు ఉచిత విద్యుత్ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నాయకులు చిలకం మధుసూదన్‌రెడ్డి, అనంతపురం జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్, ధర్మవరం బిజెపి అభ్యర్థి సత్యకుమార్, హిందూపురం పార్లమెంటు టిడిపి అభ్యర్థి బికె.పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

మార్క్సిజం అజరామరం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- కారల్ మార్క్స్ జయంతి సందర్భంగా వామపక్షాలు, ప్రజాసంఘాల నివాళి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మార్క్సిజం అజరామరమని, ప్రపంచవ్యాప్తంగా వర్గపోరాటాలు పెరుగుతున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంత కర్త, కార్ల్‌మార్క్స్ 206వ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక హనుమాన్ పేట కూడలి వద్ద ఉన్న మార్క్స్, ఏంగెల్స్ జంట విగ్రహాల వద్ద వామపక్ష పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు శతాబ్దాల క్రితం మార్క్స్ జన్మించి తన జీవితకాలంలో రూపొందించిన మహత్తర శాస్త్రీయ సిద్ధాంతమే కమ్యూనిజమని, అది సజీవంగా యావత్ ప్రజానీకాన్ని చైతన్యపరుస్తోంది, ఈ సిద్ధాంతానికి గుండెకాయ లాంటిది వర్గపోటం నేడు పెరుగుతోందని తెలిపారు.

పెట్టుబడిదారీ వ్యవస్థకు పెద్దన్న లాంటి అమెరికా తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడికి వ్యతిరేకంగా అమెరికాలోని పెద్దపెద్ద విశ్వవిద్యలయాల్లో విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నారని అన్నారు. యూరోపియన్ దేశాల్లోనూ అనేక ప్రతిఘటనలు జరుగుతున్నాయని వివరించారు. పారిస్‌లో లాఠీఛార్జీ చేయాల్సిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. కమ్యూనిజాన్ని సామ్రాజ్యవాదులు ఎంతగా పాతాళానికి తొక్కాలనుకుంటే అది అంతగా పైకి వస్తోందని, పునరుజ్జీవన జరుగుతోందని తెలిపారు. శ్రామిక ప్రజల గుండెల్లో మార్క్స్ సజీవంగా ఉంటారని, ఆయన సిద్ధాంతం అజరామరమని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజల్లో వస్తున్న మార్పు వర్గపోరాటం దిశగా ఉంటుందని అది దోపిడీ వ్యవస్థను అంతమొందిస్తుందని అన్నారు. మార్క్స్ సిద్ధాంతాల ప్రాతిపదికన సోవియట్ యూనియన్, చైనా, వియత్నాం, బ్రెజిల్ వంటి తూర్పు యూరప్ దేశాల్లో విప్లవాలు విజయవంతం అయ్యాయని, సామ్రాజ్యవాద దేశాలను గడగడ లాడించాయని పేర్కొన్నారు. సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ నేడు ప్రపంచ దేశాలపై ఆధిపత్యం కోసం అమెరికా ఇతర దేశాలను రెచ్చగొడుతూ యుద్ధాలను చేయిస్తూ ఉందని అన్నారు. ఎఎన్‌యు విశ్రాంత ఆచార్యులు సి నరసింహారావు, జనసాహితి కార్యదర్శి దివికుమార్, ఐఎఫ్‌టియు నేత రవిచంద్ర మాట్లాడుతూ కారల్ మార్క్స్ మరణానంతరం ఆయన సాహిత్యానికి వ్యతిరేకంగా అనేక పుస్తకాలు రాసినప్పటికి అవేమీ నిలబడలేదన్నారు. ప్రపంచ పెట్టుబడిదారీ దేశాలు ఆర్థిక సంక్షోభాన్ని, నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాసు, రాష్ట్ర కమిటీ సభ్యులు జె జయరాం, రైతు సంఘం నాయకులు వై.కేశవరావు, ప్రోగ్రెసివ్ ఫోరం ప్రతినిధి తాతారావు, ఇస్కఫ్ కార్యదర్శి అరుణకుమార్, సిపిఐ నాయకులు, వై చెంచయ్య పాల్గొన్నారు.

ఇసుక మాఫియా దారుణం

ట్రాక్టర్‌తో ఢీకొట్టి ఎఎస్‌ఐ హత్య

భోపాల్ : అక్రమ మైనింగ్‌ను తనిఖీ చేసేందుకు వెళ్లిన ఓ పోలీస్ అధికారిని ట్రాక్టర్‌తో తొక్కించి, చంపేసిన దారుణ ఘటన బిజెపి పాలనలోని మధ్యప్రదేశ్‌లో చోటు చేసుకుంది. సెహోర్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ మహేంద్ర బగ్రీ, కానిస్టేబుళ్లు ప్రసాద్ కానోజి, సంజయ్ దూబేలతో కలిసి శనివారం అక్రమ మైనింగ్ జరుగుతున్న ప్రాంతానికి తనిఖీకి వెళ్లారు. వేగంగా వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను ఆపేందుకు యత్నించగా, ఆయనను తొక్కుకుంటూ వెళ్లడంతో మహేంద్ర బగ్రీ అక్కడికక్కడే మరణించారు. ఈ ఘటన నుండి కానిస్టేబుళ్లు తప్పించుకోగలిగారని అధికారులు తెలిపారు. డ్రైవర్, అతని సహాయకుడిని అదుపులోకి తీసుకున్నామని, ట్రాక్టర్ యజమాని పరారీలో ఉన్నాడని చెప్పారు. ట్రక్కు యజమాని గురించి సమాచారం అందించిన వారికి రు.30,000 రివార్డు ఇస్తామని పోలీసులు ప్రకటించారు. ఇసుక మాఫియాలో కీలక నిందితులు అశుతోష్ సింగ్, సురేంద్ర సింగ్‌లపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. మధ్యప్రదేశ్‌లో సోన్ నది నుండి ఇసుక అక్రమ రవాణా దందా జోరుగా సాగుతోంది. గతేడాది నవంబర్‌లో సెహదోల్ ఇసుక మాఫియాకు చెందిన ట్రాక్టర్‌తో ఢీకొట్టి, రెవెన్యూ శాఖ అధికారిని హత్య చేసిన సంగతి తెలిసిందే.

ఎఎస్‌ఐని ఢీకొట్టిన ట్రాక్టర్, సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు (ఇన్‌సెట్‌లో) హత్యకు గురైన మహేంద్ర బగ్రీ

రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం

- 259 ఎంయులకు చేరుకున్న రోజువారీ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయిలో నమోదైంది. ఎండల తీవ్రత పెరగడంతో విద్యుత్ వినియోగం కూడా పెరుగుతోంది. రోజువారీ డిమాండ్‌లో గతేడాది నమోదైన వినియోగం కంటే 4 శాతం అదనంగా ఈ ఏడాది పెరిగింది. శనివారం రికార్డు స్థాయిలో 259.173 మిలియన్ యూనిట్లు(ఎంయు)కు చేరుకుంది. గ్రిడ్ డిమాండ్ 13,712 మెగావాట్లుగా నమోదైంది. ఇప్పటి వరకు రోజువారీ డిమాండ్ ఇదే అత్యధికం. శుక్రవారం 258.74 ఎంయులు, గురువారం 256.672 ఎంయుల చొప్పున వినియోగం జరిగింది. గతేడాది మే 18న రోజువారీ డిమాండ్ అత్యధికంగా 251 ఎంయులకు చేరుకోగా, గ్రిడ్ డిమాండ్ 12,653 మెగావాట్లుగా నమోదైంది. అధిక ఉష్ణోగ్రతలు నమోదవ్వడంతో పది రోజుల నుంచి విద్యుత్ వినియోగం పెరుగుతూ సరాసరి 250 ఎంయులకు మించి వినియోగం జరిగింది. రోజూ సుమారు 40 ఎంయుల విద్యుత్‌ను యూనిట్‌కు రూ.7.50 పైబడి విద్యుత్ సంస్థలు ప్రైవేట్ నుంచి కొనుగోలు చేస్తున్నాయి. గతేడాది ఏప్రిల్ చివరిలో, మే మొదటి వారాల్లో వర్షాలు పడి వాతావరణం కొంచెం చల్లగా ఉండటంతో విద్యుత్ వినియోగం తగ్గింది. ఈ ఏడాది ఎండల తీవ్రత ప్రస్తుతం ఉన్న దానికంటే ఇంకా పెరిగే అవకాశం ఉందని విద్యుత్ అధికారులు అంచనా వేస్తున్నారు. విద్యుత్ వినియోగం రోజువారీ డిమాండ్ 265 ఎంయులకు చేరుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

బాబు.. జగన్.. పవన్.. బిజెపి తొత్తులు..!

- ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించండి
- కోవూరు సభలో పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

టిడిపి అధినేత చంద్రబాబునాయుడు, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బిజెపి పార్టీకి తొత్తులని, ఆ పార్టీలకు ఓటేస్తే బిజెపికి వేసినట్లేనని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల అన్నారు. నెల్లూరు జిల్లా కోవూరులో ఆదివారం జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. చంద్రబాబు నాయుడు రాష్ట్ర విభజన తరువాత చేసేందేమి లేదన్నారు. అమరావతిని భ్రమరావతి చేశారని, రాజధానిలో ఒక్క శాశ్వత బిల్డింగ్ కూడా పూర్తి చేయలేదని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానులన్నారనీ, ఒక్క రాజధాని కూడా ఎందుకు కట్టలేకపోయారో చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం, ప్రత్యేక హోదా సాధించడంలో విఫలమయ్యారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పట్టుమని పది పరిశ్రమలు రాలేదని, పరిస్థితి ఇలాగే ఉంటే మన బిడ్డల పరిస్థితి ఏమిటని నిలదీశారు. ఇప్పటికే మన బిడ్డలు ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళుతున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎవరు బాగుపడ్డారని ప్రశ్నించారు. ఒక్క ఏడాదైనా రైతుల కోసం నగదు ఖర్చు చేశారా అని నిలదీశారు. రైతులకు పంట నష్ట పరిహారం ఇవ్వలేదన్నారు. ఇలాంటి వ్యక్తులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలు సాధిస్తారా? అని ప్రశ్నించారు. తనను గెలిపిస్తే రైతులకు మద్దతు ధర కోసం రూ.మూడు వేల కోట్లతో నిధి ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో 2.25 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీ చేయకుండా ఇన్నాళ్లు గుడ్డి గుర్రానికి జగన్ పళ్లు తోముతున్నారా? అని ప్రశ్నించారు. వీళ్లకు ఎందుకు ఓటు వేయాలని నిలదీశారు. మద్యపాన నిషేధం చేస్తానని చెప్పి నాసిరకం మద్యం అమ్ముతున్నారని ఎద్దేవా చేశారు. బి అంటే బాబు, జె అంటే జగన్, పి అంటే పవన్ అన్నారు. కాంగ్రెస్ పార్లమెంటు అభ్యర్థి కె.రాజును, ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

కోవూరు సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్ షర్మిల

ప్రశాంతంగా ముగిసిన నీట్ - 2024 పరీక్షలు

- 557 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ
- మధ్యాహ్నం 2 నుంచి 5.20వరకు కొనసాగిన పరీక్ష
- 24 లక్షల మందికి పైగా దరఖాస్తులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశ వ్యాప్తంగా మెడికల్ ఎంబిబిఎస్, బిడిఎస్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్(నీట్- 2024) ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పరీక్షను నేషనల్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) నిర్వహించింది. కెమిస్ట్రీకి సంబంధించిన ప్రశ్నలు కొంచెం కష్టంగా వచ్చినట్టు పరీక్షకు హాజరైన విద్యార్థులు వాపోయారు. బోటనీ, జువాలజీ, ఫిజిక్స్ ప్రశ్నలు సాధారణంగా ఉన్నాయని చెప్పారు.అయితే ఒకటీ రెండు ప్రశ్నలు అవుటాప్ సబ్జెక్ట్ నుంచి వచ్చినట్టు విద్యార్థులు భావిస్తున్నందున వాటిపై ఎన్‌టిఏ వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. భారత దేశంతో పాటు ఇతర దేశాల్లో నీట్ పరీక్షను నిర్వహించారు. పరీక్షను మధ్యాహ్న 2గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు నిర్వహించారు. నీట్ పరీక్ష కోసం 24 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు ఎన్‌టిఏ వెల్లడించింది. దేశంలో 557 నగరాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా ఇతర దేశాల్లోని 14నగరాల్లోనూ నీట్ పరీక్షను నిర్వహించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో నీట్ పరీక్షను రాశారు. తెలంగాణలో సుమారు 74 వేల మంది దరఖాస్తు చేసుకోగా, ఆంధ్రప్రదేశ్ నుంచి 60 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. నిమిషం ఆలస్యం నిబంధనను అమలు చేశారు .మూడు గంటల ముందు నుంచే పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించారు. సాధారణ దుస్తులతోనే పరీక్షకు అనుమతించిన నిర్వాహకులు, మధ్యాహ్నం ఒకటిన్నర తర్వాత విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించలేదు. ఇదిలా ఉండగా ఉదయం తొమ్మిది గంటలకే రిపోర్టింగ్ చేయాలని పేర్కొన్న ఎన్‌టిఏ, స్నాక్స్ కూడా ఇవ్వక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

భూ హక్కుల చట్టంలో ఎన్‌డిఎ, వైసిపి రెండూ నేరస్తులే

(మొదటిపేజీ తరువాయి)

గిరిజనులేనని, తీవ్ర అన్యాయానికి గురవుతారన్నారు. సమస్యలు ఉన్నాయని చెబుతున్నారని, మొత్తం భూమిలో 20 శాతానికి మాత్రమే సమస్యలు ఉంటాయని, 80 శాతానికి ఉండవని తెలిపారు. అటువంటప్పుడు 20 శాతం భూ సమస్యలను పరిష్కరిస్తే సరిపోతుందని, అలా కాకుండా కొత్త వివాదాలు సృష్టించే విధంగా ఈ చట్టం ఉందని అన్నారు.

ఇటువంటి అన్యాయమైన చట్టాల అమలుకు బిజెపి దుష్ట ప్రయత్నం చేస్తే వైసిపి అంగీకరించిందని తెలిపారు. బిజెపి దీనిపై వివరణ ఇవ్వాలని సజ్జల అడగడం సిగ్గుచేటని అన్నారు. చట్టం చేయకముందే బిజెపిని నిలేయకుండా ఇప్పుడు మాట్లాడటంలో నిజాయితీ లేదన్నారు. దీనిపై రాష్ట్రంలో పార్టీలు కొట్లాడుకుంటున్నాయని, బిజెపి మాత్రం తేలుకుట్టిన దొంగలా ఉందని అన్నారు. నిజాయితీ ఉంటే ఈ చట్టాన్ని రద్దుచేస్తారా లేదా అని బిజెపిని ఎన్‌డిఎలో ఉన్న చంద్రబాబు నిలదీయాలని కోరారు.

మోడీ అబద్ధాలు, అస్పష్ట ప్రకటనలు

మోడీ వస్తున్న సందర్భంలో రాష్ట్రానికి చేసిన అన్యాయం పై ప్రజలకు ఆయన సంజాయిషీ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకూ రాష్ట్రాభివృద్ధి గురించి ఆయన మాట్లాడటం లేదని, అబద్ధాలు, అస్పష్ట ప్రకటనలు చేస్తున్నా రని తెలిపారు. కీలకమైన విశాఖ ఉక్కుపై అనకాపల్లి సభలో స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అలాగే శంకుస్థాపన చేసిన అమరావతి అభివృద్ధిని అడ్డుకున్నారని, దానికీ సమాధానం చెప్పాలని కోరారు. పోలవరానికి 15 వేల కోట్లు ఇచ్చానని చెబుతున్నారని, అవన్నీ కాంట్రాక్టర్ల చేతుల్లోకి వెళ్లాయని, అక్కడ నష్టపోయిన నిర్వాసిత గిరిజనులకు ఏమీ ఇవ్వలేదని అన్నారు. పునరావాసం కోసం రూ.33 వేల కోట్లు అవసరం అయితే రూ.400 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని, అడవి బిడ్డలను గోదారిలో ముంచారని, దీనిపై రాష్ట్ర ప్రజలకు సంజాయిషీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశాఖ రైల్వేజోన్‌పై నిర్ణయం తీసుకోవాలని చెప్పడం మోసమని, అది విభజన చట్టంలోనే ఉందని అన్నారు. పారిశ్రామిక కారిడార్‌కు కసరత్తు చేస్తున్నామని చెబుతున్నారని, మరి పదేళ్లుగా అధికారంలో ఉండి ఇప్పటి వరకు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. వెనుకబడిన జిల్లాలకు పాతిక కోట్లు చొప్పున ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటేనన్నారు. నాలుగేళ్లు నిధులు ఇచ్చి ఐదో ఏడాది ఇచ్చిన నిధులను కూడా వెనక్కు తీసుకున్నారని తెలిపారు. ఇన్ని విధాలా రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపితో కలిసి చంద్ర బాబు ఎలా న్యాయం చేస్తాడో చెప్పాలని కోరారు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి ఎవరు గెలిచినా పెత్తనం ఢిల్లీ చేతుల్లోకి వెళ్లిపోతుందని అమిత్‌షా పాలన చేస్తారని పేర్కొన్నారు.

ఇండియా వేదిక పార్టీలను గెలిపించాలి

ఒకవైపు ఎన్‌డిఎ, వైసిపి రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తుంటే ఇండియా వేదికలోని కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రత్యేక హోదా ఇస్తామని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలిపేస్తామని హామీ ఇస్తున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇండియా వేదికలోని సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులను రాష్ట్ర ప్రజలు గెలిపించాలని శ్రీనివాసరావు కోరారు.

ఉక్కు ప్రయివేటీకరణతో కార్మికులకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటుపరమైతే కాంట్రాక్టు కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కెఎస్ఎన్.రావు, రామకృష్ణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారానికి 1179వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్ వృద్ధిలో కాంట్రాక్టు కార్మికుల పాత్ర కీలకమన్నారు. కర్మాగారం ప్రయివేటుపరమైతే ముందుగా నష్టపోయేది కాంట్రాక్టు కార్మికులేనని ఆందోళన వ్యక్తం చేశారు. ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేస్తున్న మోడీ సర్కారుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా టిడిపి, జనసేన, వైసిపిలు మద్దతు తెలపడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామన్న ప్రకటన కేంద్రం నుంచి వచ్చేంత వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఉక్కు రక్షణకు పాటుపడే వారికే ఈసారి కార్మికుల మద్దతు ఉంటుందని తెలిపారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి

- మీట్‌ది ప్రెస్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సార్వత్రిక ఎన్నికలు లౌకిక ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేసే శక్తులు, మతోన్మాద శక్తులకు మధ్య జరిగే ఎన్నికలుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అభివర్ణించారు. విజయవాడ లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కంచర్ల జయరాజ్ అధ్యక్షతన మీట్‌ది ప్రెస్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. ఇండియా బ్లాక్, ఎన్‌డిఎ కూటమి మధ్య జరుగుతున్న ఎన్నికలను మేధావులు, రాజకీయ ఉద్దండులు పరిశీలిస్తున్నారన్నారు. 2014లో ఎన్నికల సందర్భంగా మోడీ మౌలిక సమస్యలను పరిష్కరిస్తానని చెప్పడంతోపాటు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని, విదేశీ బ్యాంకుల్లో ఉన్న నల్లధనాన్ని వెనక్కు తీసుకొస్తానని హామీ ఇచ్చారని రామకృష్ణ గుర్తుచేశారు. మోడీ పాలనలో రైతులకు గిట్టుబాటు ధరలు లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, కొత్త ఉద్యోగాల కల్పన చేయకపోగా కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 30 లక్షల పోస్టులను భర్తీ చేయలేదని విమర్శించారు. నిత్యావసరాలు, పెట్రోల్, గ్యాస్ ధరలు బాగా పెరిగాయన్నారు. పేదరికం తగ్గిందంటూనే 80 కోట్ల మందికి ఉచిత రేషన్ అందిస్తున్నామని చెప్పడంలో అర్థం లేదన్నారు. జాతీయ బ్యాంకుల్లో వేల కోట్ల రూపాయలు ఎగనామం పెట్టి విదేశాలకు పారిపోతున్న వారితో బిజెపి కుమ్మక్కైందని విమర్శించారు. మోడీ అధికారం చేపట్టే నాటికి డాలర్ విలువ రూ.59 ఉంటే, నేడు రూ.83 అయ్యిందన్నారు. 1947నుంచి 2014 వరకు పనిచేసిన ప్రధానులు రూ.55 లక్షల కోట్లు అప్పు చేస్తే.. మోడీ హయాంలో అప్పు రూ.205 లక్షల కోట్లకు చేరిందన్నారు. మత ప్రాతిపదికన ఓట్లు చీల్చి మెజార్టీ హిందువుల ఓట్లతో అధికారం నిలబెట్టుకునేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా, విశాఖ రైల్వేజోన్, రామాయపట్నం పోర్టు, కడప స్టీల్ ప్లాంట్ వంటివి మోడీ ప్రభుత్వం చేయలేదన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తామని ప్రకటిస్తున్న బిజెపితో టిడిపి పొత్తుపెట్టుకోవడం సరికాదన్నారు. కేరళలో కాంగ్రెస్, వామపక్షాలు పోటీ చేయటం ద్వారా ప్రభుత్వ వ్యతిరేఖ ఓటు బిజెపికి వెళ్లకుండా చేయగలిగామని అన్నారు. ఐటి, ఇడి, ఎన్నికల కమిషన్ వంటి వ్యవస్థలను చేతులో పెట్టుకుని ప్రతిపక్షాలను మోడీ ప్రభుత్వం బెదిరిస్తోందన్నారు. రాష్ట్రంలో వెయ్యికోట్ల మద్యం స్కామ్ జరుగుతోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి కేంద్రానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. జగన్ ప్రభుత్వం రూ.11 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని దివాలా తీయించిందన్నారు. అనంతరం ఎపియుడబ్ల్యుజె, విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్వర్యాన రామకృష్ణను సత్కరించారు. మీట్‌ది ప్రెస్ కార్యక్

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణపై
మాట తప్పిన పార్టీలను ఓడించాలి

ప్రజాశక్తి -సీలేరు

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని మాటిచ్చి ఓట్లు వేయించుకొని, మోసపుచ్చిన పార్టీలను ఓడించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏవి నాగేశ్వరరావు కార్మికులకు పిలుపు నిచ్చారు. సీలేరులోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన సమావేశం జరిగింది. ముందుగా సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతా రాంబాబు, యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్కే.సుభాన్ మాట్లాడుతూ సీలేరు కాంప్లెక్స్ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని, సెలవులు ఏడాదికి 15 రోజులు పూర్తిస్థాయిలో కల్పించడం లేదని, మహిళలకు నెలసరి సమయంలో ప్రత్యేక సెలవులు ఇవ్వడం లేదని తెలిపారు. అనంతరం ఎవి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇప్పటికే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను ఏపీ జెన్కో ఎమ్‌డి విజయానంద్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. కాంట్రాక్ట్ కార్మికులు ఐక్యంగా పోరాడినప్పుడే విజయం సాధిస్తామని, అందుకు సిఐటియు వెన్నుదన్నుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. జెన్కో ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలు ఇవ్వడానికి సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బి శ్రీధర్ అంగీకరించడం జరిగిందని తెలిపారు. 2022 పిఆర్సి కాంట్రాక్ట్ కార్మికులకు ఇప్పటి వరకు చెల్లించలేదని దాన్ని చెల్లించే విధంగా యాజమాన్యం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ అహమ్మద్, స్థానిక సిఐటియు బ్రాంచ్ అధ్యక్షులు బి.లక్ష్మణ్, కార్యదర్శి టి.విష్ణుకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ రమణ, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

బాండ్ పేపర్‌పై
'జైభారత్' వాగ్దానాలు

- జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-సీతమ్మధార (విశాఖపట్నం)

తాము ఇచ్చే వాగ్దానాలకు చట్టబద్ధత కల్పించేందుకు రూ.100 బాండ్ పేపర్‌పై రాసి ఇస్తున్నామని జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు, ఉత్తర నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి వివి.లక్ష్మీనారాయణ చెప్పారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తాము బాధ్యతతో కూడిన రాజకీయాలు చేయడానికి వచ్చామని, మాయమాటలు చెప్పి ప్రజలను ఏమార్చడానికి రాలేదని తెలిపారు. ఉత్తర నియోజకవర్గం ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే సమస్యలన్నీ పరిష్కరించి ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. తన హామీలకు చట్టబద్ధత కల్పించేలా 34 అంశాలతో కూడిన బాండ్ పేపర్‌ను ఆయన విడుదల చేశారు. తమ పార్టీ నుంచి పోటీ చేస్తున్న మిగతా అభ్యర్థులందరూ ఆయా నియోజకవర్గాల సమస్యలపై బాండ్ పేపర్‌పై రాసి హామీ ఇస్తున్నారని తెలిపారు. విభజన హామీలు అమలు చేయని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వని బిజెపికి టిడిపి, జనసేన ఏ విధంగా మద్దతు పలుకుతున్నాయని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో చేసిన అప్పులపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్‌బిఐ విశాఖ మాడ్యూల్ చీఫ్ రీజనల్ సెక్రటరీగా సూర్య ప్రకాష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విశాఖపట్నం మాడ్యూల్ పరిధిలోని విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఎస్‌బిఐ ఆఫీసర్స్ అసోషియేషన్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఈ ఎన్నికలలో చీఫ్ రీజనల్ సెక్రటరీగా బి.సూర్యప్రకాష్ ఘన విజయం సాధించారు. అలాగే డిప్యూటీ రీజనల్ సెక్రటరీగా టి.గోవిందరాజులు, బాలే రమేష్ నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా (మహిళ) కానూరి స్రవంతి గెలుపొందారు. ఈ నేపథ్యంలో సూర్య ప్రకాష్ చీఫ్ రీజనల్ సెక్రటరీగా ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో సార్ఫ్ (ఎస్ఎఆర్‌బి) సిబ్బంది ఎన్.రమణ, బంగారు నాయుడు, సుబ్రహ్మణ్యం, రవిశేఖర్, ఆనంద్, అప్పారావు, సూర్యారావు, అధిక సంఖ్యలో ఎస్‌బిఐ ఆఫీసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ తోటి సహచరులంతా తమ అనుభవాన్ని, సమర్థతను పరిగణలోనికి తీసుకొని తమను గెలిపించారన్నారు. జనరల్ సెక్రటరీ డి.కిషోర్ కుమార్ సూచనలు, సలహాలతో విశాఖ మాడ్యూల్‌ను శక్తివంతంగా మారుస్తామన్నారు.

బజరంగ్ పూనియాపై వేటు

(మొదటిపేజీ తరువాయి)

ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌పై చర్య తీసుకోవాలని కోరుతూ ఒలింపిక్ పతక విజేత సాక్షి మాలిక్, వినేష్ పోగట్‌లతో కలసి ఢిల్లీలో ధర్నా చేసిన పునియా తన పద్మ శ్రీ అవార్డును, ఇతర పతకాలను వాపసు చేశారు అందుకే ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలో భాగంగా ఈ సస్పెన్షన్ వేటు వేసిందని పలువురు భావిస్తున్నారు. బ్రిజ్‌భూషణ్ సింగ్ పై చర్య లీసుకోవడానికి బదులు ఆతని కుమారుడికి బిజెపి కైసర్‌గంజ్ లోక్‌సభ టికెట్ ఇచ్చింది.

ధర లేదు.. దిగుబడీ లేదు!

- జీడి రైతు కుదేలు

ప్రజాశక్తి - సీతంపేట (పార్వతీపురం మన్యం జిల్లా)

ఏజెన్సీలోని ఆదివాసీలకు అటవీ ఉత్పత్తుల్లో ఆర్థికంగా ఆదుకొనేది జీడి పంట అని చెప్పవచ్చు. సీతంపేట ఏజెన్సీలో గత రెండేళ్లుగా ప్రకృతి వైపరీత్యం వల్ల ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాకపోవడంతో పాటు జీడిపిందె దశలో వర్షాలకు తేనెమంచు, ఎండ తీవ్రత వల్ల జీడిపిందె రాలిపోయి, సగానికి సగం పంట దిగుబడి తగ్గిపోయిందని రైతులు వాపోతున్నారు. దీంతో పాటు గత రెండేళ్లుగా జీడిపిక్కలకు మార్కెట్ ధర లేకపోవడంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. సీతంపేట ఏజెన్సీలో సుమారు 25వేల హెక్టార్లలో జీడి పంట ఉంది. ఈ పంట కొన్నిచోట్ల పంట 30శాతం కూడా దిగుబడి రాలేదు. డిసెంబర్‌లో జీడి పంట పూత దశలో వస్తుంది. ఫిబ్రవరిలో పిందె సమయంలో రెండు వర్షాలు, వడగండ్ల వాన పడడంతో పంట పువ్వు రాలింది. దీంతో పాటు తేనె మంచుతోనూ, మబ్బులతో పిందె నిలిచి పోయింది. దీంతో పాటు ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో పిందె రాలిపోయిం ది. దీంతో పంట దిగుబడి తగ్గిపోయిందని గిరిజన రైతులను ఆందోళన చెందుతు న్నారు. దీంతో పాటు మార్కెట్‌కు సంబంధించి నగదు రూ.50 వేలు మించి రవాణా చేయరాదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేయడంతో నగదు బదిలీ తక్కువ కావడంతో జీడిపిక్కల మార్కెట్ ధర పడిపోయింది. కిలో రూ.110, లేదా రూ.115 మాత్రమే వ్యాపారులు విక్రయిస్తున్నారు. గతేడాది కూడా వంద రూపాయలు మించకపోవ డంతో గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడి రాకపోతే ఎలా అని

దళారులు కొనుగోలు చేసి తరలించేందుకు సిద్ధంగా ఉన్న జీడిపిక్కల బస్తాలు

ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగదు చెల్లింపుల్లేవన్న నెపంతో దళారులు సిండికేట్‌గా మారి జీడిపిక్కలను కారు చౌకగా కొనుగోలు చేసి లాభాలు అర్జిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జీడికి మద్దతు ధర చెల్లించి విక్రయాలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

దిగుబడి రాలేదు

నిమ్మక నారాయణరావు, కంబగూడ గిరిజనుడు.

ఈఏడాది జీడి పంట ఆశించిన స్థాయిలో దిగు బడి రాలేదు. ఐదు ఎకరాలకు గత ఏడాది ఆరు క్వింటాలు దిగుబడి వచ్చింది. ఈ ఏడాది మూడు క్వింటాలు రావడం కష్టం. అలాగే అప్పట్లో జీడి చెట్లు వేసి 42 ఏళ్లయింది. చెట్లు ముదిరి పోవడంతో కాపు తగ్గింది. దీంతో పాటు ప్రకృతి వైపరీత్యం వల్ల పంట తగ్గింది. మార్కెట్ ధర కూడా లేదు.

కిలో రూ.200 చొప్పున కొనుగోలు చేయాలి

ఆరిక భాస్కర్ రావు, సిపిఎం మండల కార్యదర్శి, సీతంపేట.

గిరిజనులు శ్రమించు జీడి పిక్కలు సేకరిం చినా దళారులు సిండికేట్‌గా మారి మార్కెట్ ధర కల్పించక పోవడంతో నష్టాలు చవి చూడాల్సి వస్తు ంది. అధికా రులు స్పందించి రూ.200 చొప్పున కిలో జీడి పిక్కలుకొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

తోట త్రిమూర్తులును చిత్తుగా ఓడించాలి

శిరోముండనం బాధితుల కమిటీ పిలుపు

ప్రజాశక్తి-అమలాపురం

నేరస్తుడైన తోట త్రిమూర్తులను రాబోయే ఎన్నికల్లో మండపేట అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలందరూ గమనించి చిత్తుగా ఓడించాలని వెంకటాయపాలెం శిరోముండనం బాధితుల న్యాయ పోరాట కమిటీ పిలుపునిచ్చింది. ఇప్పటికైనా శిరోముండనం బాధితులకు పూర్తిస్థాయి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురంలో స్థానిక బివి రమణయ్య కాలనీలో దళిత ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షుడు దళిత ఐక్యవేదిక చైర్మన్ డిబి లోక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మానవ హక్కుల వేదిక, పౌర హక్కుల సంఘం, పిడిఎస్‌యు, దళిత బహుజన మహిళా శక్తి, అఖిల భారత రైతు కూలీ సంఘం, పిడిఎం, కెవిపిఎస్, విసికె పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిబి లోక్ మాట్లాడుతూ వెంకటాయపాలెం దళిత యువకులకు శిరోముండనం చేసి 29 ఏళ్లుగా కేసు నుంచి తప్పించుకోవడానికి అక్రమంగా విశ్వ ప్రయత్నాలు చేసిన ప్రధాన నిందితుడు తోట త్రిమూర్తులుకు కోర్టు జైలు శిక్ష వేసినప్పటికీ వైసిపి ఎంఎల్ఎ టికెట్ ఇవ్వడం అప్రజాస్వామికమన్నారు. 29 ఏళ్లుగా అనేక ఒడిదుడుకులకు తట్టుకొని నిందితుడు తోట త్రిమూర్తులు చేసిన అరాచకాలకు నిలబడి పోరాటం చేసిన బాధితులకు పూర్తిస్థాయి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చట్ట ప్రకారం తోట త్రిమూర్తులకు వేసిన శిక్ష ఆమోదయోగ్యంగా లేదని శిక్షను ఐదేళ్ల వరకూ పెంచాలన్నారు. నేరస్తులను చట్టసభలకు పంపడం సిగ్గుచేటన్నారు. శిరోమండనం కేసులో బాధితులకు పూర్తిస్థాయి న్యాయం చేయడానికి ప్రభుత్వమే ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్ చేయాలని నేరస్తుడికి విధించిన శిక్షను పెంచి తక్షణం అమలు చేయాలని బాధితులను చట్టప్రకారం అన్ని విధాల ఆదుకోవాలని ఇప్పటికైనా ఎన్నికల సంఘం స్పందించి తోట త్రిమూర్తులను ఎన్నికల్లో పోటీకి అనర్హుడిగా ప్రకటించి ఎంఎల్ఎ పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధితులకు పూర్తిస్థాయి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో న్యాయ పోరాట కమిటీ కో కన్వీనర్ రేవు నాగేశ్వరరావు, హెచ్‌ఆర్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏడిద రాజేష్, డిబిఎంఎస్ జాతీయ కన్వీనర్ కొంకి రాజమణి, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జనుపల్లి సత్తిబాబు, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.బాబూరావు, పిడిఎం నాయకుడు దీపాటి శివప్రసాద్, కెవిపిఎస్ డివిజన్ అధ్యక్షుడు శెట్టిబత్తుల తులసీరావు, విసికె పార్టీ జిల్లా అధ్యక్షుడు బొంతు రమణ, దళిత సేన అధ్యక్షుడు మెండి డేవిడ్ అంబేద్కర్, మాల మహానాడు నాయకులు గెద్దాడ బుద్ధరాజ్, కొండేపూడి రవి పాల్గొన్నారు.

సంబల్‌పూర్ - కాచిగూడ మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ప్రయాణికుల అదనపు రద్దీ దృష్ట్యా ఈస్ట్ కోస్ట్ రైల్వే దువ్వాడ మీదుగా సంబల్‌పూర్ - కాచిగూడ మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 08323 సంబల్‌పూర్-కాచిగూడ వేసవి ప్రత్యేక రైలు మే 13 నుంచి జూన్ 24 వరకు ప్రతి సోమవారం రాత్రి 21.00 గంటలకు సంబల్‌పూర్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 07.20 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 07.25 గంటలకు బయలుదేరి అదేరోజు రాత్రి 21.50 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. 08324 కాచిగూడ - సంబల్‌పూర్ వేసవి ప్రత్యేక రైలు మే 14 నుండి జూన్ 25 వరకు ప్రతి మంగళవారం రాత్రి 23.20 గంటలకు కాచిగూడలో బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 12.35కి బయలుదేరి అదేరోజు రాత్రి 23.45 గంటలకు సంబల్‌పూర్ చేరుకుంటుంది. ఈ రైళ్లు బార్‌ఘర్ రోడ్డు, బలంగీర్, తిట్లాగఢ్, కేసింగ, మునిగూడ, రాయగడ, పార్వతీపురం, బొబ్బిలి, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, దువ్వాడ, అనకాపల్లి, తుని, పిఠాపురం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, మిర్యాలగూడ, నల్గొండ, చెర్లపల్లి, మల్కాజిగిరి మీదుగా ప్రయాణిస్తాయి.

అక్కడంతా అధికారుల పెత్తనమే..!

- మారని కదిరి మున్సిపల్ అధికారుల తీరు
- అవినీతి అక్రమాలపై పెద్దఎత్తున విమర్శలు
- 'కారుణ్య సాయం'పై ప్రజాశక్తి కథనంతో అధికారుల్లో ఉలికిపాటు

ప్రజాశక్తి-కదిరి టౌన్

అనంతపురం జిల్లా కదిరి మున్సిపాల్టీలో కొందరు అధికారుల తీరు మారడం లేదు. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు అవినీతి అక్రమాల్లో మునిగిపోయారనే విమర్శలు ఉన్నాయి. న్యాయబద్ధంగా చేయాల్సిన పనులకు కూడా ఓ రేటు నిర్ణయించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇలా కొందరు అధికారుల తీరుతో కదిరి మున్సిపాల్టీపై రోజురోజుకూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాశక్తి కథనంతో అధికారుల్లో ఉలికిపాటు..!

ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ పట్టణ పరిశుభ్రత కోసం మున్సిపల్ కార్మికులు వారి ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి విధులు నిర్వహిస్తుంటారు. ప్రజల కోసం వారు చేస్తున్న సేవలు చాలా గొప్పవనే చెప్పాలి. కదిరి మున్సిపాల్టీలో ఇలా విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో ఏడుగురు చనిపోయారు. వీరికి ప్రభుత్వం నుంచి కారుణ్య సాయం కింద ఒక్కొక్కరికి రూ.2 లక్షల సాయం అందింది. ఈ సాయం పంపిణీలో కొందరు మున్సిపల్ అధికారులు చేతివాటం ప్రదర్శించినట్లు తెలుస్తోంది. ఒక్కో కార్మికుని నుంచి రూ.50వేలు తీసుకున్నట్లు సమాచారం. ఈ అవినీతి బాగోతంపై గత నెల 27వ తేదీన ప్రజాశక్తిలో 'కారుణ్య సాయం మంజూరులో

అధికారుల చేతివాటం' అన్న శీర్షిక కథనం వెలువడింది. ఈ కథనం మున్సిపాల్టీలో పెద్ద ఎత్తున కలకలం రేపింది. ప్రజాశక్తిలో కథనం రాగానే అప్రమత్తమైన మున్సిపల్ అధికారులు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగా గత వారం ఏడుగురు కార్మికుల కుటుంబ సభ్యులను కార్యాలయానికి పిలిపించుకుని మాట్లాడారు. డబ్బులు తీసుకున్న విషయాన్ని విలేకరులకు ఎవరు చెప్పారంటూ కార్యాలయంలోని ఓ అధికారి కార్మికులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. తాము చెప్పినట్లు విధులు నిర్వహించకపోతే కష్టాలు తప్పవనే రీతిలో బెదిరింపులకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో తాము ఎవరికీ డబ్బులు ఇవ్వలేదంటూ కార్మికులతో అధికారులు బలవంతంగా కాగితంపై వేలిముద్రలు, సంతకాలు చేయించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయం

తెలుసుకున్న కార్మిక సంఘం నాయకులు మున్సిపల్ ఉన్నత స్థాయి అధికారిని కలిసి కార్మికుల పక్షాన మాట్లాడారు. అవినీతిపై కథనం వస్తే సంబంధిత అధికారులను విచారించాల్సింది పోయి ఇలా కార్మికులతో బలవంతంగా సంతకాలు చేయించుకోవడం ఏమిటంటూ అధికారులను నిలదీశారు. అధికారులు మాత్రం దీనికి పొంతనలేని సమాధానాలు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేశారు.

అక్రమార్జనకు ప్రాధాన్యత

కదిరి మున్సిపాల్టీలో కొందరు అధికారుల అవినీతి పరాకాష్టకు చేరిందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. గతంలో ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల ప్రొహిబిషన్‌ను డిక్లరేషన్ చేసింది. ఈ సందర్భంలో మున్సిపాల్టీలోని ఓ అధికారి ప్రొహిబిషన్ డిక్లరేషన్ నిమిత్తం సంబంధిత సచివాలయ ఉద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు విమర్శలు ఉన్నాయి. మున్సిపాల్టీలో ఏ పనికి సంబంధించిన ఫైళ్లపై సంతకం పెట్టాలన్నా పైకం ముట్టజెబితేనే పని జరుగుతుందనే వాదన విన్పిస్తోంది. ఇక రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా లేని విధంగా కదిరి కదిరి మున్సిపాల్టీలో కొత్త రకం నిబంధనలు అమలవుతున్నట్లు తెలుస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న శానిటేషన్, ఎన్విరాన్మెంట్స్ సెక్రటరీలకు రాష్ట్ర హెచ్‌ఆర్‌ఎస్ లాగిన్‌లో సాధారణ సెలవులు ఉన్నట్లు చూపిస్తుంది. కదిరిలో మాత్రం ఆదివారం, ఇతర సెలవుదినాల్లో కూడా ఈ సిబ్బందితో పనులు చేయించుకుంటున్నారు. ఇలా కదిరి మున్సిపాల్టీలో కొందరు అధికారులు ఇష్టారీతిన వ్యవహరించి అక్రమాలకు పాల్పడుతూ పురపాలక సంఘానికి చెడ్డ పేరు తెస్తున్నారు. దీనిపై సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి లోతైన విచారణ జరిపిస్తే అవినీతి అధికారుల బాగోతం బయటకు వస్తుందని పట్టణ ప్రజలు భావిస్తున్నారు.

భారీగా మద్యం పట్టివేత

- రూ.30 లక్షల తెలంగాణా మద్యం పట్టివేత
- ఐదుగురు నిందితుల అరెస్టు
- నందిగామలో గోవా మద్యం హల్‌చల్ !

ప్రజాశక్తి - మైలవరం/ నందిగామ

ఎన్నికల వేళ భారీగా అక్రమ మద్యం రవాణా అవుతోంది. తెలంగాణా నుండి ఆంధ్రాలోకి వస్తున్న మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుంటున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా మైలవరం, రెడ్డిగూడెం మండలాల్లో భారీగా డంప్‌చేస్తున్న తెలంగాణా మద్యాన్ని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఎస్ఇబి) పోలీసులు పట్టుకున్నారు. సుమారు 400 మద్యం కేసులను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.30 లక్షల వరకూ ఉంటుందని అంచనా. మైలవరం మండలం అనంతరం, రెడ్డిగూడెం మండలం రంగాపురం పంచాయతీ శివారు రెడ్డికుంటలో అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీనిని మైలవరంలోని ఎస్ఇబి కార్యాలయానికి తరలించారు. ఈసందర్భంగా ఎస్ఇబి అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సి.భార్గవ ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం....మద్యం అక్రమ మద్యం రవాణాపై పోలీసులు నిఘాను కట్టుదిట్టం చేశారు. ఎస్ఇబికి అందిన నిర్దిష్టమైన సమాచారం మేరకు మైలవరం మండలం అనంతరం గ్రామంలో ఎన్నికల్లో పంపిణీ చేసేందుకు డంప్ చేసిన 150 మద్యం కేసులను ఎస్ఇబి ఎస్ఐలు, సిబ్బంది దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులు ఇచ్చిన సమచారం మేరకు రెడ్డిగూడెం మండలం రెడ్డికుంట గ్రామంలోని ఒక మామిడి తోటలో డంప్ చేసిన 250 మద్యం కేసులు స్వాధీనం చేసుకున్నారు. మద్యం తరలిస్తున్న ఒక ఆశోక్ లెల్యాండ్, షిఫ్ట్ డిజైర్ కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో మద్యంతో సంబంధం ఉన్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని పూర్తి స్థాయిలో విచారిస్తున్నారు. వీరంతా రెడ్డిగూడెం మండలానికి చెందినవారే. భారీఎత్తున మద్యాన్ని

అధికారులు పట్టుకున్న అక్రమ మద్యం

పట్టుకున్న ఎస్ఐలను, సిబ్బందిని ఎస్ఇబి సూపరింటెండెంట్ భార్గవ అభినందించారు. ఈ దాడుల్లో ఎస్ఇబి సిఐ ఐ.నాగవల్లి, ఎస్ఐలు రమాదేవి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు. నిందితులంతా టిడిపికి చెందిన వారు కావడం గమనార్హం.

నందిగామలో గోవా మద్యం పంపిణీ

నందిగామలో విచ్చలవిడిగా గోవా మద్యం పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఇప్పటికే అడపాదడపా రాత్రి సమయాల్లో కార్యకర్తలకు ఈ మద్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు తెలిసింది. వైసిపి, టిడిపి అభ్యర్థుల నామినేషన్ల దాఖలు సందర్భంగా జరిగిన ర్యాలీ అనంతరం ఈ మద్యం పంపిణీ జరిగినట్లు సమాచారం. పోలింగ్‌కు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఈ మద్యం పంపిణీ చేసేందుకు ఎక్కడిక్కడే నిల్వ చేసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే పంపిణీ అయిన ఈ మద్యం బాటిళ్లపై "గోవాలో మాత్రమే ఈ మద్యం అమ్మకం జరపాలి" అంటూ ముద్రించి ఉంది. రాయల్ క్వీన్ పేరు కలిగిన ఈ మద్యం బాటిల్ ఎంఆర్‌పి ధర రూ.26 అని, 2020లో తయారీ అని కూడా బాటిళ్లపై ముద్రించి ఉంది.

రోడ్లు నిర్మిస్తేనే ఓట్లు వేస్తాం

- పివిటిజిల వినూత్న నిరసన

ప్రజాశక్తి-అనంతగిరి (అల్లూరి సీతారామరాజు జిల్లా)

తమ పివిటిజీ గ్రామాలకు రోడ్లు వేస్తేనే ఓట్లు వేస్తామని, లేకుంటే ఎన్నికలను బహిష్కరిస్తామని గుర్రలెక్కి వినూత్న రీతిలో పివిటిజీలు నిరసన చేపట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని మడ్రెబు, దాయార్తి గ్రామాలకు చెందిన పివిటిజిలు ఆదివారం నిరసన చేపడుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పివిటిజి ఆదివాసి గిరిజన సంఘం నాయకులు కె.నర్సింగరావు, కె.దాసు, ఎస్.సుధాకర్‌లు మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చి ఏళ్ళు గడుస్తున్నా పివిటిజీ గ్రామాలు అభివృద్ధి చెందలేదన్నారు. పివిటిజిల సంక్షేమం, అభివృద్ధికి కోట్ల నిధులు వెచ్చిస్తున్నట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మాటలు ప్రకటలకే పరిమితమయ్యాయన్నారు. కనీసం రోడ్డు సౌకర్యం లేదని, దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మడ్రెబు గ్రామంలో 45 కుటుంబాలు 170 జనాభా, 70 మంది ఓటర్లు ఉన్నామని, పెద్దకోట పంచాయతీ పెద్దకోట, వేలమామిడి పోలింగ్ బూత్‌లో ఓట్లు వేసేందుకు 30 కిలో మీటర్లు వెళ్ళవలసి ఉంటుందని తెలిపారు. 2017, 2022 సంవత్సరంలో రోడ్డు నిర్మించేందుకు నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు పూర్తి చేయకుండా వదిలి వేసారని, దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకున్న నాధుడే కరువయ్యారన్నారు. రోడ్డు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

తిరుపతి- చెన్నై మధ్య 'వందే భారత్'

- రెండు నెలలు ట్రయల్ రన్ నిర్వహణ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

వందే భారత్ రైళ్లకు మనదేశంలో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. వందే భారత్ స్లీపర్ రైళ్లను తీసుకువస్తున్న భారతీయ రైల్వే.. వీటితో పాటు వందే భారత్ మెట్రో రైళ్లను కూడా ప్రవేశపెడుతోంది. ఇప్పటికే చెన్నైలోని రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో ఇవి రూపుదిద్దుకున్నాయి. వచ్చే జులై నుంచి వందే భారత్ మెట్రో రైళ్ల పరుగులు పెట్టే అవకాశం ఉండగా.. ఆంధ్రప్రదేశకు కూడా వందే మెట్రోను కేటాయిస్తారని సమాచారం. ఏపీలోని తిరుపతి, తమిళనాడులోని చెన్నై నగరాల మధ్య వందే భారత్ మెట్రో రైలును నడపనున్నట్లు సమాచారం. జులై నెలలోట్రయల్ రన్ కూడా చేపట్టనున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. రెండు వారాల ట్రయల్ రన్ పూర్తైన తర్వాత పూర్తిస్థాయిలో తిరుపతి- చెన్నై మార్గంలో నడపాలని కేంద్రం నిర్ణయించింది. అందులో భాగంగానే చెన్నై- తిరుపతి మధ్య వందే మెట్రో రైళ్ల నడిపేందుకు రెండు నెలలు ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు. ఇదివరకే వందే భారత్ రైళ్ల అందుబాటులో ఉండగా, 200 కి.మీ పరిధిలో ఉన్న నగరాలను అనుసంధానిస్తూ ఈ ఏడాది వందే మెట్రో రైళ్ల నడిపేందుకు భారత రైల్వే బోర్డు నిర్ణయించింది.

అన్ని రంగాల్లోనూ బిసిలకు కీలకం

ప్రజాశక్తి - కదిరి అర్బన్

బిసిలు అంటే వెనకబడిన వారు కాదని చట్టసభలతో పాటు అన్ని శాఖల్లోనూ వెన్నెముక లాంటి వారని రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని దత్త ఫంక్షన్ హాల్లో వైసిపి బిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తల హరిప్రసాద్, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తల వెంకటరమణల ఆధ్వర్యంలో నిర్వహించిన బిసిల ఆత్మీయ సదస్సుకు ముఖ్య అతిథులుగా బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి బివిఎస్ మక్బూల్, హిందూపురం పార్లమె

2024 ప్రజాశక్తి www.prajasakti.com
సార్వత్రిక సమరం
2024
విజయవాడ
సోమవారం 6 మే 2024

ఛత్తీస్‌గఢ్‌లో బిజెపికి ఎదురుగాలి

- ఆదివాసీల అణచివేత... మావోయిస్టుల కాల్చివేత
- అదానీ కోసం లక్షల చెట్ల నరికివేత
- వనరులపై కార్పొరేట్ల పంజా
- కాంగ్రెస్‌కు రాహుల్ జోడో యాత్ర మేలు
- రేపు 7 స్థానాల్లో పోలింగ్

కోడె హేమలత

ఛత్తీస్‌గఢ్‌లోని మొత్తం 11 నియోజకవర్గాల్లో దేశ వ్యాప్తంగా ఏప్రిల్ 26న జరిగిన రెండవ దశలో 4 స్థానాల్లో ఎన్నికలు జరిగాయి. మిగిలిన ఏడు సీట్లకు మూడో విడతలో మే 7న పోలింగ్ జరగనుంది. జాంజ్‌గీర్, బిలాస్‌పుర్, కోర్బా, రాయ్‌గఢ్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ బలంగాఉంది. బిజెపి హిందుత్వ రాజకీయాలను, కార్పొరేటీకరణకు గిరిజనులు వ్యతిరేకిస్తున్నారు. రాజధాని రాయ్‌పుర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి వికాస్ ఉపాధ్యయ్‌కు పోటీగా బిజెపి అభ్యర్థి బ్రిజ్‌మోహన్ అగర్వాల్ పోటీ పడుతున్నారు. ఈసారి బిజెపి సిట్టింగ్ ఎంపి సునీల్ సోనీని మార్చేసి సీనియర్ ఎంఎల్ఎ అగర్వాల్‌కు ఇచ్చింది. ఈ స్థానంలో ఏడుసార్లుగా బిజెపి గెలుస్తోంది. స్టీల్, ఇనుము, పరిశ్రమల కార్మికులు ఎక్కువగా ఉన్నారు. మూడు లక్షల మంది ఎస్సీలు, 1,28 లక్షలమంది ఎస్టీలు ఉన్నారు. ఇక్కడ 11.29 లక్షల పట్టణ ఓటర్లే కీలకం. దుర్గ్ లోక్‌సభ స్థానంలో ఒకసారి కాంగ్రెస్, మరోసారి బిజెపి గెలుస్తున్నాయి. దుర్గ్ పరిధిలోని 9 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ 8, బిజెపి ఒకటి గెలిచాయి. దుర్గ్ ప్రాంతానికి దగ్గరలోనే బిలాయ్ స్టీల్ ప్లాంట్ ఉంది. రాష్ట్రంలో అభివృద్ధి చెందిన నగరాల్లో దుర్గ్ ఒకటి. కాంగ్రెస్ నుంచి రాజేంద్ర సాహుకు పోటీగా బిజెపి సిట్టింగ్ ఎంపీ విజయ్ బఘెల్ పోటీపడుతున్నారు.

ఆదివాసీ ప్రాబల్యమున్న జాంజ్‌గీర్ ఎస్సీ రిజర్వుడు సీటు. కాంగ్రెస్ నుంచి శివ్‌కుమార్ డహ్రియా, బిజెపి నుంచి కమలేశ్ జంగడే తలపడుతున్నారు. గత ఎన్నికల్లో బిజెపి గెలుపొందింది. రాహుల్ జోడో యాత్ర ఛత్తీస్‌గఢ్‌లో జాంజ్‌గీర్ నుంచే ప్రారంభమైంది. గిరిజనులు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. మోడీ పర్యటనలో భాగంగా ఏప్రిల్ 23న జంజ్‌గిర్-చంపాలో జరిగిన ర్యాలీలో రామనామి తెగ మతపెద్దలను (ముఖంపై రామనామం పచ్చబొట్టు వేయించుకున్నవారు) మోడీ తన పక్కనే కూర్చోబెట్టుకోవడం, అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ట ఆహ్వానాన్ని కాంగ్రెస్ తిరస్కరించడం రాముడి తల్లి ఇలాకా అయిన ఛత్తీస్‌గఢ్‌కు అగౌరవం కాదా అని మోడీ చేసిన వ్యాఖ్యలు మతతత్వ రాజకీయాలకు అద్దంపడుతున్నాయని విశ్లేషకులు అంటున్నారు. క్రైస్తవ మిషనరీల ముసుగులో మతమార్పిడిలకు పాల్పడుతున్నారని బిజెపి సిఎం స్వయంగా ఆరోపించారు. రాయగఢ్‌లో

- గిరిజన హక్కులను కాలరాసి కార్పొరేట్ ప్రయోజనాల కోసం బిజెపి పనిచేస్తోంది. కార్చిచ్చులు పేరిట, మైనింగ్ ప్రాజెక్టుల కోసం అరణ్యాలను కరిగించేస్తోంది. నీరు, అరణ్యం, భూముల కోసం ఆదివాసీల ఆందోళనలను రాష్ట్ర బిజెపి ప్రభుత్వం అమానుషంగా అణచివేస్తోంది.
- రెండేళ్లలో నక్సలైట్లను ఏరిపారేస్తామన్న కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటనను రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తోంది. ఏప్రిల్ 16న 29 మంది, 30న 10 మంది మావోయిస్టులను భద్రతా బలగాలు ఎన్‌కౌంటర్ చేశాయి. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 91 మంది మావోయిస్టులు పోలీస్ కాల్పుల్లో చనిపోయారు. 123 మంది అరెస్టు కాగా, 250మంది లొంగిపోయారు. లోక్‌సభ ఎన్నికలపై ఈ పరిణామాల ప్రభావం పడుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

చెట్ల నరికివేతపై వ్యతిరేకత

బిలాస్‌పుర్‌లో కాంగ్రెస్ నుంచి దేవేంద్ర యాదవ్‌కు పోటీగా బిజెపి అభ్యర్థి తోఖన్‌సాహు బరిలో నిలిచారు. దేవేంద్ర యాదవ్ బిలాయ్ నగర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే ఈ టిక్కెట్ జగదీష్ కౌశిక్ తనకు కేటాయించాలని కోరినప్పటికీ దేవేంద్రకే సీటు దక్కింది. దేవేంద్ర యాదవ్ దేశంలోనే అతి చిన్న వయస్సులో 25 ఏళ్లకే మేయరుగా ఎన్నికయ్యారు. ఈ ప్రాంతంలోనూ రాహుల్ పర్యటించారు. సర్గుజా ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి గోండ్ వర్గానికి చెందిన యువనాయకురాలు శశి సింగ్‌తో బిజెపి అభ్యర్థి చింతామణి మహారాజ్ పోటీ పడుతున్నారు. 2023లో చింతామణి కాంగ్రెస్ నుంచి బిజెపిలోకి చేరడంతో ఆయనకు ఈ సీటు దక్కింది. అదానీ గ్రూపు బొగ్గు గనుల కోసం 2 లక్షలకు పైగా చెట్ల నరికివేత బిజెపి ప్రభుత్వం పట్ల స్థానిక ప్రజలు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు.

గోండు గిరిజనుల ప్రాబల్యమెక్కువ. ఎస్టీలకు రిజర్వ్ చేయబడిన ఈ స్థానంలో కాంగ్రెస్‌కు పట్టుంది. కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపి పుష్పాదేవికి బదులు ఆమె చెల్లి మేనకా దేవికి టిక్కెట్టు దక్కింది. మేనకా తండ్రి రాజానరేష్ చంద్రసింగ్ మధ్యప్రదేశ్ కాంగ్రెస్ సిఎంగా, మంత్రిగా పనిచేశారు. బిజెపి నుంచి రాథేశ్యాం రాఠియా పోటీ చేస్తున్నారు.

బొగ్గు కాలుష్య సమస్య

దేశంలోనే అత్యధిక బొగ్గు ఉత్పత్తి జరిగే జిల్లా కోర్బాలో మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. పోటీ కూడా మహిళల మధ్యే నడుస్తోంది. కాంగ్రెస్ అభ్యర్థి జోత్స్న మహంత్‌కు పోటీగా బిజెపి అభ్యర్థి సరోజ్ పాండే పోటీ పడుతున్నారు. ఈ నియోజకవర్గంపై కాంగ్రెస్‌కు పట్టుంది. 2014 మినహా ప్రతిసారీ కాంగ్రెస్ గెలుపొందుతోంది. సరోజ్‌పాండే రాజ్యసభ సభ్యురాలు, గతంలో దుర్గ్ నుంచి ఎంపిగా ఎన్నికయ్యారు. బొగ్గు గనుల నుంచి వచ్చే దుమ్ము వల్ల పర్యావరణ కాలుష్యం, గనుల కోసం భూములిచ్చిన వారికి పరిహారం, ఉద్యోగ కల్పన వంటి స్థానిక సమస్యలున్నాయి.

స్మృతి ఇరానీని ఓడించడం ఖాయం



అమేథీ : కాంగ్రెస్ పార్టీ ఎన్నోరోజులు చర్చలు జరిపి అమేథీ, రాయ్‌బరేలీ నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. రాయ్‌బరేలీ నుంచి రాహుల్ గాంధీ, అమేథీ నుంచి కిశోరీలాల్ శర్మ పోటీ చేస్తున్నారు. అమేథీ నుంచి బరిలోకి దిగిన కెఎల్ శర్మ మీడియాతో మాట్లాడుతూ.. 'ఈ ఎన్నికల్లో స్మృతి ఇరానీని ఓడించడం ఖాయం. ఇది నేను చేస్తున్న పెద్ద ప్రకటన. నేను అమేథీ నుంచి పోటీ చేయడమనేది అధిష్టానం నిర్ణయం.' అని అన్నారు. కాగా, కెఎల్ శర్మ 1983లో రాజీవ్ గాంధీతో కలిసి పనిచేశారు. 1991లో రాజీవ్ గాంధీ తర్వాత కెప్టెన్ సతీష్ శర్మతో కలిసి అమేథీలో పనిచేశారు. ఆ తరువాత సోనియగాంధీ 1999లో అమేథీ నుంచి పోటీ చేసినప్పుడు ఆ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా పనిచేశారు. ఆ తర్వాత రాయ్‌బరేలీ, అమేథీ రెండుస్థానాలకు ఆయన ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. గాంధీయేతర కుటుంబ సభ్యులు అమేథీ నియోజకవర్గం నుంచి పోటీ చేయడం ఇది రెండోసారి. గతంలో 1991లో ఈ స్థానం నుంచి సతీష్ శర్మ లోక్‌సభకు ఎన్నికయ్యారు. 2019లో రాహుల్‌గాంధీ ఓడిపోయే వరకు అమేథీ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా నిలిచింది.

పూరి కాంగ్రెస్ అభ్యర్థిగా జై నారాయణ్ పట్నాయక్

పూరీ : ఒడిశాలోని పూరీ నియోజకవర్గానికి ఇంతకు ముందే ఖరారైన సుచరిత బదులు జై నారాయణ్ పట్నాయక్‌ని అభ్యర్థిగా కాంగ్రెస్ ప్రకటించింది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు. మాజీ ఎంపి బ్రజామోహన్ మహంతీ కుమార్తె, మాజీ జర్నలిస్టు అయిన సుచరితా మహంతిని కాంగ్రెస్ పార్టీ పూరీ నియోజకవర్గానికి తొలుత ప్రకటించింది. అయితే తన దగ్గర డబ్బుల్లేవంటూ ఎన్నికల్లో పోటీ చేయనని తేల్చి చెప్పారు. తనకు అధిష్టానం ఆర్థిక సహకారం నిరాకరించిందని.. దీంతో తాను ఈ ఎన్నికల్లో పోటీ చేయనని కెసి వేణుగోపాల్‌కు లేఖ రాశారు. సుచరిత పోటీ నుంచి తప్పుకోవడంతో ఆమె స్థానంలో నారాయణ్ పట్నాయక్ బరిలో నిలిచారు. కాగా పూరీ లోక్‌సభ స్థానానికి ఆరోవిడతలో మే 25న పోలింగ్ జరగనుంది. నామినేషన్లకు చివరి గడువు మే 6 వరకు ఉంది.

ఎన్నికల్లో 9 లక్షల మందికి తాత్కాలిక ఉపాధి!



న్యూఢిల్లీ : దేశంలో ఏడు దశల్లో లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికలు ఏప్రిల్ 19వ తేదీన మొదలై.. జూన్ 1 వరకు జరగనున్నాయి. ఇప్పటివరకూ రెండు దశల ఎన్నికలు జరిగాయి.

ఈ నేపథ్యంలో దేశంలో వివిధ దశల్లో జరిగే ఎన్నికల్లో పోలింగ్ బూత్ అధికారులు, క్లర్క్స్, సెక్యూరిటీ సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ట్రాన్స్‌పోర్ట్ కోఆర్డినేటర్స్, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ వంటి ఉద్యోగాల ద్వారా దాదాపు 9 లక్షల మంది యువత తాత్కాలికంగా ఉపాధి పొందుతున్నారని పర్క్ ఇండియా సిఇఒ, కో ఫౌండర్ నీలేష్ డంగర్వాల్ పేర్కొన్నారు. అయితే ఇది తాత్కాలికమేనని.. దేశంలో జాబ్ మార్కెట్‌పై కొంతమేర మాత్రమే ప్రభావం చూపే అవకాశం ఉందని టీమ్‌లీజ్ సర్వీసెస్ సిఇఒ కార్తీక్ నారాయణ్ అన్నారు. ఈ సమయంలో ఉద్యోగాలు పొందేవారి జీతాలు రూ. 15,000 నుంచి రూ. 40,000 వరకు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

జార్ఖండ్ రాజకీయాలపై కల్పన సోరెన్ ముద్ర

- భర్త, మాజీ సిఎం హేమంత్ అరెస్ట్‌తో అనూహ్యంగా పొలిటికల్ ఎంట్రీ
- గాండే అసెంబ్లీ ఉప ఎన్నికల్లో పోటీ
- అక్రమ కేసులపై బిజెపి, మోడీకి పదునైన విమర్శనాస్త్రాలు

(జె.జగదీష్)

జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ భార్య కల్పన సోరెన్ (48) లోక్‌సభ ఎన్నికల వేళ అనూహ్యంగా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఉన్నత విద్యావంతురాలైన కల్పన, బిజెపికి, ప్రధాని మోడీకి సంధిస్తున్న ప్రశ్నలు, హెచ్చరికలు జార్ఖండ్‌నే కాదు యావత్ జాతినే ఆలోచింపజేస్తున్నాయి. కచ్చితంగా జార్ఖండ్ రాజకీయాల్లో కల్పన మార్క్ కనిపిస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తన భర్త హేమంత్ సోరెన్‌ను అక్రమంగా జైలుకు పంపిన తరువాత కల్పన ప్రత్యక్ష రాజకీయాల్లోకొచ్చారు. తన భర్త ఆశయాలను, లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకే రాజకీయాల్లోకొచ్చానంటున్నారు. గాండే అసెంబ్లీ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు జెఎంఎం అభ్యర్థిగా కల్పన సోరెన్ నామినేషన్ దాఖలు చేశారు. రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలతో పాటు ఈ స్థానానికి కూడా మే 20న పోలింగ్ జరగనుంది. జెఎంఎం ఎమ్మెల్యే సర్ఫరాజ్ అహ్మద్ రాజీనామా చేయడంతో గిరిది జిల్లాలోని గాండే స్థానం ఖాళీ అయింది. ఎంటెక్, ఎంబిఎ వంటి ఉన్నత విద్యను పూర్తి చేసిన కల్పన మొన్నటి వరకు గృహిణిగా ఉన్నారు. ఒడిషాలోని మయూర్‌భంజ్ జిల్లాలో బరిపడలో పాఠశాల విద్యను పూర్తి చేసి, భువనేశ్వర్‌లో ఇంజనీరింగ్, ఎంబిఎ డిగ్రీలను పొందారు.

ఆది నుంచీ కమలం కుట్రలు

2019లో హేమంత్ సోరెన్ నేతృత్వంలో జార్ఖండ్‌లో

హేమంత్ లేని లోటు పూడ్చేందుకే..

'నా భర్త అరెస్ట్ ఊహించని విధంగా జరిగింది. ఈ ఘటనతో జెఎంఎం పార్టీ, కుటుంబ సభ్యులు షాక్ కు గురయ్యారు. హేమంత్ అరెస్టు తరువాత పార్టీ కార్యకర్తలు ముందుకు రావాలని కోరారు. వాళ్ల నాయకుడిపై ఉన్న ప్రేమ చూసి, హేమంత్ జీ తిరిగి వచ్చే వరకు ఈ లోటును పూడ్చడం నా నైతిక బాధ్యత అని అనుకున్నాను. అందుకే నేను రాజకీయాల్లోకి ప్రవేశించాను. వంగి నమస్కరించడం గిరిజనుల డిఎన్ఎలో లేదు. హేమంత్ సోరెన్ మరింత బలపడతారు. హేమంత్ సోరెన్ అమాయకుడు, నిర్దోషి. బిజెపి ప్రభుత్వం ముందస్తుగా ప్లాన్ చేసిన కుట్రలో బాధితుడయ్యారు. బిజెపిపై జార్ఖండ్ ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. రాష్ట్రంలోని అపార ఖనిజ సంపదను దోచుకుంటున్న ఈ నిరంకుశ, కార్పొరేట్ శక్తులను వారు నిర్మూలిస్తారు" అని కల్పన అన్నారు.

కల్పన.. బిజెపిని నిరంకుశ శక్తిగా అభివర్ణిస్తూ.. ప్రతిపక్షాలను అణిచివేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయాలు ఎప్పుడూ తను ఎంచుకోలేదని, పరిస్థితులు తనను వాటిల్లోకి నెట్టాయని అన్నారు.

ఎన్‌డిఎలో చేరనందుకే అరెస్ట్

"న్యాయ వ్యవస్థపై మాకు పూర్తి విశ్వాసం ఉంది. ఆయన బెయిల్‌పై బయటకు వచ్చి లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం ఎదురుచూస్తున్నాం. పేదలు, గిరిజనులు, దళితుల కోసం పనిచేసే ప్రతిపక్ష నేతలను అరెస్టు చేస్తే రాజ్యాంగం ఎలా పరిరక్షించబడుతుంది. బిజెపి అబద్ధాలు మాత్రమే చెబుతుంది. నా భర్త 90 రోజులకు పైగా జైలులో ఉన్నారు. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో మాత్రమే ఈడి ఎందుకు చర్యలు తీసుకుంటుందో నాకు ఒక ప్రశ్న ఉంది" అని కల్పన అన్నారు. "నేను అన్యాయానికి, నియంతత్వ శక్తులకు వ్యతిరేకిని. నేను నా భర్త అడుగుజాడల్లో నడుస్తాను. ఆయన తన విలువలతో రాజీ పడలేదు. బదులుగా జైలు మార్గాన్ని ఎంచుకున్నారు. నా భర్త అరెస్టు రాజకీయ ప్రేరేపితం. మమ్మల్ని బిజెపి కూటమిలో చేరమని బలవంతం చేశారు. అందుకు నిరాకరించడంతో ఆయనను కేంద్ర ప్రభుత్వం అరెస్టు చేసింది" అని కల్పన సోరెన్ విమర్శించారు.

కలం బాణాలు

పోలవరం నిర్మాణానికి పూచీ నాది : మోడీ

పోలవరం నిర్మాణం
మోడీదట పూచీ
ఇన్నాళ్లుగ కట్టకుండ
ఎవరిదండి పేచీ

మంత్రజపంలాగ రోజు
చెబితే సరిపోతుందా?
నిర్వాసిత జనం ఘోష
చెవుల్లోన పడుతుందా?

ముస్లింలకు అండగా ఉంటా : జగన్

మొత్తంగా నడిచినడిచి
మోడీజీ బాట
ఎన్నాళ్ళకు ఒక్క మాట
సూటిగ తమనోట

రాష్ట్రం హక్కుల కోసం
ఈ మాత్రం సాహసం
చూపారా ఓటర్లకు
వచ్చునేమొ విశ్వాసం

అబద్ధాలకు ఓటేస్తే ఆస్తులు పోతాయి : పవన్

అబద్ధాలనే నమ్మిన
కూటమిలో దూరి
కార్పొరేటు క్లబ్బులోన
సభ్యత్వం చేరి

ఆరాటం శృతిమీరి
అపాయాల దారి
ప్రయోజనం లేదులెండి
హెచ్చరికల జారీ

- తె.ర

రాజంపేటలో రసవత్తర పోరు!

మాజీ సిఎం కిరణ్‌కు అసంతృప్తుల సెగ

నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

ప్రజాశక్తి – కడప ప్రతినిధి

రాజంపేట పార్లమెంటులో రసవత్తర పోరుకు తెరలేచింది. వైసిపి తరపున పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, కూటమి తరపున బిజెపి అభ్యర్థి మాజీ సిఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి బరిలో నిలిచారు. ఇద్దరు అంగ, అర్థ, అనుచర బలం కలిగినవారు కావడంతో రాజంపేటలో రాజకీయం ఉత్కంఠభరితంగా సాగుతోంది. రాజంపేట, రాయచోటి, తంబళ్లపల్లి, మదనపల్లి నియోజకవర్గాల్లో టికెట్లు దక్కని అసంతృప్తుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రాయలసీమ జిల్లాల స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌ను వెనక్కి తీసుకోవడం, కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు ఫీజుబులిటీ లేదనడం, రాయలసీమ డిక్లరేషన్‌ను అమలు చేయకపోవడంతో బిజెపి పట్ల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ఈ నెల 8న పీలేరులో ప్రధాన మంత్రి మోడీ పర్యటనపై ఆశలు పెంచుకున్నట్లు కనిపిస్తోంది.

రాజంపేట పార్లమెంటు ఎన్నిక ప్రతిష్టాత్మకంగా మారింది. మిథున్‌రెడ్డి, కిరణ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి బషీర్ సహా 16 మంది బరిలో నిలిచారు. రాజంపేట పార్లమెంట్‌లో రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు, మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి, పుంగనూరు నియోజకవర్గాలున్నాయి. 14,26,834 మంది ఓటర్లు ఉన్నారు. కిరణ్‌కుమార్‌రెడ్డి పీలేరు సొంత నియోజకవర్గంలో బలంగా ఉన్న సంగతి తెలిసిందే. వైసిపి అభ్యర్థి సొంత నియోజకవర్గమైన పుంగనూరు సహా తంబళ్లపల్లి నియోజకవర్గాల్లో బలాన్ని కలిగి ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో గతంలో ఎన్నడూ లేని రీతిలో రాజంపేట పార్లమెంటులో హోరాహోరీ పోటీ నెలకొంది.

అసంతృప్తుల సెగలో కూటమి

కూటమి అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డికి అసంతృప్తుల సెగ తగులుతోంది. రాజంపేట అసెంబ్లీ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్రాయుడు, మదనపల్లి మాజీ ఎమ్మెల్యే దుమ్మలపాటి రమేష్, రామ్‌దాస్ చౌదరి, తంబళ్లపల్లిలో మాజీ ఎమ్మెల్యే శంకరయాదవ్, మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డికి టిడిపి టికెట్లు లభించలేదనే ఉద్దేశంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. రమేష్‌రెడ్డి వైసిపిలో చేరిపోయారు. వీరందరూ రెబెల్స్‌గా మారి టిడిపి కూటమి అభ్యర్థులకు సవాల్ విసురుతున్నారు. రాజంపేట వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి టికెట్ లభించలేదనే ఉద్దేశంతో వైసిపికి సహాయ నిరాకరణ చేయడం, ఆయన అనుచరులు వందలాది మంది టిడిపిలో చేరడంతో తీవ్ర పోటీ నెలకొంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి తరపున పురందేశ్వరి బరిలో నిలిచినా దారుణంగా ఓడిపోయిన సంగతి తెలిసిందే.

అధినేతల పర్యటనపైనే ఆశలు

కూటమిలో కుంగుబాటు ఏర్పడింది. ఈ నేపథ్యంలో అధినేతల పర్యటనపై కూటమి దృష్టి సారించింది. ప్రధాని నరేంద్ర మోడీ, టిడిపి అధినేత చంద్రబాబు పర్యటనలు ఖరారు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ నెల 8న పీలేరులో ప్రధాని మోడీ సభ నిర్వహించనున్నారు.

ఓట్ల బదిలీపై సందేహాలు

కూటమి అభ్యర్థి నల్లారిని ఓట్ల బదిలీపై సందేహం వెంటాడుతోంది. వెనుకబడిన జిల్లాలకు ఇవ్వాల్సిన స్పెషల్ డెవలప్‌మెంట్ నిధులను రాష్ట్ర ఖాతా నుంచి వెనక్కి తీసుకోవడం, కడప జిల్లాకు ఇవ్వాల్సిన ఉక్కు పరిశ్రమకు ఫీజుబిలిటీ పేరుతో సహాయ నిరాకరణ చేయడం, బిజెపి నాయకత్వం కర్నూలులో చేసిన రాయలసీమ డిక్లరేషన్ అమలు, జిఎస్‌ఎస్‌ఎస్ ఫేజ్-2 ప్యాకేజీలకు పర్యావరణ అనుమతుల విషయంలో నిస్సహాయత నేపథ్యంలో మేధావులు, విద్యావంతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. బిజెపి అభ్యర్థికి టిడిపి, జనసేన ఓట్ల బదిలీపై సందేహం నెలకొంది.

రాజధానిలో గెలుపెవరిది?

- ఎన్‌ఆర్‌ఐపై మిర్చి వ్యాపారి పోటీ
- ఇండియా బ్లాక్ తరపున అజయ్‌కుమార్

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

చారిత్రక నేపథ్యం ఉన్న గుంటూరు లోక్‌సభ నుంచి ఈసారి ఎవరు ఎన్నికవుతారన్నది ఆసక్తి కరంగా మారింది. వైసిపి నుంచి కిలారి రోశయ్య, టిడిపి నుంచి పెమ్మసాని చంద్రశేఖర్, ఇండియా బ్లాక్ తరపున సిపిఐ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్ పోటీ పడుతున్నారు. కేవలం డబ్బే ప్రామాణికంగా టిడిపి, వైసిపి అభ్యర్థుల ఎంపిక జరిగిందన్న విమర్శలున్నాయి. టిడిపి నుంచి ఎన్‌ఆర్‌ఐ పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఎంపిక చేయగా, తన ఆస్తి రూ.5,785 కోట్ల వరకు ఉందని ఎన్నికల అఫిడవిట్‌లో పెమ్మసాని చూపారు. ఆయన ఎన్నికల్లో భారీగా ఖర్చుపెడతారన్న ఉద్దేశంతో టిడిపి ఆయనకు లోక్‌సభ టికెట్టు ఇచ్చిందని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

కిలారి రోశయ్య

పెమ్మసాని చంద్రశేఖర్

జంగాల అజయ్ కుమార్

పక్కా లోకల్ నినాదంతో రోశయ్య

కిలారి రోశయ్య పొన్నూరు వైసిపి ఎమ్మెల్యేగా ఉంటూ ఈసారి పార్లమెంటుకు పోటీ చేస్తున్నారు. ఆయన మిర్చితోపాటు అనేక వ్యాపారాలు చేస్తున్నారు. పక్కా లోకల్ అనే నినాదంతో ఆయన ప్రచారంలో పాల్గొంటున్నారు. తాను కష్టపడి డబ్బు సంపాదించానని, ఎక్కడా రూపాయి అవినీతి చేయలేదని, భవిష్యత్తులో కూడా అవినీతి రహిత రాజకీయాలు చేస్తానని పెమ్మసాని ప్రచారంలో భాగంగా చెప్పుకెళ్తున్నారు. అలాగే గత ఎన్నికల కన్నా ఈసారి వైసిపికి కొన్ని తరగతుల ప్రజలు దూరమయ్యారు. గత ఎన్నికల ముందు తాను రాజధానిలో ఇల్లు కట్టుకుని ఉంటున్నానని, అమరావతిని అభివృద్ధి చేస్తానని చెప్పిన జగన్ 2019 డిసెంబరులో మూడు రాజధానుల నినాదాన్ని తెరపైకి తెచ్చారు. ఇందుకు వ్యతిరేకంగా రైతులు 1,600 రోజులుగా ఉద్యమం చేస్తున్నారు. అయితే వైసిపికి బలమైన ఓటు బ్యాంకు ఉందని కిలారి రోశయ్య చెబుతున్నారు.

కాంగ్రెస్‌లో నూతనోత్సాహం

షర్మిల ఎపిసిసి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ పార్టీ కేడర్‌లో కొంత ఉత్సాహం వచ్చింది. ఇండియా వేదిక తరపున గుంటూరు లోక్‌సభకు సిపిఐ నుంచి జంగాల అజయ్ కుమార్ పోటీ చేస్తున్నారు. వామపక్షాలు, కాంగ్రెస్ ఓట్లతోపాటు ఉద్యోగులు, వ్యాపారులనూ ఆయన ఆకట్టుకుంటున్నారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూ.. ప్రజలతోనే ఉంటానని చెబుతున్నారు. గల్లా జయదేవ్ ఈసారి రాజకీయాల నుంచి స్వచ్ఛందంగా తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వ వేధింపులకు విసిగి ఆయన రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు.

మోడీ, అమిత్ షా మాటలు నమ్మేదెలా?

- పోలవరం, ప్రత్యేక హోదా, రైల్వేజోన్, రాజధాని హామీలు ఏమయ్యాయి
- పదేళ్లపాటు అధికారంలో వుండి చేయనిది ఇపుడు చేస్తారా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'విభజిత రాష్ట్రాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం.. తాము అధికారంలోకి వస్తే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడంతోపాటు రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వేజోన్, ఢిల్లీని తలదన్నే రాజధానిని నిర్మిస్తాం' అని2014 ఎన్నికలకు ముందు తిరుపతి బహిరంగ సభలో హామీ ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోడీ అధికారంలోకి రాగానే పూర్తిగా విస్మరించారు. రాష్ట్ర ప్రజలు ఆందోళన చేసినా అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించిన మోడీ ఇపుడు పదేళ్ల తర్వాత మళ్లీ అదే హామీని తెరపైకి తీసుకురావడం చర్చనీయాంశమైంది. పదేళ్లపాటు రాష్ట్రాభివృద్ధికి ఏమాత్రం సహకరించని మోడీ ప్రభుత్వం ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 2024 ఎన్నికల్లో నెగ్గితే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత తనదంటూ అనడం, కేంద్ర హోంశాఖ మంత్రి ఆదివారం ధర్మవరం ఎన్నికల సభలో కేంద్రంలో మోడీ ప్రభుత్వాన్ని, రాష్ట్రంలో బాబు ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే రెండేళ్లలో పోలవరం పూర్తి చేస్తామనడం పట్ల ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. విభజన చట్టంలో పోలవరం జాతీయ ప్రాజెక్టుగా పొందుపర్చినా 2014లో అధికారంలోకి రాగానే మోడీ ప్రభుత్వం తిరకాసు వైఖరిని ప్రదర్శించింది. 2020లో గోదావరికి వచ్చిన వరదలకు ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన డయాఫ్రం వాల్ దెబ్బతింది. డయాఫ్రం వాల్ విషయంలో ఎలా ముందుకు వెళ్లాలో కేంద్రం ఇప్పటిదాకా డిజైన్స్‌ను కూడా ఇవ్వని పరిస్థితి వుంది. అలాగే ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి సవరించిన అంచనాల పద్దు రూ.56 వేల కోట్లకు ఇప్పటిదాకా కేంద్రం అనుమతులు ఇవ్వలేదు. అలాగే ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన పునరావాసం పేచీ పెట్టడం పెద్ద చర్చనీయాంశమైంది. అయితే మోడీ ప్రభుత్వం పోలవరంలో పునరావాసం నిధులను రాష్ట్ర ప్రభుత్వమే భరించుకోవాలని చెప్పడం దారుణం. రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన నిధులను కూడా ఇవ్వకుండా కొర్రీలతో నిలిపేస్తున్న పరిస్థితి వుంది. ఇప్పటికీ రూ.12 వేల కోట్లు చేసిన పనులకు బకాయిలను పెట్టింది. ఇలా పోలవరం ప్రాజెక్టును పదేళ్లపాటు నిర్లక్ష్యం చేసిన మోడీ ప్రభుత్వం ఇపుడు రెండేళ్లలో పూర్తి చేస్తామంటే నమ్మేదెట్లా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గోదావరికి వరదలు వచ్చినపుడు నిర్వాసితులంతా తీవ్ర ఇబ్బందులు పడ్డా కేంద్రం కనికరించని పరిస్థితి. ఈ పదేళ్ల కాలంలో మొదటి నాలుగేళ్లలో ఎన్‌డిఎలో తెలుగుదేశం ప్రభుత్వం వుండగా, ఆ తర్వాత వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కేంద్రంలో అన్ని బిల్లులకూ మద్దతు ఇచ్చి బిజెపితో సన్నిహిత సంబంధాలనే నడిపింది. ఇలా పదేళ్ల పాటు తమ చెప్పుచేతుల్లో తెలుగుదేశం, వైసిపి ప్రభుత్వాలు వున్నా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయని మోడీ ప్రభుత్వం ఇపుడు మరోసారి అవకాశం ఇస్తే పూర్తి చేస్తానని చెప్పడం మరోసారి రాష్ట్ర ప్రజలను మోసపుచ్చడమేనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అనకాపల్లిలో ఉత్కంఠ

- కలవలేకపోతున్న కూటమి అభ్యర్థులు
- ప్రత్యర్థుల అనైక్యతపైనే వైసిపి ఆశ
- కాంగ్రెస్‌కు తోడైన ఇండియా వేదిక బలం

ప్రజాశక్తి – అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలోని అనకాపల్లి లోక్‌సభ, దీని పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ ఉత్కంఠగా వుంది. గత ఎన్నికల్లో లోక్‌సభతోపాటు ఏడు అసెంబ్లీ స్థానాలనూ వైసిపి సొంతం చేసుకుంది. ఈ ఎన్నికల్లో అనకాపల్లి, మాడుగుల, పాయకరావుపేట మినహా చోడవరం, నర్సీపట్నం, యలమంచిలి, పెందుర్తి నియోజకవర్గాల్లో వైసిపి సిట్టింగ్ ఎమ్మెల్యేలే పోటీలో వున్నారు. వ్యూహాత్మకంగా మూడు చోట్ల వైసిపి కొత్త అభ్యర్థులను బరిలో పెట్టింది. అనకాపల్లి లోక్‌సభ అభ్యర్థిగా మంత్రి బూడి ముత్యాలనాయుడు బరిలో ఉన్నారు. ఆయన కుమార్తె ఈర్లె అనురాధను మాడుగుల నుంచి పోటీలో నిలిపారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం లోక్‌సభ బరిలో 15 మంది పోటీలో వున్నారు. వీరిలో ప్రధానంగా వైసిపి నుంచి బూడి ముత్యాలనాయుడు, ఇండియా వేదిక తరపున కాంగ్రెస్ అభ్యర్థి వేగి వెంకటేష్, కూటమి నుంచి బిజెపి అభ్యర్థి సిఎం రమేష్ సహా మరో 12 మంది వున్నారు. స్థానికేతరుడైన బిజెపి అభ్యర్థి సిఎం రమేష్ పూర్తిగా టిడిపిపై ఆధారపడి పోటీలో దిగారు. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడైన సిఎం రమేష్ టిడిపి అభ్యర్థులపై ఆధారపడినట్లు కన్పిస్తూనే అంతర్గతంగా తన ప్రచారం తాను చేసుకుంటున్నారు. సిఎం రమేష్ గెలిస్తే జిల్లాలో తమ రాజకీయ ఉనికికి ప్రమాదమన్న భయం టిడిపి నాయకత్వంలో మొదలైంది. బయటకు చెప్పుకోలేకపోయినా, ఆయన వ్యవహారశైలి ఇరకాటంలో పెట్టేలా వుందని టిడిపి నాయకులు తమ సన్నిహితుల వద్ద వాపోతున్నారు.

మేకపోతు గాంభీర్యం

సిఎం రమేష్ ఎంత మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా వుంది. జిల్లా ప్రజలకు సుపరిచితుడైన మాడుగుల నియోజకవర్గానికి చెందిన ముత్యాలనాయుడుకు పార్టీ బలానికి తోడు ఆయన సామాజిక తరగతి, స్థానికత కొంత బలం చేకూర్చినట్లయింది. ఇండియా వేదిక పార్టీల బలంతో పాటు సంప్రదాయ కాంగ్రెస్ ఓటర్ల మద్దతు వేగి వెంకటేష్‌కు వుండడంతో ఆ మేరకు కొంత ప్రయోజనకరంగా వుంటుంది. కూటమి నుంచి యలమంచిలి, అనకాపల్లి, పెందుర్తి నియోజకవర్గాల్లో జనసేన అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

మిగిలిన నాలుగు చోట్ల టిడిపి అభ్యర్థులు



వున్నారు. జనసేన నుంచి పోటీచేసిన నియోజకవర్గాల్లో టిడిపి ఓటింగ్ ఎంతవరకు పడుతుందోనన్న ఆందోళన జనసేన అభ్యర్థుల్లో వ్యక్తమవుతోంది. బిజెపికి పార్టీ బలం లేకపోవడం, జనసేనకు ప్రభావితం చేయగలిగిన ఓటింగ్ లేకపోవడంతో టిడిపి ఓటు షిఫ్టింగ్‌పైనే జనసేన అభ్యర్థులు ఆధారపడి వున్నారు. అలాగే టిడిపి సీనియర్ నాయకుడు దాడి వీరభద్రరావు మనస్ఫూర్తిగా పనిచేయడం లేదని అనకాపల్లి జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ సన్నిహితులు చెబుతున్నారు.

సన్నగిల్లుతోన్న అయ్యన్నపాత్రుడు ధీమా

పాయకరావుపేట నుంచి వైసిపి తరపున పోటీ చేస్తున్న రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు పార్టీ శ్రేణులందరినీ కలుపుకుని వెళ్తున్నారు. ఇక్కడ టిడిపి తరపున అనిత పోటీచేస్తున్నారు. టిడిపి తరపున సిహెచ్ అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం నుంచి ఈ ఎన్నికల్లో గెలిచి తీరుతానని ఇంతవరకు వ్యక్తం చేసిన ధీమా కాస్త సన్నగిల్లుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్‌కు ఈసారీ రాజకీయ పరిస్థితి అనుకూలంగానే ఉన్నట్టు తెలుస్తోంది. పెందుర్తి టిక్కెట్ రాక మాడుగుల నుంచి బరిలోకి దిగిన సీనియర్ టిడిపి నాయకులు బండారు సత్య నారాయణమూర్తికి సొంత పార్టీ నుంచి సంపూర్ణ సహకారం లభించడం లేదు. తమకు రావాల్సిన టికెట్ బండారు తన్నుకుపోయారన్న బాధ మాడుగుల టిడిపి నాయకత్వంలో వుంది. యలమంచిలి నుంచి పోటీ చేస్తున్న జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్‌కు మనస్ఫూర్తిగా టిడిపి నాయకత్వం సహకరించని పరిస్థితి వుంది. ఎన్నికల యాజమాన్య నిర్వహణలో ఆరితేరిన ఎమ్మెల్యే యువి రమణమూర్తిరాజు కూటమి పార్టీల ఓట్లను రాబట్టుకునేందుకు గట్టి ప్రయత్నం చేస్తున్నారు. పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబుకు టిడిపి నుంచి సమస్యలు తప్పడం లేదు. పొత్తులతో తమ నాయకుడు బండారుకు టికెట్ పోయిందన్న నిరాశలో పంచకర్లకు దగ్గరకాలేకపోతున్నారు. గతంలో ఇదే నియోజకవర్గం నుంచి గెలిచిన పంచకర్ల పాత పరిచయాలను గట్టిపర్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ క్షేత్రస్థాయిలో అసంతృప్తులు లేకుండా చేసుకుంటున్నారు. సిఎం జగన్ నిర్వహించిన మేమంతా సిద్ధం సభ వైసిపి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి కొత్త ఉత్సాహం ఇచ్చింది. ఇండియా వేదిక తరపున పోటీలో వున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు వామపక్ష పార్టీల సహకారంతో కాంగ్రెస్ సంప్రదాయ ఓటింగ్ ప్రాంతాల్లో ప్రచారానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంది.

'అనంత'లో హోరా హోరీ

అసెంబ్లీ బరిలో 113, పార్లమెంటుకు 21 మంది పోటీ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోరు హోరా హోరీగా నడుస్తోంది. అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి మధ్య పోటీ నువ్వా.. నేనా అన్నట్టుగా సాగుతోంది. ఇండియా వేదిక సైతం ఆ రెండు పార్టీలకు బలమైన పోటీనిస్తోంది. అనంతపురం జిల్లా పరిధిలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంటు స్థానముంది. ఇప్పటికే నామినేషన్ల స్వీకరణ పూర్తయి పోటీలో ఉండేది ఎవరన్నది స్పష్టమైంది. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి మొత్తం 113 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అనంతపురం పార్లమెంటు స్థానానికి 21 మంది పోటీలో ఉన్నారు.

అనంతపురం జిల్లాలో తాడిపత్రి, రాప్తాడు, ఉరవకొండ వంటి కీలకమైన మూడు నియోజకవర్గాలు ఉన్నాయి. రాప్తాడు అసెంబ్లీ నియోజకవర్గంలో మాజీ మంత్రి పరిటాల సునీత ఈసారి పోటీలో ఉన్నారు. ఈమెకు పోటీగా ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి సిద్ధమయ్యారు. 1991 నుంచి ఓటమి అన్నది ఎరుగకుండా గెలుస్తూ వచ్చిన పరిటాల కుటుంబం 2019 ఎన్నికల్లో తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి చేతిలో ఓటమిని చవి చూశారు. తిరిగి ఈ ఇద్దరే మరోమారు పోటీపడుతున్నారు. తాడిపత్రిలో జెసి దివాకర్‌రెడ్డి సోదరుడు కుమారుడు జెసి అస్మిత్‌రెడ్డి టిడిపి తరపున బరిలో ఉన్నారు. వైసిపి నుంచి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రెండోసారి బరిలో ఉన్నారు. 1985 నుంచి జెసి కుటుంబం తాడిపత్రిలో ఓటమి అన్నది లేకుండా గెలుస్తూ వచ్చింది. 2019లో జెసి కుటుంబ వారసుడిగా జెసి అస్మిత్‌రెడ్డి తొలిసారి బరిలో దిగారు. ఈ ఎన్నికల్లో వైసిపి నుంచి కేతిరెడ్డి పెద్దారెడ్డి గెలుపొందారు. ఇప్పుడు తానే గెలుస్తానని ధీమాను ఆయన వ్యక్తం చేస్తుండగా, తిరిగి తాము గెలిచి పట్టు నిలుపుకుంటామని జెసి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ జిల్లాలో ఉన్న మరో కీలకమైన నియోజకవర్గం ఉరవకొండ. గత ఎన్నికల్లో రాష్ట్రమంతా వైసిపి గాలి వీచినా ఇక్కడ టిడిపి తరపున పయ్యావుల కేశవ్ ఒక్కరే ఈ జిల్లాలో టిడిపి నుంచి గెలుపొందారు. తిరిగి మరోమారు గెలుస్తానని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆయనకు పోటీగా వైసిపి నాయకులు వై విశ్వేశ్వరరెడ్డి బరిలో ఉన్నారు. ఇక్కడ ఆయన సోదరుడు వై మధుసూదన్‌రెడ్డి వైసిపి నుంచి బయటకొచ్చి కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్నారు. రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు టిడిపి తరపున బరిలో ఉన్నారు. వైసిపి తరపున మాజీ ఎమ్మెల్యే మెట్టుగోవిందరెడ్డి పోటీ చేస్తున్నారు. వైసిపిలో టికెట్టు రాకపోవడంతో ఇక్కడ అంతకమునుపు ఎమ్మెల్యేగా ఉన్న కాపు రామచంద్రారెడ్డి బిజెపిలో చేరారు. కూటమి తరపున కాలవ శ్రీనివాసులుకు ఆయన మద్దతునిస్తున్నారు. కళ్యాణదుర్గం అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రముఖ కాంట్రాక్టరు అమిలినేని సురేంద్రబాబు టిడిపి అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఆయనకు టికెట్టు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరనాయుడు వైసిపిలో చేరారు. వైసిపి అభ్యర్థి తలారి రంగయ్యకు మద్దతుగా ఈ ఎన్నికల్లో ప్రచారం చేస్తున్నారు. ఇద్దరి మధ్య పోటీ హోరా హోరీగానే సాగుతోంది.

పరిటాల సునీత

కేతిరెడ్డి పెద్దారెడ్డి

వై మధుసూదన్‌రెడ్డి

గుమ్మనూరుకు సహాయ నిరాకరణ

గుంతకల్లు అసెంబ్లీ నియోజకవర్గంలో టిడిపి తరపున మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం వైసిపి నుంచి టిడిపిలో చేరి పోటీ చేస్తున్నారు. వైసిపి మాత్రం సిట్టింగు ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డికే టికెట్టును ఇచ్చింది. వైసిపి నుంచి టిడిపిలో చేరిన గుమ్మనూరు జయరాంకు ఇక్కడి స్థానిక నాయకత్వం నుంచి కొంత సహాయ నిరాకరణ ఎదురవుతోంది. సొంత బలాన్ని నమ్ముకునే ఆయన గెలుపు కోసం పోటీ పడుతున్నారు. వై వెంకటరామిరెడ్డి మాత్రం రెండోసారి గెలుపునకు ప్రయత్నిస్తున్నారు. ఎస్‌సి రిజర్వు నియోజకవర్గమైన శింగనమలలో టిడిపి తరపున బండారు శ్రావణి పోటీ చేస్తున్నారు. గ్రూపు తగాదాలతో కొంత ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ పార్టీ అధినాయకత్వం కొంత చక్కదిద్దే ప్రయత్నం చేయడంతో గ్రూపులు కొంత తగ్గాయని చెప్పొచ్చు. ఇక వైసిపి అభ్యర్థి వీరాంజనేయులు టిప్పర్ డ్రైవరు అంటూ టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఓ రకంగా వైసిపి అభ్యర్థికి క్రేజ్‌ను తెచ్చిపెట్టాయి. శింగనమల వైసిపి అభ్యర్థి వెనుక మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి భర్త సాంబశివారెడ్డి ఉన్నారని, ఆయన ఈయన విజయం కోసం ప్రయత్నిస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. అయితే సాంబశివారెడ్డిని ముందు నుంచి వ్యతిరేకిస్తున్న వైసిపిలోని ఒక గ్రూపు ఇప్పటికీ ప్రచారానికి దూరంగా ఉంటూ వస్తుండటం గమనార్హం. అనంతపురం అర్బన్‌లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి వైసిపి తరపున మరోమారు బరిలో దిగారు. టిడిపి అభ్యర్థి దగ్గుపాటి వెంకటప్రసాద్‌ను బరిలో దింపింది. విజయం కోసం ఇద్దరూ పోటీ పడుతున్నారు. ఇదే స్థానం నుంచి ఇండియా వేదిక అభ్యర్థిగా సిపిఐ నుంచి సి జాఫర్ బరిలో ఉన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో అత్యధికంగా ముస్లిం ఓట్లు ఉన్నాయి.

బిజెపి పట్ల అటు వైసిపి, ఇటు టిడిపి అనుకూలంగా ఉంటున్నందున ఇండియా వేదిక వైపు ఓటర్లు మొగ్గు చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. అనంతపురం పార్లమెంటు పరిధిలో మొత్తం 21 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వైసిపి తరపున మాజీ మంత్రి శంకర నారాయణ కాగా, టిడిపి నుంచి అంబికా లక్ష్మీనారాయణ బరిలో ఉన్నారు.

అక్షరం

ప్రజాశక్తి

www.prajasakti.com

facebook/prajasakti, twitter/prajasakti

6 | విజయవాడ | సోమవారం 6 మే 2024

నియంతల మీదా, నిరుద్యోగమ్మీదా, లాకౌట్ల మీదా, యుద్ధాల మీదా గొంతెత్తేందుకు కళాకారులకు హక్కు లేదు.. అది రాజకీయులకే ఉందనడం మూర్ఖత్వం. అణగదొక్కాలనుకునేవారే ఇలాంటి తలతిక్కవాదం చేస్తారు.

- కొడవటిగంటి కుటుంబరావు

సమయమిదే ...

చీకటివైపు అడుగులు వేస్తున్నాం
మనకు తెలియకుండానే
నరనరాన అణువణువునా
ద్వేషభావం పాకుతున్న గుంపొకటి
దేహమంతా కత్తులతో దేశమంతా తిరుగుతోంది!

ప్రాంతాల మధ్య భాషల మధ్య భేద భావాన్ని
పెంచుతూ వాళ్ళు వస్తున్నారు
హక్కుల కోసం భవిష్యత్తు తరాల కోసం
ఈ నేల పచ్చదనం పదికాలాలు నిలిపేందుకు
బహుళ తత్వమే
ఈ జాతి పురోగతి సూత్రమని తెలియ చేసేందుకు
ఒకరికి ఒకరం
కలిసి అడుగులు
వేయాల్సిన సమయమిదే...!

- కెక్యూబ్ వర్మ , 94934 36277

బూడిద బాగోతం!

అన్నంలో బూడిద కలుపుకు తింటున్నాం
మమ్మలని చూసి నవ్వుకోండి
తాగుతున్న నీళ్లలో మా ఆఖరి రోజు కలిసిపోయి ఉంది
మా కళ్ళముందే మాకు నివాళి అర్పించండి
మంచి గాలి పీల్చడం మాకో కల
ఇది పద్నాలుగు గ్రామాల
సామూహిక ముందస్తు మరణ లేఖ!

కనుచూపు మేరా కలుషితమై
దక్షిణం వైపున్న నది దు:ఖంతో
నెలలు నిండని నెత్తుటి ముద్దలను
కన్నీటితో లెక్కబెడుతుంది
ఖాళీ చేతులనిండా కాలుష్యపు మరకలు
పొగచూరిన ఆకాశం నిండా తెల్లటి పొగ

కాలీ ... కాలీ ... కాలీ
నల్లటి బొగ్గు మండి... మండీ
మంది మీద రాలుతుంది
మీ జబ్బు మీదే మా డబ్బు మాదే
లోడు చేసిన టిప్పర్ల నిండా
రంగు రంగుల రాజకీయాలు
అన్ని చేతుల నిండా టిప్పర్లు
చిందించిన నెత్తుటి మరకలు

ఏ చెట్టుమీదా ఆక్సిజన్ లేదు
చరిత్రగా మిగిలిన కొండకి నిత్యం పొగార్చన
అక్రమ స్టాక్ పాయింట్ల నిండా కాన్సర్ కణాలు
ఒంటిమీద ఎర్రమచ్చలు
మంచాల మీద సగమే
తీరుతున్న దేహపు వాంఛ
ఊరి ఊపిరి తిత్తుల నిండా లంచాల గాలి
ఏ రిపోర్టూ ఇది నిజమని చెప్పదు
అన్ని ఒడ్డు మీద విర్రవీగే మొసళ్ళే!

కులుకుతూ నడుస్తున్న కోస్తా ప్రాంతపు కుతిక మీద
అభివృద్ధి తన ఉక్కుపాదంతో తొక్కిమరీ చంపుతుంది
'పాల్వంచా' మాగోడు విను
కాస్త మాకు పోరాటం నేర్పించు
'పరవాడా' మాతో చేయి కలుపు
నీ ఇనుప తెగువ మాకు కాస్త అంటించు
వెలుగు కోసం పుట్టిన
మన ఇళ్ల దీపాలు ఆర్పుతున్నాయి
ఉరికొయ్య మీద వేలాడుతున్నాం
మా గొంతుకు జత కలవండి!

యుద్ధం వ్యక్తిగతం కాదు
నెత్తురు ఒలకడం ఈ నేలకు కొత్త కూడా కాదు
అహంకారపు కొమ్ములు ఒంచడం
పెద్ద లెక్కా కాదు
కడుపు మండిన రోజున
నువ్వూ నీ మీద ఎక్కి
ఊరేగుతున్న రాజకీయమూ
సామూహిక ప్రజా దండయాత్రలో ఓడిపోయి
బూడిద కింద కప్పబడిపోతారు
కొండమీద వాన కురుస్తుంది
నీ ఆనవాళ్లు కూడా గుర్తుంచుకోని
కొత్త చిగుర్ల కోసం ఎదురుచూస్తున్నాం!

(విజయవాడ ఇబ్రహీంపట్నంలో ఉన్న డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ విడుదల చేస్తున్న విపరీతపు ప్లైయాష్ మరియూ ఏమాత్రం ఆమోదయోగ్యం కాని బూడిద రవాణాతో అనారోగ్యంతో బలైపోతున్న రెండు మండలాల్లో ఉన్న దాదాపు పద్నాలుగు గ్రామాలు, కొండపల్లి మున్సిపాలిటీ ప్రజలు చేస్తున్న ఉద్యమానికి సంఘీభావంగా...)

- అనిల్ డ్యాని, 97033 36688

పిడుగు లాంటి బాంబు

శిధిల సౌధాల మట్టి పెళ్ళల్లోంచి
పొడుచుకొచ్చిన పసి కంకాళమొకటి
ప్రశ్నల గోలీల్ని గురిచూసి కొడుతోంది!

నేను మీకెందుకు నచ్చలేదంకుల్?
నేనేం తప్పు చేశాను?
నాకు ఆకలేసి మీ పాప చేతిలోని
పాల బిస్కెట్‌ను ఎప్పుడైనా లాక్కున్నానా?
నా పెన్సిల్ పాడైపోతే
తన సంచిలోని పెన్సిల్‌ను
ఏరోజైనా దొంగిలించానా?
పోనీ, మా మమ్మీ ప్రేమతో ఇచ్చిన తాయిలంలోంచి
ఇంత పిసరు కూడా మీ చంటాడికి పెట్టనని
ఏనాడైనా కుళ్ళు బుద్ధి చూపించానా?
అసలు నేనేం నేరం చేసానంకుల్?

నా కళ్ళు నేనాడుకునే బెలూన్లు పేల్చినట్టు పేల్చేసావ్
నా కాళ్ళూ చేతులూ
కంగర బూచాడ్లా వచ్చి కోసేసావ్
నా చిన్ని గుండెనూ చిట్టి మెదడునూ
పొట్ట పేగుల్నీ దట్టమైన నల్లని
పొగల మంటల్లోకి తోసి తగలబెట్టేసావ్!

క్లాసులో ఫస్టొస్తే బూట్లు కొంటానని
డాడీ ప్రామిస్ చేసారంకుల్!
మెరుపు లెట్లా వస్తాయో
పిడుగు లెట్లా పడతాయో
పుస్తకం చూసి కష్టపడి నేర్చుకుంటున్నాను
అంతలోనే హఠాత్తుగా
నామీద పిడుగులాంటి బాంబు పడింది
అది నువ్వే వేసావంటగా?
నీ జట్టు పీస్ అంకుల్!
ఇకముందు మీ చంటాడికైనా
మెరుపుల గురించీ
పిడుగుల గురించీ చదవొద్దని చెప్పంకుల్!
ఇంద్ర ధనుస్సుల గురించి చదవమను!
అవి గుండె లోతుల్లో
ఎట్లా మొలకెత్తించాలో చదవమను!

- పతివాడ నాస్తిక్, 94417 24167

కలంతో, గళంతో జనంలోకి ...

'అంతా చీకటిగా ఉంది. అధ్వానంగా ఉంది.' అని పదే పదే అనుకొని, ఊరుకుందామా? మీనుకు మీనుకుమనే కాంతిదీపాలకు చుట్టూ చేతులు పెట్టి, మరిన్ని దీపాలను మనమే వెలిగించి వెలుగులు ప్రసరిద్దామా?

జరుగుతున్న దారుణాలను పదే పదే వర్ణించి, వివరించి, మిన్నకుందామా? కవితలు రాసి, కథలు కూర్చి, వ్యాసాలు వెదజల్లి, నాలుగు గోడల మధ్యా ప్రసంగాలు చేసి, మన పనైపోయిందని చేతులు దులుపుకుందామా? ఇంకా చేతనైందీ, చేయగలిగిందీ, చేయి చేయి కలిపి, బలంగా, ప్రబలంగా మార్చగలిగిందీ చేద్దామా?

దేశంలో మతం పేరిట రాజకీయం పెచ్చరిల్లితున్నప్పుడు, నిజ సమస్యలను వదిలి పెట్టి, ఇచ్చిన వాగ్దానాలను గాలికొదిలి, మనుషులను కేవలం మతపరమైన భావోద్వేగాలతో ఊపేయటమే 'లాభదాయకమైన' వ్యూహమని పాలకులు తలుస్తున్నప్పుడు; మన రాజ్యాంగ స్ఫూర్తిని దారుణాతి దారుణంగా దెబ్బ తీసే పన్నాగాలకు బరితెగిస్తున్నప్పుడు కర్నాటకలోని రచయితలూ, కవులూ, కళాకారులు, చిత్రకారులు, మేధావులూ వేసుకున్న ప్రశ్నలివి! మూఢత్వంపై, మతోన్మాదంపై పోరాడిన కల్బుర్గి, గోవింద్ పన్సారే, గౌరీ లంకేశ్ తదితర మేధావులను మతతత్వ శక్తులు దారుణంగా చంపినప్పుడు; ప్రశ్నించిన గొంతులను జైళ్లలో నిర్బంధిస్తున్నప్పుడు; ప్రజల పక్షాన మాట్లాడితే వారిపై అర్బన్ నక్సల్స్ అంటూ వెక్కిరింతలూ, హెచ్చరికలకూ పాల్పడుతున్నప్పుడు కర్నాటకలో వేలాది మంది ఆలోచనాపరులు జరుపుకున్న అంతర్మథనం ఇది.

ఆ తరువాత వారు కేవలం రాయటానికి, మాట్లాడ్డానికే పరిమితం కాలేదు. ప్రజల్లోకి వెళ్లారు. దేశంలో జరగకూడనిది ఏ జరుగుతుందో, జరగాల్సింది ఏం జరగటం లేదో ప్రజలకు వివరించారు. అలా వివరించటానికి, ప్రజలను కదిలించటానికి ఒక పెద్ద కార్యాచరణ చేపట్టారు. మతం పేరిట దేశంలో రాజకీయాలు చేస్తున్న బిజెపిని గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించటంలో తమ వంతు పాత్ర పోషించారు. "జరుగుతున్న దానిని చూస్తూ దాని గురించి వాపోవడం కాదు, కవులూ రచయితలూ చేయాల్సింది. ఆ పరిస్థితిని మార్చటంలో తమ వంతు పాత్ర ఖచ్చితంగా పోషించాలి." అన్న మాటకు అక్షరాలా ఆచరణ రూపం కల్పించారు.

"కర్నాటక మేలుకో" పేరిట పెద్దఎత్తున ప్రచారాందోళన కార్యక్రమం చేపట్టారు. ఎన్నికలకు ఆరు నెలల ముందు నుంచి ఐదు వేల మంది ప్రత్యేక, ప్రత్యక్ష కృషి చేశారు. వీరెవ్వరూ ఏ రాజకీయ పార్టీకి చెందినవారు కాదు. దేశంలో, కర్నాటకలో బీజేపీ మత రాజకీయాలతో విసిగిపోయిన కవులూ, రచయితలు, మేధావులు, లాయర్లు, జర్నలిస్టులు, డాక్టర్లు, ప్రొఫెసర్లు మాత్రమే! ప్రముఖ మేధావులు పురుషోత్తం బిలిమలే, తారారావు, డీయా సరావతి, రహమత్ తరికెరె, దేవనూరు మహాదేవ, జి.ఎన్. దేవి, వాసవి తదితరుల నాయకత్వంలో 5 వేల మందికి పైగా వాలంటీర్లు ఈ దేశ రక్షణ పోరాటంలో శక్తివంచన లేకుండా పనిచేశారు. మత రాజకీయాలను, బీజేపీని ఓడించడమే లక్ష్యంగా 'ఎద్దేళు కర్నాటక' (మేలుకో కర్నాటక) అనే సంస్థను ఏర్పాటు చేశారు. సంవత్సరం ముందుగానే 'ఈదినకర్నాటక.కామ్' అనే వెబ్ సైట్‌ను ప్రారంభించారు. 'ఎద్దేళు కర్నాటక'లో 112 సంస్థలు చేరాయి. కర్నాటక రాజ్య నైతు సంఘం, రాష్ట్ర కార్మిక సంఘాలు, దళిత సంఘర్ష్ సమితి, ఓబీసీ ఫెడరేషన్, పలు ముస్లిం, క్రిస్టియన్ సంస్థలు కూడా 'ఎద్దేళు కర్నాటక'తో చేతులు కలిపాయి. ఈ 5 వేల మంది కార్యకర్తలు 149 నియోజక వర్గాల ప్రజల వద్దకు వెళ్ళారు. 250 వర్క్‌షాపులు నిర్వహించారు. 103 నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. 192 బృందాలు పనిచేశాయి. Eedina.com వెబ్ సైట్ నిర్వహించిన మెగా సర్వే కోసం ఈ వాలంటీర్లు 41 వేల కుటుంబాలను కలిశారు. 650 పోస్టర్లు విడుదల చేశారు 80 వీడియోలు, 7 ఆల్బమ్‌లు ప్రచారానికి ఉపయోగించారు. మతోన్మాదాన్ని నిరసించే, మన దేశ భిన్నత్వంలోని ఏకత్వాన్ని వివరించే పుస్తకాలను ప్రచురించి, 10 లక్షల కాపీలను ముద్రించి, ప్రజలకు పంపిణీ చేశారు. 1.6 లక్షల మంది ఓటర్లను కొత్తగా నమోదు చేయించారు. 100 ప్రెస్‌మీట్లు పెట్టారు. రాష్ట్రం నలుమూలలా నాలుగు జాతాల ద్వారా ప్రచారం చేసి, కోటి మంది ప్రజలకు సందేశం చేరవేశారు. 2 లక్షల మంది ప్రజలు పాల్గొన్న 75 సదస్సులు నిర్వహించారు. 31 జిల్లాలను, 150 తాలూకాలను నేరుగా సందర్శించారు.

బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా ఉండేందుకు ఈ సంస్థ ప్రముఖులు 49 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకునేలా ఒప్పించగలిగారు. దీనిపై 'ఎద్దేళు కర్నాటక' సంస్థలో ప్రముఖుడైన పురుషోత్తం బిలిమలె మాట్లాడుతూ, "దేశం, రాష్ట్రం రాజకీయంగా మునుపెన్నడూ లేని విధంగా పతనమైంది. వాస్తవికత ఆధారంగా దీనికి పరిష్కారాన్ని కనుగొనాలి. ఈ దోపిడీ, మతోన్మాద ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి రాకుండా చేయడమే ప్రధాన అంశం. దుష్టపాలన సాగిస్తున్న పార్టీని ముందుగా ఓడించాలి. ఆ తర్వాత ప్రజల ప్రయోజనాల పునరుద్ధరణ కోసం... గెలిచి అధికారంలోకి వచ్చిన వారితో పోరాటం కొనసాగించాలి. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఇదొక్కటే తక్షణ మార్గం" అని పేర్కొన్నారు. ఇలా 'ఎద్దేళు కర్నాటక' సంస్థ కృషి చేసిన చాలా స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు ఓడిపోయారు. కర్నాటకలో విజయవంతమైన ఈ కృషిని దేశవ్యాప్తం చేయడం చాలా అవసరం.

ఇలాంటి కృషి చేయాల్సిన అవసరం మన రాష్ట్రంలోనూ ఉంది. 'ఎద్దేళు కర్నాటక' ప్రచురించిన ఒక చిన్న బుక్‌లెట్‌ని ఇటీవల ఆంధ్రప్రదేశ్ పౌరసంఘాలు ప్రచురించి, ప్రచారం చేస్తున్నాయి. *"నయవంచన" : పదేళ్ల నిరంకుశ పాలన – 10 దారుణ మోసాలు"* పేరిట వెలువడ్డ 32 పేజీల ఈ చిన్ని పుస్తకంగా సూటిగా బిజెపి పాలనలోని వైఫల్యాలను వివరిస్తోంది. కె.ఉషారాణి, ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, సిఎస్ఆర్ ప్రసాద్, కె.సత్యరంజన్, ఎస్.వెంకట్రావు, చూపు కాత్యాయని, ఖాదర్ మొహియుద్దీన్, డిబిఎస్ఆర్‌సిహెచ్ మూర్తి, ఎంవిఎస్ శర్మ ... ఈ పది వ్యాసాలను ఇంగ్లీషు నుంచి తెలుగులోకి అనువదించారు. ధరల పెరుగుదల, నైతాంగ సంక్షోభం, నిరుద్యోగం, నిజ వేతనాలు, దేశాన్ని కొల్లగొడుతున్న కార్పోరేట్లు, అంతు లేని అవినీతి, రిజర్వేషన్లకు పాతర, మహిళల అభివృద్ధికి విఘాతం, రాష్ట్ర ప్రయోజనాలకు గండి, మతం ముసుగులో కుట్ర అంశాలపై క్షుప్తంగా వివరించారు. ఈ అంశాలపై ఎన్నికలకు ముందు బిజెపి నాయకులు ఏం చెప్పారు, ఆచరణలో ఏం చేశారు? ప్రస్తుతం దేశంలో పరిస్థితి ఎలా ఉంది? ఇలా ప్రతి వివరాన్ని సూటిగా, స్పష్టంగా, లెక్కలతో సహా ఇచ్చారు. కళ్లకు కట్టినట్టు ఇచ్చిన గణాంకాలు, ఉదాహరణలతో బిజెపి పదేళ్ల పాలన వైఫల్యాలను సులభంగా అర్థం చేసుకోవటానికి ఈ చిన్ని పుస్తకం చాలా బాగా ఉపయోగపడుతుంది. "మనం మళ్లీ మోసపోకూడదు" అన్న పిలుపుతో వెలువడ్డ ఈ పుస్తకాన్ని దేశం మేలు కోరే ప్రతి ఒక్కరూ చదవాలి. ముఖ్యంగా రచయితలూ, కవులూ, కళాకారులూ, మేధావులూ ఈ పుస్తకాన్ని అధ్యయనం చేసి, ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈ పుస్తకాన్ని ప్రచురించిన ఆంధ్రప్రదేశ్ పౌరసంఘాలు ఆకాంక్షిస్తున్నాయి. ఈ పుస్తకం వెనుక పేజీలో ప్రచురణకర్తలు ఇచ్చిన ఈ కింది పిలుపు ప్రస్తుత పరిస్థితుల్లో సమంజసంగా ఉంది.



రాజ్యాంగేతర నియంతృత్వాన్ని ఓడించటానికి
మనమంతా ఐక్యమవుదాం
ఈదేశం మనది
అన్ని భాషలూ మనవే
అన్ని మతాలూ ఒక్కటే
అన్ని రంగులూ మనవే
ఈ రాజ్యాంగం మనది
ప్రజాస్వామ్యం మనది
అంతిమ విజయం మనదే మనదే
రేపటి రోజు మనదే మనదే
మేలుకో, దేశమా
మేలుకో, ఆంధ్ర రాష్ట్రమా మేలుకో
మేలుకో ఓటరా, మేలుకో!

(రూ.20ల వెల ఉన్న ఈ పుస్తక ప్రతుల కోసం ప్రచురణకర్త వొరప్రసాద్ 94900 99059ను సంప్రదించవొచ్చు)

- శాంతిమిత్ర

మనో మాలిన్యాలపై ప్రదర్శనాస్త్రం

"ద ఇంపోస్టర్స్ : అంతా నిజమే చెబుతారు" ఇది ఆంగ్ల నాటక రచయిత జె.బి.ప్రీస్టి రాసిన నాటకం. ఆయన రాసిన "ద ఇన్‌స్పెక్టర్ కాల్స్" అనే నాటకం మొట్టమొదటిసారిగా 1945లో అప్పటి సోవియట్ యూనియన్ మాస్కో నగరంలో ప్రదర్శితమైంది. ఆ తర్వాత లండన్ న్యూ థియేటర్‌లోనూ ప్రదర్శించారు. 20వ శతాబ్ది మధ్య కాలంలో రాయబడ్డ, ప్రదర్శించబడ్డ క్లాసిక్‌గా విమర్శకులు దీనిని పేర్కొంటారు. ఆ తరువాత 1992, మళ్ళీ 2011-12లోను స్టీఫెన్ డోల్టి అన్న సుప్రసిద్ధ దర్శకుని ద్వారా ఈ నాటకం మరొకసారి ప్రాచుర్యం పొందింది.

ద ఇంపోస్టర్స్ నాటికలో దృశ్యాలు

ఒక పారిశ్రామిక నగరంలో ఒక పై మధ్య తరగతికి చెందిన మిస్టర్ బర్లింగ్ కుటుంబంలో జరిగిన కథ ఇది. ఆ కుటుంబాన్ని ఇన్‌స్పెక్టర్ గూల్ విచారించడం ఈ కథలోని ఇతివృత్తం. ఒక శ్రామిక యువతి ఆత్మహత్య గురించిన విచారణలో భాగంగా ఆ ఇన్‌స్పెక్టర్ వస్తాడు. డ్రాయింగ్ రూం శైలిలో నాటకమంతా బర్లింగ్ నివాసపు మధ్య హాల్లో నడుస్తుంది. విక్టోరియన్ - ఎడ్వర్డ్ ఇంగ్లీష్ సొసైటీగా చెప్పబడే కాలంలో హిపోక్రసీని బట్టబయలు చేసిన ప్రదర్శన ఇది. రచయిత ప్రీస్టీ రాజకీయ సామ్యవాద ఆలోచనలకు ప్రతిరూపంగానూ ఈ నాటకం రూపుదిద్దుకొంది. పలు బ్రిటిష్ విద్యాసంస్థల్లో సాహిత్య విద్యార్థులు ఈ నాటకాన్ని ఒక పాఠ్యాంశంగా చదువుకున్నారు.

ఈ నాటకాన్ని సుప్రసిద్ధ సాంఘిక నాటికల రచయిత భాస్కర్ చంద్ర స్వేచ్ఛానువాదం చేశారు. మొదటిసారిగా 2023లో కాకినాడ నాటకోత్సవంలో, తరువాత నంది నాటకోత్సవంలో ప్రదర్శితమై, చాలా బహుమతులు గెలుపొందింది. అభిరుచి గల ప్రేక్షకులు, విమర్శకుల దృష్టిని ఆకర్షించింది.

రచయిత భాస్కర్ చంద్ర కథను పూర్తిగా తెలుగింటి నాటకంగా ప్రతిభావంతంగా నడిపించారు.

అది భూషణరావు ఉండే ఖరీదైన విలాస భవంతి. దేశంలోని పారిశ్రామిక పెట్టుబడుదారుల్లో అతడూ ఒకడు. దేనినైనా డబ్బుతోనే కొలుస్తాడు. సొంతంగా విమానాలు, హెలికాప్టర్లు ఉన్నాయి. అతడి భార్య రత్నకుమారి. కొడుకు కిరణ్, కూతురు దియా.

ఆ డ్రాయింగ్ రూమ్ బ్యాక్ డ్రాప్‌లో బార్ సెట్లో కుటుంబ సభ్యులు, వచ్చిన అతిథులకు స్టీఫెన్ అన్న వ్యక్తి మందు సర్వ్ చేస్తుంటాడు. అది దియా ఎంగేజ్‌మెంట్ జరిగే రోజు. కిరణ్ ఆ ఇంటి వైభవం గురించి అక్కడున్న వారితో చెబుతూ "20 ఫ్లోర్లు, 200 పైబడి ఖరీదైన అలంకరణతో కూడిన గదులు, 100 మంది పనివాళ్ళు, కారులోనే అన్ని ఫ్లోర్లూ తిరిగే సౌకర్యం ఉన్న అత్యాధునిక భవంతి" అంటాడు.

కథలోకి వెళ్తే... పెళ్లి కొడుకు అత్యంత సంపన్న కుటుంబానికి చెందిన ఆదిత్య. నిజానికి అతడి కుటుంబం భూషణానికి వ్యాపారిత్యా ప్రత్యర్థి. పెళ్ళి కొడుకును, పెళ్లి పెద్దను నేనే అని చెప్పుకుంటాడు ఆదిత్య. తన తల్లి, తండ్రి వ్యాపార అవసరాల రీత్యా లండన్ వెళ్లారని చెబుతాడు.

భూషణరావు కొడుకు కిరణ్ మద్యానికి బానిస. అయినా ఆ విషయంపై పెద్దగా చింత లేదు ఆ కుటుంబంలో. తరతరాలకు సరిపడా సంపదను ఇంకా పెంచుకుంటూ పోవాలన్నది మాత్రమే వాళ్ళ ఆకాంక్ష. అందుకు గల సువర్ణ అవకాశాల చుట్టూనే వాళ్ళ మాటలు ఎప్పుడూ దొర్లుతుంటాయి.

భూషణరావు తన కొడుకును పై చదువుల కోసం విదేశీ విశ్వవిద్యాలయాలకు పంపాలనుకుంటాడు. కిరణ్‌కు మాత్రం డబ్బు పారేస్తే సర్వ సౌఖ్యాలూ లభించే ఇండియాను వదిలిపోవడం ఇష్టం ఉండదు. ఇక్కడ దేన్నైనా డబ్బు డబ్బు డబ్బు అనే మూడింటితో సొంతం చేసుకోవచ్చు అనుకుంటాడు. తండ్రి ఒక పుస్తకాల షాపులో గుమస్తాగా జీవితం ఆరంభించి ఇప్పుడు దేశంలోని కుబేరుల్లో ఒకడిగా స్థానం సంపాదించాడన్న అహం, నిశ్చింత అతడిలో అడుగడుగునా కనిపిస్తాయి. సిగ్గు ఒకటి వదిలేస్తే ఈ దేశంలో చాలామంది సెలబ్రిటీలు అయిపోవొచ్చు అన్నది అతడి థియరీ.

సమాజం పెట్టుబడుదారుల చేతిలో కీలుబొమ్మ అన్నది పెళ్లికొడుకు ఆదిత్య ఫిలాసఫీ. అతడు ప్రస్తుతం 5 వేల కోట్ల విలువైన అటవీ భూమిని సొంతం చేసుకునే ప్రయత్నంలో ఉన్నాడు. నకిలీ పత్రాలు సృష్టించి, ఆ ఆదివాసీలే ఆ స్థలాన్ని దురాక్రమణ చేశారన్న తీర్పు కోర్టు నుంచి పొంది, ఆ ప్రదేశంలో మైనింగ్ చేసి కోట్లు కొల్లగొట్టాలన్నది అతడి ప్లాన్. అతడి తల్లిదండ్రులు లండన్ మార్కెట్లో తమ షేరు విలువ పెంచుకొని, బ్యాంకుల్లో తనఖా పెట్టి కోట్ల మదుపు పొందాలన్న ఉద్దేశంతో వెళ్లారు. ఆదిత్యకి కేతన్ పారేక్, విజయ మాల్యా, నీరవ్ మోదీ ఆదర్శ వ్యక్తులు. వచ్చే ఐదేళ్లలో వాళ్ళ కుటుంబం ప్రపంచ కుబేరుల్లో స్థానం సంపాదిస్తుందని అతడి అంచనా.

... ఇలా వాళ్లంతా మద్యం సేవిస్తూ తమ భవిష్య ప్రణాళికలను చెప్పుకుంటూ ఉండగా... ఇన్‌స్పెక్టర్ సత్యం ప్రవేశిస్తాడు. అతడి రాక వారి మాటలకు అంతరాయం కలిగిస్తుంది. అలకానంద అనే ఓ శ్రామిక వర్గపు అమ్మాయి ఆత్మహత్య చేసుకుంది. విచారణలో లభ్యమైన డైరీ ఆధారంగా అక్కడికి విచారణ కోసం వచ్చినట్లు చెబుతాడు సత్యం. వారి వద్ద ఉన్న మొబైల్స్‌ని ఒక ప్లాస్టిక్ కవర్లో వేయిస్తాడు. తర్వాత ఒకరి తర్వాత ఒకరిని ప్రశ్నించడం మొదలు పెడతాడు. ఇప్పుడే అసలు కథ మొదలవుతుంది. అక్కడి నుంచి నాటకం నడిపిన తీరు ప్రేక్షకుడిని విస్మయపరుస్తుంది. ఆదిత్యకి, భూషణరావు కుటుంబానికి ఆ యువతి జీవితంతో, ఆమె ఆత్మహత్యకు దారి తీసిన పరిస్థితులతో సంబంధం ఉండటమే కథాగమనంలోని కీలకాంశం.

మహిళా కార్మికులకు సమాన వేతనాలివ్వాలన్న కార్యసాధనలో భూషణరావు ఆగ్రహానికి గురై పనిలోంచి తొలగించబడిన యువతి అలకానంద. ఒక ఫ్యాషన్ డిజైనర్ వద్ద పనిచేస్తూ దియా ఆగ్రహానికి గురై పనిలోంచి తొలగించబడుతుంది. ఆపై ఒక స్టార్ హోటల్లో పనిచేస్తూ ఆదిత్యకు పరిచయమవుతుంది. అతడు ఆమెను క్యాలెండర్ గర్ల్‌గా పనిచేయమని కోరతాడు. నగ్న చిత్రాలకు మోడల్‌గా ఉండమని, తనతో సహజీవనం చేయమని అడుగుతాడు. తాను ఇప్పటికే ఒకడి ద్వారా గర్భాన్ని ధరించి ఉన్నానని, మరొకరితో శరీరం పంచుకోలేనని ఆమె అంటుంది. ఆదిత్య కోపంలో ఆమె పీక నులమబోయి, చీకొట్టి వెళ్ళిపోతాడు.

తరువాతి అటెన్షన్ కిరణ్ మీదకు వస్తుంది. ఒక హోటల్ స్టీవార్డ్‌గా పనిచేస్తున్న ఆనందను (అలకానంద) ప్రేమ పేరుతో తాను లొంగదీసుకుంటాడు. "ఆడపిల్లను గర్భవతి చేయడం మగతనం కాదు, ఆమెకు అండగా నిలబడటం మగతనం" అంటుంది. "అది లేని వాడిని ప్రేమించానని, తన బిడ్డకు చెప్పడానికి భయం లేదు, కానీ వాడు ఒక వంచకుడు అని చెప్పాల్సి వస్తే అందుకు తాను సిగ్గుపడతాను అనడంతో- వారిద్దరి మధ్య బంధం ముగిస్తుంది.

పుట్టబోయే బిడ్డకు జెనెటిక్ సిండ్రోమ్ సమస్య ఉందని తెలుసుకున్న ఆనంద, లివింగ్ ఇండియా ఫౌండేషన్ వారు నిర్వహించే శరణాలయానికి వెళుతుంది. దానికి చీఫ్ ట్రస్టీ రత్నకుమారి. ఇంటర్వ్యూ చేస్తుండగా ఆమె గర్భానికి కారణం తన కొడుకే అని తెలుసుకుంటుంది. ఆమె పెట్టబోయే ఆంక్షలు వ్యతిరేకించిన ఆనంద, "మరెక్కడా ఆనందకు, బిడ్డకు ఆర్థిక సహాయం అందకుండా చేస్తా" అన్న బెదిరింపుతో అక్కడి నుంచి బయటకు వస్తుంది. విచారణ సమయంలో భూషణరావు కుటుంబం తమలో తాము కలహించుకుంటూ ఉండడంతో ఇన్‌స్పెక్టర్ ఛీ కొట్టి అక్కడి నుంచి వెళ్ళిపోతాడు.

ఇప్పుడు తాము మీడియాలో అల్లరి కాకూడదంటే ఆ ఇన్‌స్పెక్టర్‌ని కొనేయాలనే ఉద్దేశంతో భూషణరావు తనకు తెలిసిన పోలీస్ అధికారి ద్వారా సత్యం గురించి ఆరా తీస్తాడు. ఆ పేరు గల వారెవరూ డిపార్ట్‌మెంట్లో లేరని, పైగా ఎవరూ ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు కూడా నమోదు కాలేదని తెలియవస్తుంది. దీంతో నాటికలో అందరి గుండెల్లోంచి బరువు దిగిపోయినట్లు అనిపిస్తుంది. ఇటు ప్రేక్షకుడిలో మాత్రం టెన్షన్ మొదలవుతుంది.

ఎప్పటికీ బయటపడని బలమైన రహస్యాలను, పాములవాడు నాదస్వరం ఊది పామును పైకి తెచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ బయటకు తెచ్చాడు అంటుంది దియా. ఇలా ఎవరికి వారు అతడు ప్రశ్నించగానే తమ అంతరాత్మల్లో దాగిన నిజాన్ని బయటకు వెళ్ళగక్కినట్లు ఆదిత్య అంగీకరిస్తాడు. అందరూ తలో విధంగా పశ్చాత్తాప పడితే రత్నకుమారి తాను బుస కొట్టబోయి అలకనందను కాటు వేశానంటుంది. ఇలా వారిలోని గిల్టీ కాన్షియస్నెస్, అపరాధ భావన గూడుకట్టుకొంటుంది. లోపల ఎన్నున్నా హుషారుగా డాన్స్ చేస్తూ కబుర్లు చెప్పుకుంటూంటారు.

సరిగ్గా అదే సమయంలో ఒక ఆగంతుకుడు ప్రవేశించి, తాను విజిలెన్స్ విభాగం నుంచి వస్తున్నానని, అలకనంద అనే అమ్మాయి ఆత్మహత్య చేసుకుందని, ఆ కేసు ఎంక్వైరీలో ఆమె రాసిన డైరీ దొరకడంతో అక్కడికి వచ్చానని, తన పేరు సత్యం అని చెప్పడం జరుగుతుంది. "సో వ్వాట్" అన్నట్లు అందరూ నిర్లజ్జగా నిర్లక్ష్య తూష్ణీ భావాన్ని ప్రకటిస్తూ ఉండగా నాటకం ముగుస్తుంది. ప్రేక్షకులు మాత్రం ఈ రకమైన ముగింపు మైకం (షాక్) నుండి వెంటనే బయటపడలేరు. అది ఈ నాటకం మూల/ స్వేచ్ఛానుసరణలో ఉన్న బలమూ, గమ్మత్తు.

నాటకమంతా వ్యక్తుల స్వార్థం, దౌష్ట్యం, ధనాశ, మానవ సంబంధాల తృణీకరణ, నైతిక విలువలూ నిబద్ధతా లేని వ్యాపారం, జీవనశైలి కళ్లకు కడతాయి. మోసపూరిత ప్రపంచంలో అంతరాత్మ ప్రబోధంతో నడుచుకోవడం ఎంత దుర్భరమో, దుస్సాహసమో చెబుతుంది ఈ నాటకం. రచయిత భాస్కర్ చంద్ర, సీనియర్ నటుడు ఎస్.ఎం.బాషా, శ్రీ రంజని తప్ప మిగతా వారందరూ ఇటీవలే రంగస్థలంపై రాణిస్తున్న నూతన నటులు. చక్కని ప్రదర్శన కనపరిచారు. అభినందనీయమైన ప్రమాణాలతో కూడి చిరకాలం గుర్తుండిపోయే జాతీయస్థాయి నాటకం 'ద ఇంపోస్టర్స్... అంతా నిజమే చెబుతారు".

- మల్లేశ్వరరావు ఆకుల, 798187 2655

యుద్ధంలో నిలబడేవాళ్లే కవులు

గట్టిగా మాట్లాడాల్సినప్పుడేమో
నోటికి ప్లాస్టరు వేసుకుని వుంటావు
ఉత్త సమయాల్లో,
అంతా ప్రశాంతంగా వున్నప్పుడేమో
గొంతు చించుకుంటావు

నీవొక్కడివే వున్నప్పుడూ,
ఏసీ గదిలో భలే భలే మాట్లాడతావు
నీవో విప్లవకారుడిలా
తూటాలు లోడింగ్ చేస్తున్నట్టు
అన్యాయంపైన
భలే భలే తిరుగుబాటు స్వరమౌతావు!

నీవు అకాల వానవీ
నీ మాటలు పాటలు పాడజేయడానికి తప్ప
యుద్ధంలా నిలబడ్డానికి పనికిరావు
నీవు కడుపులో చల్ల కదలకుండా బతుకుతావు
పరుపులపై కులుకుతూ
గంజి కూడా లేని బక్క బతుకులకై
సిరా వ్యయిస్తావు
ఎంత మలినమైన అక్షరాలో కదా నీవి!

నీ ఎదుట ఒకడు ఇంకొకడిని
కొడుతుంటే, తిడుతుంటే

సభలో ప్రసంగిస్తున్న మీనాక్షి ముఖర్జీ

లెఫ్ట్‌ఫ్రంట్ విజయంతోనే బెంగాల్ అభివృద్ధి: సిపిఎం నేతలు

ముర్షీదాబాద్ : లెఫ్ట్‌ఫ్రంట్, కాంగ్రెస్ అభ్యర్థుల విజయంతోనే బెంగాల్‌లో అభివృద్ధి సాధ్యమవుతుందని సిపిఎం నాయకులు తెలిపారు. లెఫ్ట్‌ఫ్రంట్, కాంగ్రెస్ బలపరిచిన ముర్షీదాబాద్ సిపిఎం అభ్యర్థి మహ్మద్ సలీమ్‌కు మద్దతుగా కరీంపూర్ బస్టాండ్ వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించారు. సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు సుమిత్ దేవ్, రాష్ట్ర కమిటీ సభ్యులు మీనాక్షి ముఖర్జీతోపాటు మయూక్ బిశ్వాస్, జమీర్ మొల్లా తదితరులు ప్రసంగించారు.

సుగంధ ద్రవ్యాల్లో
క్రిమి సంహారకాల స్థాయి 10 రెట్లు పెంపు

- ఎఫ్ఎస్ఎస్ఎఐ గ్రీన్‌సిగ్నల్

న్యూఢిల్లీ : సుగంధ ద్రవ్యాల్లో క్రిమి సంహారక మందుల అవశేషాల పరిమాణాన్ని పెంచుతూ భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్-ఎస్ఎఐ) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గరిష్ఠ అవశేష పరిమితి (ఎంఆర్ఎల్)ని పది రెట్ల వరకు పెంచింది. ఈ పెరుగుదల కిలోగ్రాము(కేజీ)కు 0.01 మిల్లిగ్రాము(ఎంజీ)ల నుంచి 0.1 ఎంజీకి పెంచింది. ఇది గతంలో అనుమతించిన స్థాయి, పరిమాణం కంటే అధికం కావటం గమనార్హం. ఈ పెరుగుదలపై పలువురు మార్కెట్, ఆరోగ్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధిక మొత్తంలో క్రిమిసంహారకాల వినియోగం క్యాన్సర్‌కు దారి తీయవచ్చని హెచ్చరిస్తున్నారు.

ఎగుమతులు, దిగుమతులపై ప్రభావం

ఈ సడలింపు కారణంగా కొన్ని పెద్ద మార్కెట్లకు భారత సుగంధ ద్రవ్యాల ఎగుమతులు ఎక్కువగా తిరస్కరించబడతాయని పెస్టిసైడ్ యాక్షన్ నెట్‌వర్క్ సిఇఒ దిలీప్ కుమార్ తెలిపారు. అధికమొత్తంలో పెస్టిసైడ్ కలిగి ఉన్న సుగంధద్రవ్యాల దిగుమతి సులభతరం కానున్నదని చెప్పారు. తమకు అందిన పలు విజ్ఞప్తుల ఆధారంగానే పెస్టిసైడ్ పరిమితిని పెంచినట్టు ఎఫ్ఎస్ఎస్ఎఐ తెలిపింది. అలాంటి విజ్ఞప్తులు ఎవరు చేశారన్నదాని గురించి మాత్రం సంస్థ వెల్లడించలేదు. క్రిమిసంహారకాల అవశేషాల పరిమాణం పెంచిన కారణంగా సుగంధద్రవ్యాలను వినియోగించేవారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నదని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రాం, సుస్థిర ఆహారాభివృద్ధి డైరెక్టర్ అమిత్ ఖురానా హెచ్చరించారు. సుగంధ ద్రవ్యాల్లో అధిక పెస్టిసైడ్‌ల వినియోగం కారణంగా కొన్ని ప్రముఖ బ్రాండ్లకు చెందిన అమ్మకాలపై హాంగ్‌కాంగ్, సింగపూర్, మాల్దీవులు గతనెల నిషేధం విధించాయి. భారత్‌కు చెందిన ఒక కంపెనీ మాత్రం తమ బ్రాండ్ అమ్మకాలపై వచ్చిన ఆరోపణలను తోసిపుచ్చింది.

అత్యంత ఎక్కువ అవశేషాలు ఉండేందుకు అనుమతించలేదు : భారత ప్రభుత్వ వివరణ

ఆహార పదార్థాల్లో క్రిమి సంహారక మందుల అవశేషాలకు అత్యంత కఠినమైన

నిబంధనలు ఆమోదించిన దేశాల్లో భారత్ ఒకటని ప్రభుత్వం ఆదివారం తెలిపింది. సుగంధ ద్రవ్యాల్లో అత్యంత ఎక్కువగా క్రిమిసంహారక అవశేషాలు వుండేందుకు ఆహార నియంత్రణా సంస్థ ఎఫ్ఎస్ఎస్ఎఐ అనుమతించిందని వస్తున్న వార్తలను కొట్టిపారేసింది. భారతదేశంలో రెండు ప్రఖ్యాతిచెందిన బ్రాండ్లు ఎండిహెచ్, ఎవరెస్ట్‌లకు చెందిన కొన్ని మాసాల మిక్స్ శాంపిల్స్‌లో క్రిమిసంహారక మందు ఎథిలిన్ ఆక్సైడ్ వుందంటూ హాంకాంగ్ ఫుడ్ రెగ్యులేటర్ వాటిపై నిషేధం విధించిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ వివరణ ఇచ్చింది. ఎవరెస్ట్ బ్రాండ్‌కి చెందిన ఒక మసాలా ఉత్పత్తిని ఉపసంహరించాలని సింగపూర్ ఫుడ్ రెగ్యులేటర్ కూడా ఆదేశించింది. దేశీయ మార్కెట్లలో విక్రయిస్తున్న ఎండిహెచ్, ఎవరెస్ట్‌లతో సహా వివిధ బ్రాండ్లకు చెందిన నమూనాలను ప్రస్తుతం ఎఫ్ఎస్ఎస్ ఎఐ సేకరిస్తోంది. ప్రభుత్వం విధించిన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా అవి వున్నాయా? లేదా? అని తనిఖీ చేస్తోంది. ఎగుమతి చేసే మసాలాల నాణ్యతను ఇది నియంత్రించలేదు.

ఒరిస్సాలో ఐదు సీట్లకు కాంగ్రెస్ అభ్యర్థుల మార్పు

భువనేశ్వర్ : ఒరిస్సాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థులను కాంగ్రెస్ ఆదివారం మార్చింది. నీలగిరి అసెంబ్లీ సీటుకు అక్షయ ఆచార్యను ఖరారు చేసింది. ఆరతి దేవ్ స్థానంలో బరి అసెంబ్లీ సీటుకు మాజీ మంత్రి దేవశిష్ నాయక్‌ను నామినేట్ చేసింది. జలేశ్వర్ సీటుకు దేవీ ప్రసన్న చంద్ స్థానంలో కాంగ్రెస్ ప్రతినిధి సుదర్సన్ దాస్‌ను నామినేట్ చేశారు. అత్మాలిక్ అసెంబ్లీ సెగ్మెంట్‌కు హిమాంశు చౌలియాకు టిక్కెట్ ఇచ్చారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ప్రాంతీయ కార్యాలయము, విజయవాడ

బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలంగా తెలియజేయుట ఏమనగా మా బ్యాంకు ద్వారా బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణములు ఎన్ని నోటీసులు పంపినసూ దిగువ తెలిపినవారు తమ బాకీలను చెల్లించుచుండలేదు మరియు ఋణము చెల్లించవలసిన కాలము గతించినందున, సదరు బంగారునగలు **ది. 22-05-2024, మంగళవారం, సాయంత్రం 04.00 గం॥లకు** మా బ్రాంచి ఆవరణలో బహిరంగ వేలము చేసి వారి పేరుసరుయున్న బకాయిలకు జమకట్టుకొనబడును. వేలములో పాల్గొనదలచినవారు **ది. 22-05-2024, మధ్యాహ్నం 02.00 గం॥లలోపల తమ గుర్తింపుకార్డును చూపి రూ. 5,000/- ల** ధరావత్తుగా చెల్లించవలయును. ఎట్టికారణము చూపకనే వేలమును రద్దుచేయుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. వేలము వేసినా కూడా బకాయి రద్దుకాని యెడల మిగిలిన బకాయి మరియు ఇతర ఖర్చులు కొరకు వారిపై చట్టరీత్యా తగుచర్య తీసుకొని మిగిలిన బయాయిలను వసూలు చేయబడును. ఈ దిగువ పేర్కొనబడిన ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలము నోటీసు వర్తిస్తుంది.

క్రమ. సం.	లోను ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	మొత్తం తూకం గ్రాములో
		మైలవరం బ్రాంచి	
1.	329906630000024	కొత్తపల్లి భాగ్యమ్మ	11.00
2.	329906540051096	దండ్లమూడి శ్రీనివాసరావు	13.00
3.	329906540051462	బెజవాడ భారతి	21.00
		కొనకంచి బ్రాంచి	
1.	029716540005059	బి. అడవి రాముడు	8.00
		పెనుగంచిప్రోలు బ్రాంచి	
1.	200116540008137	పిన్నబోయిన సుబ్బారావు	70.00
2.	200116540008133		73.50

తే||. 04-05-2024, ప్రదేశం : విజయవాడ సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ ఆఫీస్, విజయవాడ

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) | సిండికేట్ Syndicate
పామర్రు బ్రాంచ్ (13756)
23-106, పామర్రు, కృష్ణా జిల్లా-521157, ఆంధ్రప్రదేశ్. ఫోన్: 9491399443

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

దిగువ వారికి:
(1) శ్రీ అప్పారావు పల్లి, తండ్రి: పైడయ్య, డి.నెం 14 19, అరండల్‌పేట, పామర్రు-521157.
(2). సహ-ఋణగ్రహీత/హామీదారు: పల్లి వి. రామాంజనేయులు, తండ్రి: అప్పారావు, డి.నెం. 14 19, గౌడ రామాలయం దగ్గర, అరండల్‌పేట, పామర్రు-521157.
(3). సహ-ఋణగ్రహీత: శ్రీ మారాడ విజయలక్ష్మి, తండ్రి: అప్పారావు పల్లి, డి.నెం. 14 20, గౌడ రామాలయం దగ్గర, అరండల్‌పేట, పామర్రు-521157.
డియర్ సర్ / మేడమ్,
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.
మా కెనరా బ్యాంక్, పామర్రు బ్రాంచ్ నుండి శ్రీ అప్పారావు పల్లి, పల్లి వి. రామాంజనేయులు మరియు శ్రీ మారాడ విజయలక్ష్మి పొందిన లోన్ / ఋణసౌకర్యాల వివరములు:

లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేది	ఈ తేది నాటికి పడ్డీతో కలుపుకొని బకాయి మొత్తం	పడ్డీ రేటు
కెన్ హార్వెస్ట్ అకౌంట్ నెం. 37567830000074	రూ.11,00,000/- తేది: 07.08.2015	రూ. 3,90,575.68/-	13.70%
HL అకౌంట్ నెం. 37569730000018	రూ.5,00,000/- తేది: 20.12.2016	రూ. 2,29,783.88/-	10.75%

మీకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ **సదరు ఋణాన్ని తేది 30.03.2024న నిరర్థక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది.** అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **రూ.6,20,359.56/-** (అక్షరాల **ఆరు లక్షల ఇరవై వేల మూడు వందల యాభై తొమ్మిది రూపాయలు మరియు యాభై ఆరు పైసలు మాత్రమే**) + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే నదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. నదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.
SARFAESI చట్టం సందిని సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

పామర్రు ఎస్ఆర్ఒ, పామర్రు మండలం, పామర్రు, డి.నెం. 14-20, ఆర్. ఎస్ నెం. 280/1 నందు **140 చ॥గ॥లలోని గ్రౌండ్ మరియు 1వ అంతస్తు కలిగిన ఆర్‌సిసి రూఫ్ రెసిడెన్షియల్ బిల్డింగ్. హద్దులు:** తూర్పు: సొంగ శ్రీనివాసరావు మరియు ఇతరుల స్థలం, దక్షిణం: వీరంకి అప్పలరావు మరియు ఇతరుల స్థలం, పడమర: రామాలయం బజారు, ఉత్తరం: ఆరేపల్లి సూరి స్థలం.

తే||: **31.03.2024**, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

TMB Tamilnad Mercantile Bank Ltd. Be a step ahead in life
L65110TN1921PLC001908
తమిళనాడు మెర్కాంటైల్ బ్యాంక్ లిమిటెడ్
పెదనందిపాడు శాఖ, డో.నం.9-66, గ్రౌండ్ ఫ్లోర్, పి.ఎ.ఎస్. కాలేజ రోడ్డు, పెదనందిపాడు-522235, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.
మొబైల్ : 9177707749, ల్యాండ్‌లైన్ : 08643-277244.

డిమాండ్ నోటీసు
సర్ఫేసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద

టు, ఋణగ్రహీత/తనఖాదారు(లు)/హామీదారు(లు) : **1. శ్రీ.మోర్ పవన్ కుమార్,** తండ్రి. **మోర్ మురళీకృష్ణ,** ప్రొప్రైటర్ : మెసెర్స్. సాయి జయ జ్యోస్నిక ఏజెన్సీస్, డో.నం.9-58/1, ఎస్‌బిఆర్ కాలనీ, పెదనందిపాడు-522235, గుంటూరు జిల్లా, **2. శ్రీ.మోర్ పవన్ కుమార్,** తండ్రి. **మోర్ మురళీకృష్ణ,** డో.నం.10-103, పెదనందిపాడు గ్రామం మరియు మండలం, గుంటూరు-522235. **3. శ్రీ.మురళీకృష్ణ మోర్,** తండ్రి. **సీతారామయ్య,** డో.నం.10-103, పెదనందిపాడు గ్రామం మరియు మండలం, గుంటూరు-522235. **4. శ్రీమతి. కలె సరస్వతి, భర్త. మోర్ పవన్ కుమార్,** డో.నం.10-103, పెదనందిపాడు గ్రామం మరియు మండలం, గుంటూరు-522235. **5. శ్రీమతి. మోర్ కొండల బాయి, భర్త. మోర్ మురళీకృష్ణ,** డో.నం.10-103, పెదనందిపాడు గ్రామం మరియు మండలం, గుంటూరు-522235.
డియర్ సర్/మేడం,
సప్లిమెంట్ : పెదనందిపాడు శాఖ వద్ద మెసెర్స్.సాయి జయ జోస్నిక ఏజెన్సీస్, ప్రొప్రైటర్.శ్రీ.మోర్ పవన్ కుమార్, తండ్రి. మోర్ మురళీకృష్ణ ఎకౌంట్ నం.:284700050900054 ద్వారా పొందిన రుణానికి సంబంధించి సర్ఫేసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు.
మీ అభ్యర్థన మేరకు బ్యాంక్ తన పెదనందిపాడు శాఖ ద్వారా షెడ్యూల్ ఎ లో పేర్కొన్న వివరాల ప్రకారం ఋణ(గ్రహీత/ఋణగ్రహీతలకు ఎప్పటికప్పుడు వివిధ క్రెడిట్ సౌకర్యాలు మంజూరు చేసింది. మీరు, ఋణగ్రహీతలు పేర్కొన్న క్రెడిట్ సౌకర్యాలను తిరిగి చెల్లించే బాధ్యతతో క్రెడిట్ సౌకర్యాలను పొందారు మరియు బ్యాంకు అనుకూలంగా అవసరమైన ఋణ పత్రాలను అమలు చేశారు మరియు షెడ్యూల్-బి లో చూపిన చరాస్తులకు సంబంధించి ఛార్జీని సృష్టించారు.
ఇంకా రుణగ్రహీత(లు)/ హామీదారులు/తనఖాదారులు సెక్యూరిటీగా షెడ్యూల్ సి లో పూర్తిగా వివరించబడిన ఆస్తికి సంబంధించి ట్రైటిల్ డీడ్‌లను డిపాజిట్ డిపాజిట్ చేయడం ద్వారా తనఖాని కూడా సృష్టించారు.
బ్యాలెన్స్ నిర్ధారణ లేఖలు మరియు పునరుద్ధరణ లేఖలు మరియు ఇతర భద్రతా పత్రాలను కూడా ఎప్పటికప్పుడు అమలు చేయడం ద్వారా ఎగువ రుణ ఖాతా/(లు)లోని బాధ్యతను మీరు సక్రమంగా అంగీకరించారు. అంతేకాకుండా రుణగ్రహీత/రుణగ్రహీతలు ప్రధాన రుణం మరియు దానిపై వడ్డీని తిరిగి చెల్లించడంలో చేసిన డిఫాల్ట్‌ల పర్యవసానంగా నిల్ ద్వారా రుణ ఖాతా వ్యక్తిగతంగా హామీ ఇవ్వబడింది, తదుపరి లోన్ ఎకౌంట్ వ్యక్తిగత హామీదారులు **1. శ్రీ.మురళీకృష్ణ మోర్, తండ్రి. సీతరామయ్య, 2. శ్రీమతి. కలె సరస్వతి, భర్త. మోర్ పవన్ కుమార్, 3. శ్రీమతి. మోర్ కొండలబాయి, భర్త. మోర్ మురళీకృష్ణ** రుణగ్రహీత/రుణగ్రహీతలు ప్రధాన రుణం మరియు దానిపై వడ్డీని తిరిగి చెల్లించడంలో చేసిన డిఫాల్ట్ ఫలితంగా, ఎప్పటికప్పుడు జారీ చేయబడిన ఆస్తుల వర్గీకరణలకు సంబంధించి భారతీయ రిజర్వ్ బ్యాంక్ దిశలు/మార్గదర్శకాలు ఆదేశాల ప్రకారం రుణ ఖాతా, 04.04.2024 నాటికి నాన్-పెర్ఫార్మింగ్ ఆస్తులుగా (ఎన్‌పిఎ) వర్గీకరించబడింది. మిమ్మల్ని పదే పదే అభ్యర్థనలు చేసినప్పటికీ, రుణగ్రహీతలు విఫలమయ్యారు మరియు చెప్పబడిన బకాయిలు/బాకీ ఉన్న బాధ్యతలను తిరిగి చెల్లించడంలో విస్మరించారు. మీరు, రుణగ్రహీతలు, హామీదారులు మరియు తనఖాదారులు ఈ నోటీసు ద్వారా సెక్షన్ 13(2) కింద బాధ్యతలను పూర్తిగా బ్యాంకుకు చెల్లించాలని మరియు కొంత మొత్తాన్ని **రూ.34,16,916.66/-** (**ఓవర్ డ్రాఫ్ట్-రూ.30,42,420.90/-, డబ్ల్యూసిఎల్-రూ.3,74,495.76/- (మూపై నాలుగు లక్షల పదహారు వేల తొమ్మిది వందల పదహారు రూపాయల అరవై ఆరు పైసలు మాత్రమే)** 15.04.2024 నాటికి ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోపు బ్యాంకుకు తిరిగి చెల్లించాలని కోరుతున్నారు. మీరు యాదృచ్ఛిక ఖర్చులు, ఛార్జీలు మొదలైన వాటితో పాటు పైన పేర్కొన్న మొత్తంపై నెలవారీ విశ్రాంతితో ఓడి-13.45 శాతం డబ్ల్యూబిఎల్-13.80 శాతం భవిష్యత్ వడ్డీని కూడా చెల్లించవలసి ఉంటుంది. సెక్షన్ 13లోని సబ్-సెక్షన్ (4) క్రింద వివరించిన అన్ని లేదా ఏదైనా హక్కులను మరియు చట్టంలోని ఇతర వర్తించే నిబంధనల ప్రకారం, మీరు పైన పేర్కొన్న మొత్తాన్ని భవిష్యత్ వడ్డీతో పాటు అన్ని ఖర్చులు మరియు ఖర్చులతో చెల్లించడంలో విఫలమైతే, బ్యాంక్ అన్ని లేదా ఏదైనా హక్కులను అమలు చేస్తుంది.
పై చట్టంలోని సెక్షన్ 13 (13) ప్రకారం, ఈ నోటీసు జారీ చేసిన తర్వాత, ఇక్కడ షెడ్యూల్‌లో ప్రత్యేకంగా పేర్కొన్న పై సదరు ఆస్తులలో దేనినైనా అమ్మకం, లీజు లేదా ఇతర మార్గాల ద్వారా బదిలీ చేయకుండా మీరు, రుణగ్రహీతలు/ హామీదారులు/ తనఖాదారులు నిరోధించబడ్డారు. బ్యాంక్ యొక్క ముందస్తు ప్రాతపూర్వక అనుమతి లేకుండా బదిలీ చేయడం బ్యాంక్ హక్కులను ప్రభావితం చేయడం మరియు అలాంటి బదిలీ ఏదైనా చెల్లదు.
ఋణగ్రహీతలు/తనఖాదారులు/హామీదారులు జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించదమైనది. సర్ఫేసీ యాక్ట్ యొక్క సెక్షన్ 13(8).
భద్రపరచబడిన రుణదాత యొక్క బకాయిల మొత్తం, అన్ని ఖర్చులు, ఛార్జీలు మరియు ఖర్చులతో పాటుగా, పబ్లిక్ వేలం లేదా పబ్లిక్ లేదా ప్రైవేట్ (ట్రీటీ నుండి బదిలీకి అహ్వానించే కొటేషన్లు లేదా టెండర్ ప్రకటన తేదీకి ముందు ఎప్పుడైనా సురక్షిత రుణదాతకు టెండర్ చేయబడుతుంది. సురక్షితమైన ఆస్తుల లీజు, కేటాయింపు లేదా అమ్మకం-
1) సురక్షిత ఆస్తి ఈ క్యూర్ రుణదాత ద్వారా లీజు కేటాయింపు లేదా విక్రయం ద్వారా బదిలీ చేయబడదు మరియు
2) ఒకవేళ, ఈ సబ్-సెక్షన్ కింద అటువంటి మొత్తాన్ని టెండర్ చేయడానికి ముందు లీజుదారు అసైన్‌మెంట్ లేదా ఆస్తిని విక్రయించడం ద్వారా బదిలీ చేయడానికి సెక్యూర్డ్ క్రెడిటార్ ఏదైనా చర్య తీసుకున్నట్లయితే, అటువంటి సెక్యూర్డ్ అసెట్స్ కేటాయింపు లేదా అమ్మకం లీజు పద్ధతిలో బదిలీ చేయడానికి సెక్యూర్డ్ క్రెడిటార్ తదుపరి చర్య తీసుకోరు.
చట్టంలోని ఏదైనా ఇతర వర్తించే నిబంధనల ప్రకారం అవసరమని భావించే ఇతర చర్యలను లేదా చట్టపరమైన చర్యలను ప్రారంభించే బ్యాంక్ హక్కుకు పక్షపాతం లేకుండా ఈ నోటీసు జారీ చేయబడింది.

షెడ్యూల్-ఎ

క్ర సం.	ఎకౌంట్ నం.తో సౌకర్యం యొక్క స్వభావం	మంజూరు చేయబడిన పరిమితి మొత్తం (రూ.)	లోన్ డాక్యుమెంట్ల అమలు తేది/చివరి రెన్యువల్	15-04-2024 నాటికి బకాయి మొత్తం
1	ఓవర్ డ్రాఫ్ట్ 284700050900054	Rs.30,00,000/-	07-11-2023	Rs. 30,42,420.90
2	వర్కింగ్ క్యాపిటల్ టర్మ్ లోన్ 284700480100081	Rs.5,00,000/-	09-03-2022	Rs.3,74,495.76
			మొత్తం	Rs.34,16,916.66

షెడ్యూల్-బి
చాక్లెట్, బిస్కెట్లు, మిఠాయి వస్తువులు, శీతల పానీయాలు ఇతర కిరాణా వస్తువులు మరియు వాణిజ్య రాబడులు మొదలైన వాటి వ్యాపారంలో స్టాక్ యొక్క హైపోథెకేషన్.

షెడ్యూల్-సి
అంశం నం.1 : గుంటూరు జిల్లా, పదనందిపాడు-522235, నాగులపాడు రోడ్డు, బ్లాక్ నం.4, డో.నం.4-143 వద్ద, సర్వే నం.432-6 వద్ద **శ్రీ.పవన్‌కుమార్ మోర్, తండ్రి. మురళీకృష్ణ మోర్** పేరు మీద ఉన్న తనఖాకు సమానమైన రెసిడెన్షియల్ స్థలం విస్తీర్ణం 96.80 చ.గ.లు.
అంశం నం.2 : ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లా, పెదనందిపాడు-522235, పోలేరమ్మ గుడి బస్టాప్ వద్ద, బ్లాక్ నం.7, డో.నం.7-19 వద్ద, సర్వే నం.127/4 వద్ద **శ్రీమతి. మోర్ కొండలబాయి, భర్త. మురళీకృష్ణ మోర్** పేరు మీద ఉన్న తనఖాకు సమానమైన రెసిడెన్షియల్ స్థల విస్తీర్ణం 71.79 చ.గ.లు. (బైటిల్ డీడ్ 80.0 చ.గ.లు. ప్రకారం)
అంశం నం.3 : ఆంధ్రప్రదేశ్, పెదనందిపాడు మండలం, కాట్రపాడు గ్రామం యొక్క డో.నం.235-1ఎ, కన్వెన్షన్ సర్టిఫికేట్ స్థలం ప్రకారం, కాట్రపాడు యొక్క డో.నం.235/1 వద్ద శ్రీ.పవన్ కుమార్ మోర్, తండ్రి. మురళీకృష్ణ మోర్ పేరు మీద ఉన్న తనఖాకు సమానమైన ఖాళీ స్థలం విస్తీర్ణం ఎసి. 0.46 సెంట్లు. (స్థలం కన్వెన్షన్ ప్రకారం స్థలం 0.43 సెంట్లు.)

తే||: 22-04-2024 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం: పెదనందిపాడు తమిళనాడు మెర్కాంటైల్ బ్యాంక్ లిమిటెడ్. పెదనందిపాడు శాఖ

తప్పని అప్పుల తిప్పలు

- కుటుంబాలపై పెరిగిన రుణభారం తగ్గిపోతున్న పొదుపు
- మోడీ ప్రభుత్వ విధానాలే కారణం

న్యూఢిల్లీ : దేశంలో పేద, మధ్య తరగతి కుటుంబాలకు అప్పుల తిప్పలు తప్పడం లేదు. నానాటికీ పెరిగిపోతున్న రుణభారం కారణంగా ఆ కుటుంబాల్లో పొదుపు అనే పదమే విన్పించడం లేదు. రిజర్వ్‌బ్యాంక్ తాజా గణాంకాల ప్రకారం 2022-23లో స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)లో కుటుంబాల నికర ఆర్థిక ఆస్తులు 5.1%కి పడిపోయాయి. ఆర్థిక ఆస్తులు అంటే బ్యాంకులు, బ్యాంకింగ్ యేతర సంస్థల్లో డిపాజిట్లు, నగదు, ఈక్విటీలో పెట్టుబడులు, బీమా, పెన్షన్ ఫండ్ మొదలైనవి. ఈ తరహా ఆస్తులు 2018-19లో జిడిపిలో 7.9%, 2019-20లో 8.1%, 2020-21లో 11.5%, 2021-22లో 7.2%గా ఉన్నాయి.
దేశంలో చాలా మంది పౌరులకు పొదుపు చేయడానికి ఆర్థిక ఆస్తులు ప్రధాన వనరు. ఆదాయాలు తగ్గిపోవడం, అధిక ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి కారణాలతో కుటుంబాల్లో పొదుపు తగ్గిపోతోంది. పొదుపు చేసిన సొమ్ము కొద్దో గొప్పో ఉన్నప్పటికీ దానిని కూడా కుటుంబ అవసరాల కోసం ఖర్చు చేసుకోవాల్సి వస్తోంది. చాలా కుటుంబాలు మాత్రం ఇప్పుడు పొదుపు అనే మాటే మరిచిపోయాయి. అదే సమయంలో కుటుంబాల రుణభారం పెరిగిపోతోంది. ఫలితంగా నికర ఆర్థిక ఆస్తులు తరిగిపోతున్నాయి. ఇక ఎగువ మధ్యతరగతి ప్రజలు, సంపన్నులు తమ వద్ద ఉన్న డబ్బును పొదుపు చేయకుండా బంగారం, వెండి, భూమి కొనుగోలుకు వినియోగిస్తున్నారు. లేదా ఇళ్ల నిర్మించుకుంటున్నారు.
కోవిడ్ సమయంలో...
2020-21లో... అంటే కోవిడ్ తొలి సంవత్సరంలో ఆర్థిక ఆస్తులు సుమారు రూ.31 లక్షల కోట్లకు పెరిగాయి. లాక్‌డౌన్ అమలులో ఉండడం, లావాదేవీలు చాలా తక్కువగా జరగడమే దీనికి కారణం. బ్యాంకులు, షేర్లలో ఉన్న డబ్బంతా అలాగే ఉండిపోయింది. ఆ తర్వాతి సంవత్సరం ఆర్థిక ఆస్తులు గణనీయంగా పడిపోయాయి. ఆర్థిక వ్యవస్థ తిరిగి గాడిలో పడడమే దీనికి కారణం. అయితే అదే సమయంలో అప్పులు పెరిగాయి.
బ్యాంక్ డిపాజిట్లు, రుణాలే అధికం
అప్పులకు ప్రధాన వనరు బ్యాంక్ రుణాలే. ఆర్‌బిఐ అందజేసిన సమాచారం ప్రకారం కుటుంబాల అప్పుల్లో బ్యాంక్ రుణాల వాటాయే 77%గా ఉంది. మిగిలిన అప్పులు బ్యాంకింగ్ యేతర ఆర్థిక కంపెనీలు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు, బీమా కంపెనీల నుండి తీసుకున్నవి. 2018-19 నుండి 2022-23 వరకూ కుటుంబాల రుణభారం 23% పెరిగింది. ఇక ఆర్థిక ఆస్తుల్లో బ్యాంక్ డిపాజిట్ల వాటా 35%గా ఉంది. పిపిఎఫ్ సహా ప్రొవిడెంట్, పెన్షన్ ఫండ్లు 22%, జీవిత బీమా నిధులు 18%, చిన్న మొత్తాల పొదుపు 7% వాటాతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఆర్థిక ఆస్తుల్లో కేవలం 7% మాత్రమే పెట్టుబడుల రూపంలో ఉండడం ఆసక్తికరం. వీటిలో మ్యూచువల్ ఫండ్స్‌లో అత్యధికంగా 6% పెట్టుబడులు ఉంటే షేర్లలో అత్యల్పంగా 0.8% ఉన్నాయి. దీనిని బట్టి అర్థమవుతోంది ఏమిటంటే భారత ప్రజలు షేర్ మార్కెట్‌లో అతి తక్కువగా పెట్టుబడి పెడుతున్నారు.
ప్రభుత్వ విధానాలే కారణం
2018-19, 2022-23 మధ్యకాలంలో బ్యాంక్ డిపాజిట్లు 9% పెరిగాయి. జీవిత బీమా, పెన్షన్ నిధుల్లో కూడా పెరుగుదల కన్పించింది. భౌతిక ఆస్తుల్లో పొదుపు సుమారు రూ.28 లక్షల కోట్లు ఉంటుందని అంచనా. బంగారం, వెండిపై పొదుపు కూడా సుమారు రూ.60,000 కోట్లు ఉండవచ్చునని ఆర్‌బిఐ అంచనా వేసింది. ఇవన్నీ అధికారిక గణాంకాలే. అనధికారికంగా, చట్టవిరుద్ధంగా జరిగే లావాదేవీలకు లెక్కే ఉండదు



జీవన సౌరభం

గెలవకపోవడం ఓటమి కాదు. మళ్లీ ప్రయత్నించకపోవడమే ఓటమి.

కుందేలు తెలివి

అడవిలోని అన్ని జంతువులు కుందేళ్ల మహా తెలివిగలవి అని మెచ్చుకోవడం సింహం చెవిన పడింది. వాటి తెలివి ఏ పాటిదో పరీక్షించాలనుకుని ఓ కుందేలుని తన నివాసానికి రమ్మని కబురు పెట్టింది సింహం. మృగరాజు కబురు వినగానే కుందేలు భయపడిపోయింది. ఎందుకు రమ్మందో అనుకుని సింహం గుహలోకి వెళ్ళింది. ఓ సింహాసనం మీద అది కూర్చొని ఉంది.

కుందేలును చూడగానే సింహం భీకరంగా గర్జించింది. 'రా నీ తెలివి ఏపాటిదో చూస్తా. ఇప్పుడు నువ్వు ఈ గుహ నుంచి ఎలా తప్పించుకుంటావో చెప్పు' అని సింహాసనం దిగి, గుహ ద్వారం మూ సివేసింది. కుందేలు బిక్కు బిక్కుమనుకుంటూ ఆలోచనలో పడింది. దాన్ని చూసి సింహం వికటాట్టహాసం చేసింది.

ఒక పక్క భయంతో వణికిపోతున్నా, ఎక్కడా దాన్ని వ్యక్తపరచకుండా నిబ్బరంగా కూర్చొన్న కుందేలు, 'మృగరాజా నీ గుహ ముందు ఏదో శబ్దం వినపడుతోంది చూశారా?' అంది. దానికి సింహం నవ్వి 'నా గుహ ముందు శబ్దమా' అని అంటుండగా, కుందేలు కల్పించుకుని 'అదిగో

వినపడుతోంది, మీ గర్జన దానితో కలిసిపోయింది. మీ గుహలోకి రావడానికి ఎన్ని గుండెలు ఉండాలి, మీ నవ్వు, మీ గర్జన సామాన్యమా' అంటూ పొగిడింది. ఆ పొగడ్తకు పొంగి పాయింది సింహం. 'నా గుహ ముందే శబ్దాలా' అనుకుంటూ గుహ ద్వారం తెరచింది. దానికోసమే ఎదురుచూస్తున్న కుందేలు గుహ ద్వారం దాటి బయటికి వెళ్ళి, 'ఏ శబ్దాలు లేవు, ఆపద నుండి తప్పించుకునేందుకు నేనే అలా చెప్పాను' అంటూ తుర్రు మంది.

– కనుమ ఎల్లారెడ్డి, ఆస్టిన్, టెక్సస్ స్టేట్, అమెరికా, 93915 23027.

పి.జైస్య
2వ తరగతి
నాగర్ కర్నూల్

బొమ్మల కొలువు

వారాది రియాన్ రోస్,
3వ తరగతి,
సెయింట్ జేవియర్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఎల్ ఎమ్ కాంపౌండ్,
ముద్దనూరు, కడప జిల్లా.

బాలలం

బాలలం మేము బాలలం
భవితవ్యానికి మణి దీపాలం
కల్లాకపటం ఎరగని వాళ్ళం
పట్టుదలకు ప్రతిరూపాలం

అమ్మా నాన్నల కలల పంటలం
పుడమి తల్లి కన్న బిడ్డలం
సరసున విరసిన కలువ పువ్వులం
భరతమాతకు మేమే వారసులం

నింగిని నేలను ఏకం చేస్తాం
విజయాలెన్నో సాధిస్తాం
తేనె మనసులను గెలిచేస్తాం
అందరి మెప్పును పొందుతాం

ఆటలెన్నో మేము ఆడేస్తాం
అందరినీ మేము అలరిస్తాం
పాటలు బాగా పాడేస్తాం
ప్రతిభనెంతో మేము సాధిస్తాం

బాల కథలు బాగా ఇష్టం
తాతయ్య చెప్పే కథలు ఇష్టం
మామయ్య చెప్పే కబుర్లు ఇష్టం
అమ్మమ్మ చేసిన అరిసెలు ఇష్టం

కేరింతలు పులకింతలతో
ఊరు వాడ చుట్టేస్తాం
ఏటి గట్టున గవ్వలు ఏరి
బాల్యాన్ని పదిలం చేస్తాం

ఐక్యమత్యమే బలమని చాటుతూ
ఆశయాల బాటలో పయనిస్తాం
గురువు చేసిన బోధనలన్ని
క్రమం తప్పక పాటిస్తూ
అమ్మా నాన్నను మురిపిస్తాం!

– నెల్లుట్ల సునీత, 79894 60657.

గమనిక

వేసవి సెలవుల్లో పిల్లలకు తోడుగా 'చిన్నారి' ఈరోజు నుంచి 'వేసవి విడిది'గా ముస్తాబవుతుంది. విద్యార్థినీ విద్యార్థుల రచనలను ఆహ్వానిస్తోంది. కథలు, కవితలు, బొమ్మలు, సెలవుల్లో మీ అనుభవాలు, ప్రయాణ విశేషాలు, ఇతరత్రా కబుర్లూ మెయిల్‌కి లేదా వాట్సాప్ నెం : 8332925496కి పంపండి.

మెయిల్ ఐడీ :
chinnaarips@gmail.com

– ఎడిటర్

కాళ్లే చేతులుగా...

"ఏం లేకపోయినా, పట్టుదల ఉంటే చాలు. అనుకున్నది సాధించొచ్చు." అంటాడు చెన్నైకి చెందిన కె తాన్‌సేన్. అలా అంటున్నప్పుడు అతడి ముఖం ఆత్మవిశ్వాసంతో వెలిగిపోతూ ఉంటుంది. చిన్నప్పుడు విద్యుద్ఘాతానికి గురై, అతడు తన రెండు చేతులూ కోల్పోయాడు. కానీ, ధైర్యాన్ని మాత్రం కోల్పోలేదు. అంతకంతకు మరింత పెంచుకున్నాడు. చదువుల్లో రాణించాడు. కాళ్లతోనే కారును నడుపుతూ, తాజాగా డ్రైవింగ్ లైసెన్స్ కూడా సాధించాడు.

అప్పుడప్పుడు మనం విదేశీయులు కొందరు కాళ్లతోనే కారు నడుపుతున్న, అనేక పనులు అవలీలగా చేస్తున్న దృశ్యాలను చూస్తుంటాం. వారి పట్టుదలకు, ఆత్మవిశ్వాసానికి మనసులోనే జేజేలు పలుకుతాం. ఇప్పుడు అలాంటి జేజేలు అనేకం తాన్‌సేన్‌కి చెప్పాలి. మొక్కవోని అతడి పట్టుదలకు చెప్పాలి. తాన్‌సేన్‌ది చెన్నైలోని వైయస్సార్‌పాడి ప్రాంతం. చిన్నప్పుడు తన మిత్రులతో ఆడుకుంటూ ఉన్నప్పుడు ఇంటి పై నుంచి వెళుతున్న హైస్పీడు విద్యుత్ వైర్ల ఘాతానికి గురయ్యాడు. ప్రాణాపాయ స్థితికి చేరిన అతడిని తల్లిదండ్రులు హాస్పటల్లో చేర్చారు. ప్రాణాలు దక్కాయి కానీ, తీవ్రంగా దెబ్బతిన్న చేతులు రెంటినీ మోచేయి వరకూ తీసేయాల్సి వచ్చింది. కుటుంబ సభ్యులు చాలా ఆవేదనకు గురయ్యారు. తాన్‌సేన్ కూడా చాలాకాలం తన చేతులను చూసుకొని, బాధపడ్డాడు. తరువాత చేతులు లేవన్న వాస్తవాన్ని అంగీకరించి, ఆ వెలితిని మనసులోంచి తీసేశాడు. ఇంట్లో వాళ్లు కూడా అతడిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతూ, అనేక సహాయ సహకారాలు అందించారు.

చేతులు లేకపోతేనేం, కాళ్లున్నాయి కదా! అనుకున్నాడు తాన్‌సేన్. అందరూ చేతులతో చేసే పనులను తాను కాళ్లతో చేయటానికి సాధన చేశాడు. నెమ్మదిగా కాళ్ల అతడు చెప్పినట్టు వినటం మొదలెట్టాయి. కాళ్లతో రాయడం, పుస్తకం తిరగేయటం, వస్తువులను పట్టుకోవడం ... ఇలా చాలా పనులు కాళ్లతోనే చేయడం అలవాటుగా మారింది. చదువులో కూడా మంచి ప్రతిభ చూపించేవాడు. అతడి పట్టుదల, చురుకుదనం చూసి, ఇంటా బయటా అందరూ మెచ్చుకునేవాళ్ళు.

తాన్‌సేన్ వయసు ఇప్పుడు 31. న్యాయవాది కావాలనే లక్ష్యంతో చెన్నైలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రభుత్వ న్యాయ కళాశాలలో మాస్టర్స్ డిగ్రీ చదువుతున్నాడు. తనకు డ్రైవింగ్ అంటే చాలా ఇష్టం. తన అవసరాలకు అనుగుణంగా కారులోని డ్రైవింగ్ ఆప్షన్లు మార్పించుకొని, సాధన చేశాడు. కొద్దికాలంలో మంచి ప్రావీణ్యంతో కారు నడపటం వచ్చేసింది. అతడు కారు నడుపుతానంటే అదెలా సాధ్యం అని అడిగిన వాళ్లే ఇప్పుడు అతడి వైపు ఆశ్చర్యంగా చూస్తున్నారు. కారు నడపటం వస్తే సరిపోదు. రోడ్డు మీద అధికారులు అభ్యంతర పెట్టకుండా సాగాలంటే తాన్‌సేన్‌కి డ్రైవింగ్ లైసెన్సు కావాలి. మొదట్లో అధికారులను అడిగితే 'అదెలా సాధ్యం? ఇవ్వడం కుదరదు' అన్నట్టు మాట్లాడారు. తరువాత తాన్‌సేన్‌కి పత్రికలో వచ్చిన ఒక వార్త బలాన్నిచ్చింది. తమ పక్క రాష్ట్రం కేరళలో చేతులు లేని ఒక మహిళ కారు నడుపుతున్న ఫొటో, వార్త పత్రికల్లో వచ్చింది. ఆ వార్తను తీసుకెళ్లి రవాణా శాఖ అధికారులకు చూపించాడు. "కేరళలో సాధ్యమైంది, ఇక్కడ ఎందుకు సాధ్యం కాద"ని ప్రశ్నించాడు. "సరే .. అయితే.. వైద్యుల దగ్గర నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్టు తీసుకొని రా.." అని అధికారులు పంపించారు.

చెన్నై కెకె నగర్‌లోని ప్రభుత్వ హాస్పటల్‌కెళ్లి, తన అవసరం గురించి చెప్పి, ఆ పత్రికలోని వార్త వైద్యులకు చూపించాడు తాన్‌సేన్. డాక్టర్ పి తిరునావుక్కరసు, డాక్టర్ ఎ.రాజకుమార్, డాక్టర్ క్రిస్ చిత్తరసు నేతృత్వంలోని వైద్యుల బృందం తాన్‌సేన్‌ని, అతడి డ్రైవింగ్ నైపుణ్యాన్ని స్వయంగా పరిశీలించింది. ఫిట్‌నెస్ సర్టిఫికేట్ ఇచ్చారు. "మొదట మేం అతడు శారీరకంగా ఫిట్‌గా ఉన్నాడా? కారును ఆపరేట్ చేయగలడా? అని చూశాం. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు అతని సామర్థ్యాన్ని అంచనా వేశాం. వెంటనే బ్రేకులు వేయగలడా అని తనిఖీ చేశాం. తాన్‌సేన్ అన్ని పనులూ తన కాళ్లతోనే చక్కగా చేయగలిగాడు." అని డాక్టర్ తిరునావుక్కరసు అన్నారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందిన తాన్‌సేన్ ఆర్టీవో అధికారుల సమక్షంలో కూడా కారు నడిపాడు. మోటారు వాహన చట్టం నిబంధనల ప్రకారమే పిడబ్ల్యుడి డ్రైవింగ్ లైసెన్స్‌ను ఆర్టీవో మంజూరు చేశారు. దానిని అందుకొని తాన్‌సేన్ చాలా సంతోషపడ్డాడు.

తరువాత, తానే స్వయంగా కారు నడుపుతూ తన కుటుంబ సభ్యులను పెరంబదూరులోని ఓ దేవాలయానికి తీసుకెళ్లాడు. అతడు కారు నడపటాన్ని ఇప్పుడు చాలామంది ఆశ్చర్యంగా, ఆసక్తికరంగా తిలకిస్తున్నాడు. సెహబాస్ అంటూ కొంతమంది అతడిని కలిసి అభినందిస్తున్నారు.

"త్వరలో బైక్ కూడా నడుపుతాను. ఆ కోరిక కూడా తీర్చుకుంటాను." అని నవ్వుతూ అంటున్నాడు తాన్‌సేన్. అన్నాడూ అంటూ అతడు సాధిస్తాడు. ఎందుకంటే అతడిది కేవలం కోరిక కాదు; పట్టుదల, సాధన కలగలిసిన ఆచరణ. అలాంటి ఆచరణ ఉన్న వాళ్లు తప్పక సాధిస్తారు. విజయాన్ని తలకెత్తుకొని, దరహాసం చిందిస్తారు. తాన్‌సేన్ విజయగాథే అందుకు సాక్ష్యం.

విజృంభించిన నరైన్

లక్నోపై 98పరుగుల తేడాతో కోల్‌కతా గెలుపు

లక్నో: కోల్‌కతా నైట్‌రైడర్స్ హ్యాట్రిక్ విజయాలతో దూసుకెళ్తోంది. లక్నో సూపర్ జెయింట్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా 98పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలోకి దూసుకెళ్లి ప్లే ఆఫ్స్ బెర్తుకు మరింత చేరువైంది. కోల్‌కతా నిర్దేశించిన 236పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో అర్షిన్ కులకర్ణి(9) వికెట్ కోల్పోయింది. దీంతో లక్నో 20 పరుగులకే తొలి వికెట్ కోల్పోయింది. కెప్టెన్ కేఎల్ రాహుల్(25), మార్కస్ స్టోయినిస్(36)లు ఆదుకోవడంతో లక్నో పవర్ ప్లేలో వికెట్ నష్టానికి 55 పరుగులు చేసింది. రస్సెల్ తన తొలి ఓవర్లోనే స్టోయినిస్‌ను ఔట్ చేసి లక్నోను మరింత ఒత్తిలోకి నెట్టాడు. 85కే నాలుగు వికెట్లు పడిన వేళ.. నికోలస్ పూరన్(10), కుర్రాడు ఆయుష్ బదోని(15)లు.. జట్టు స్కోర్ వంద దాటించారు. అయితే.. 101 రన్స్ వద్ద రస్సెల్ డేంజరస్ పూరన్‌ను డగౌట్‌కు పంపాడు. అంతే.. అక్కడితో లక్నో ఓటమి ఖారారైంది. చివర్లో అష్టన్ టర్నర్(16), కృనాల్ పాండ్యా(5) చక్రవర్తి, రానాలు కళ్లెం వేశారు. 16.1 ఓవర్‌లో రవి బిష్ణోయ్‌ను రానా ఎల్బీగా ఔట్ చేయడంతో కోల్‌కతా విజయం లాంఛనమైంది.

తొలుత కోల్‌కతా నైట్‌రైడర్స్ ఓపెనర్ సునీల్ నరైన్ ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. నరైన్ కేవలం 39బంతుల్లో 6ఫోర్లు, 7సిక్సర్ల సాయంతో 81పరుగులకు తోడు మరో ఓపెనర్ సాల్ట్(32; 14బంతుల్లో 5ఫోర్లు, సిక్సర్) ధనా ధన్ బ్యాటింగ్‌తో రాణించారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 235 పరుగుల భారీస్కోర్ చేసింది. సునీల్ నరైన్ అర్ధసెంచరీకి తోడు రమణ్‌దీప్(25) మెరుపులు మెరిపించడంతో పాటు రఘువంశీ(32), శ్రేయస్ అయ్యర్(23) తమవంతు సహకారం అందించారు. ఓపెనర్లు రాణించడంతో కోల్‌కతా కేవలం 4.2 ఓవర్లలోనే 61 పరుగులు చేసింది. రింకూ సింగ్ మరోసారి నిరాశపరిచాడు. 11 బంతుల్లో రెండు ఫోర్లతో కేవలం 16 పరుగులే చేసి ఔటయ్యాడు. కానీ.. చివర్లో రమణ్‌దీప్ లక్నో బౌలర్లకు మాత్రం చుక్కలు చూపించాడు. కేవలం ఆరు బంతుల్లో మూడు సిక్సర్లు, ఒక ఫోర్ సాయంతో 25 పరుగులు చేశాడు. దీంతో కోల్‌కతా జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 235పరుగులు చేసింది. లక్నో బౌలర్లు నవీన్-ఉల్-హక్‌కు మూడు, యశ్ ఠాకూర్, రవి బిష్ణోయ్, యుధ్‌వీర్‌లకు ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు...

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: సాల్ట్ (సి)రాహుల్ (బి)నవీన్-ఉల్-హక్ 32, నరైన్ (సి)పటీధర్ (బి)రవి బిష్ణోయ్ 81, రఘువంశీ (సి)రాహుల్ (బి)యుధ్‌వీర్ సింగ్ 32, రస్సెల్ (సి)గౌతమ్ (బి)నవీన్-ఉల్-హక్ 12, రింకు సింగ్ (సి)స్టాయినీస్ (బి)నవీన్-ఉల్-హక్ 16, శ్రేయస్ అయ్యర్ (సి)రాహుల్ (బి)యశ్ ఠాకూర్ 23, రమణ్‌దీప్ సింగ్ (నాటౌట్) 25, వెంకటేశ్ అయ్యర్ (నాటౌట్) 1, అదనం 13. (20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 235పరుగులు. **వికెట్ల పతనం:** 1/61, 2/140, 3/167, 4/171, 5/200, 6/224 **బౌలింగ్:** స్టాయినీస్ 2-0-29-0, మొహిసన్ ఖాన్ 2-0-28-0, నవీన్-ఉల్-హక్ 4-0-49-3, యశ్ ఠాకూర్ 4-0-46-1, కృనాల్ పాండ్య 2-0-26-0, రవి బిష్ణోయ్ 4-0-33-1, యుధ్‌వీర్ సింగ్ 2-0-24-1.

లక్నో ఇన్నింగ్స్: కెఎల్ రాహుల్ (సి)రమణ్‌దీప్ సింగ్ (బి)హర్షిత్ రాణా 25, కులకర్ణి (సి)రమణ్‌దీప్ సింగ్ (బి)స్టార్క్ 9, స్టాయినీస్ (సి)హర్షిత్ రాణా (బి)రస్సెల్ 36, దీపక్ హుడా (ఎల్‌బి)చక్రవర్తి 5, పూరణ్ (సి)సాల్ట్ (బి)రస్సెల్ 10, ఆయుష్ బడోని (సి)స్టార్క్ (బి)నరైన్ 15, టర్నర్ (సి అండ్ బి) చక్రవర్తి 16, కృనాల్ పాండ్య (సి)సాల్ట్ 9బి)హర్షిత్ రాణా 5, యుధ్‌వీర్ చాహక్ (సి)రస్సెల్ (బి)చక్రవర్తి 7, రవి బిష్ణోయ్ (ఎల్‌బి)హర్షిత్ రాణా 2, నవీన్-ఉల్-హక్ (నాటౌట్) 0, అదనం 7. (16.1ఓవర్లలో ఆలౌట్) 137పరుగులు. **వికెట్ల పతనం:** 1/20, 2/70, 3/77, 4/85, 5/101, 6/109, 7/125, 8/129, 9/137, 10/137 **బౌలింగ్:** వైభవ్ అరోరా 2-0-21-0, స్టార్క్ 2-0-22-1, నరైన్ 4-0-22-1, నిహర్షిత్ రాణా 3.1-0-24-3, వరణ్ చక్రవర్తి 3-0-30-3, రస్సెల్ 2-0-17-2.

మహిళల టి20 ప్రపంచ కప్ షెడ్యూల్ విడుదల

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) మహిళల టి20 ప్రపంచకప్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ ఏడాది అక్టోబర్ 3 నుంచి ప్రారంభమయ్యే ఈ టోర్నీలో ఫైనల్‌తో కలిపి మొత్తం 23 మ్యాచ్‌లు జరగనున్నాయి. బంగ్లాదేశ్ వేదికగా జరిగే ఈ టోర్నీలో మొత్తం 10జట్లు తలపడనున్నాయి. 10జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. లీగ్ దశలో ఒక్కో జట్టు నాలుగు మ్యాచ్‌లు ఆడుతుంది. గ్రూప్-ఏ, గ్రూప్-బి టాప్-2 నిలిచిన జట్లు సెమీఫైనల్‌లోకి ప్రవేశిస్తాయి. అక్టోబర్ 4న భారత మహిళల జట్టు తన తొలి లీగ్ మ్యాచ్‌ను న్యూజిలాండ్‌తో తలపడనుంది. అక్టోబర్ 6న పాకిస్థాన్‌తో భారత్ ఢీకొంటుంది. గతేడాది జరిగిన టి20 ప్రపంచకప్ ఫైనల్లో ఆస్ట్రేలియా దక్షిణాఫ్రికాను ఓడించి టైటిల్ కైవసం చేసుకుంది.

గ్రూప్ ఎ:
భారత్, న్యూజిలాండ్, పాకిస్థాన్, ఆస్ట్రేలియా (క్వాలిఫయర్ 1)

గ్రూప్ బి:
ఇంగ్లండ్, వెస్టిండీస్, బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా (క్వాలిఫయర్ 2)

భారత మహిళల షెడ్యూల్..
అక్టోబర్ 4: భారత్ × న్యూజిలాండ్, సిల్హెట్
అక్టోబర్ 6: భారత్ × పాకిస్థాన్, సిల్హెట్
అక్టోబర్ 9 : భారత్ × క్వాలిఫైయర్ 1, సిల్హెట్
అక్టోబర్ 13: భారత్ × ఆస్ట్రేలియా, సిల్హెట్
అక్టోబర్ 17 : తొలి సెమీఫైనల్, సిల్హెట్
అక్టోబర్ 18 : రెండో సెమీఫైనల్, ధాకా
అక్టోబర్ 20 : ఫైనల్, ధాకా

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	పా	నె.ర.
కోల్‌కతా	11	8	3	18	1.45
రాజస్తాన్	10	8	2	16	0.62
చెన్నై	11	6	5	12	0.70
లక్నో	11	6	5	12	0.37
సన్‌రైజర్స్	10	6	4	12	0.07
ఢిల్లీ క్యాపిటల్స్	11	5	6	10	-0.44
బెంగళూరు	11	4	7	8	-0.04
పంజాబ్‌కింగ్స్	11	4	7	8	-0.18
గుజరాత్	11	4	7	8	-1.32
ముంబయి	11	3	8	6	-0.35

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్‌రన్‌రేట్

జడేజా ఆల్‌రౌండ్ షో

బౌలింగ్‌లో మెరిసిన తుషార్, ఆర్ష్‌దీప్
పంజాబ్ కింగ్స్‌పై 28పరుగుల తేడాతో చెన్నై గెలుపు

చెన్నై సూపర్‌కింగ్స్ అదరహో. గత నాలుగు మ్యాచుల్లో మూడు పరాజయాలు చవిచూసిన సూపర్‌కింగ్స్ ధర్మశాలలో గెలుపు బాట పట్టింది. పంజాబ్ కింగ్స్‌ను చిత్తు చేసి ఏకపక్ష విజయం సాధించింది. 168 పరుగుల ఊరించే ఛేదనలో జడేజా, తుషార్, సిమ్రన్‌జిత్ మ్యాజిక్‌తో పంజాబ్ బ్యాటర్లు చేతులెత్తేశారు. చెన్నై సూపర్‌కింగ్స్ ఏదో విజయం ఖాతాలో వేసుకోగా.. పంజాబ్ కింగ్స్ ఏదో ఓటమిని మూటగట్టుకుంది.

ధర్మశాల : రవీంద్ర జడేజా (43; 26బంతుల్లో 3ఫోర్లు, 2సిక్సర్లు) ధనా ధన్ బ్యాటింగ్‌కి తోడు బౌలింగ్‌లో(3/20) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో మాయజాలం చేశాడు. జడేజా మ్యాజిక్‌తో పంజాబ్ కింగ్స్ చేతిలో వరుస ఐదు ఓటములకు చెన్నై సూపర్‌కింగ్స్ చెక్ పెట్టింది. ధర్మశాలలో పంజాబ్ కింగ్స్‌ను చిత్తు చేసిన సూపర్‌కింగ్స్ 28 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో టాప్-3లోకి చెన్నై ఎగబాకింది. 168 పరుగుల ఛేదనలో పంజాబ్ కింగ్స్ చతికిల పడింది. ఓపెనర్ ప్రభుసిమ్రన్ సింగ్(30; 23బంతుల్లో 2ఫోర్లు, 2సిక్సర్లు), శశాంక్ సింగ్ (27; 20బంతుల్లో 4ఫోర్లు) మినహా మిగిలిన బ్యాటర్లందరూ విఫలమయ్యారు. జానీ బెయిర్‌స్టో(7), రూసో(0), కరన్(7), జితేశ్(0), ఆషుతోశ్(3) విఫలమయ్యారు. చెన్నై బౌలర్లు జడేజా, తుషార్ (2/35), సిమ్రన్‌జిత్ సింగ్(2/16) బౌలింగ్‌లో మెరిసారు. అంతకు ముందు తొలిగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై జట్టులో రవీంద్ర జడేజాకు తోడు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (32; 21బంతుల్లో 4ఫోర్లు, సిక్సర్), మిచెల్ (30; 19బంతుల్లో 2ఫోర్లు, సిక్సర్) బ్యాటింగ్‌లో రాణించారు. ఎం.ఎస్ ధోని (0) గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. దీంతో చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 167పరుగులు చేసింది. పంజాబ్ బౌలర్లలో హర్షల్ పటేల్ (3/24), రాహుల్ చాహర్ (3/23), ఆర్ష్‌దీప్ సింగ్ (2/42) రాణించారు.

జడేజా షో : టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన సూపర్‌కింగ్స్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. అజింక్య రహానె (9) మరోసారి నిరాశపరిచాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (32), డార్లీ మిచెల్ (30) రెండో వికెట్‌కు కీలక భాగస్వామ్యం నమోదు చేశారు. పంజాబ్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులేసినా క్రమం తప్పకుండా బౌండరీలు బాదారు. శివం దూబె (0), మొయిన్ అలీ (17) నిరాశపరచటంతో చెన్నై 101/5తో కష్టాల్లో కూరుకుంది. ఈ సమయంలో రవీంద్ర జడేజా (43) ఆదుకున్నాడు. మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో మెరిశాడు. మిచెల్ శాంట్నర్ (11), శార్దుల్ ఠాకూర్ (17) తోడుగా డెత్ ఓవర్లలో రాణించాడు. ఎం.ఎస్ ధోని (0) తొలి బంతికే నిష్క్రమించగా అభిమానులు నిరాశకు లోనయ్యారు. పంజాబ్ కింగ్స్ బౌలర్లు హర్షల్ పటేల్, రాహుల్ చాహర్, అర్ష్‌దీప్ సింగ్‌లు సూపర్‌కింగ్స్ బ్యాటర్లను సమర్థవంతంగా నిలువరించారు. చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 167 పరుగులే చేసింది.

స్కోర్‌బోర్డు...

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: రహానే (సి)రబడా (బి)ఆర్ష్‌దీప్ సింగ్ 9, గైక్వాడ్ (సి)జితేశ్ శర్మ (బి)రాహుల్ చాహర్ 32, మిచెల్ (ఎల్‌బి)హర్షల్ పటేల్ 30, శివమ్ దూబే (సి)జితేశ్ శర్మ (బి)రాహుల్ చాహర్ 0, మొయిన్ అలీ (సి)బెయిర్‌స్టో (బి)సామ్ కర్రన్ 17, జడేజా (సి)సామ్ కర్రన్ (బి)ఆర్ష్‌దీప్ సింగ్ 43, సాంట్నర్ (సి)సామ్ కర్రన్ (బి)రాహుల్ చాహర్ 11, శార్దుల్ ఠాకూర్ (బి)హర్షల్ పటేల్ 0, తుషార్ దేశ్‌పాండే (నాటౌట్) 0, రిచర్డు గ్లీసన్ (నాటౌట్) 2, దనం 6. (20ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 167పరుగులు.

వికెట్ల పతనం: 1/12, 2/69, 3/69, 4/75, 5/101, 6/122, 7/150, 8/150, 9/164

బౌలింగ్: రబడా 3-0-24-0, ఆర్ష్‌దీప్ సింగ్ 4-0-42-2, సామ్ కర్రన్ 4-0-34-1, హర్‌ప్రీత్ బ్రార్ 1-0-19-0, రాహుల్ చాహర్ 4-0-23-3, హర్షల్ పటేల్ 4-0-24-3

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ సింగ్ (సి)రిజ్వి (బి)జడేజా 30, బెయిర్‌స్టో (బి) దేశ్‌పాండే 7, రూసో (బి)దేశ్‌పాండే 0, శశాంక్ సింగ్ (సి)సిమ్రన్‌జీత్ సింగ్ (బి)సాంట్నర్ 27, సామ్ కర్రన్ (సి)సాంట్నర్ (బి)జడేజా 7, జితేశ్ శర్మ (సి)ధోని (బి)సిమ్రన్‌జిత్ సింగ్ 0, ఆషుతోశ్ శర్మ (సి)సిమ్రన్‌జీత్ (బి)జడేజా 3, హర్‌ప్రీత్ బ్రార్ (నాటౌట్) 17, హర్షల్ పటేల్ (సి)రిజ్వి (బి)సిమ్రన్‌జీత్ సింగ్ 12, రాహుల్ చాహర్ (బి)శార్దుల్ ఠాకుర్ 16, రబడా (నాటౌట్) 11, అదనం 9. (20ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 139పరుగులు. **వికెట్ల పతనం:** 1/9, 2/9, 3/62, 4/68, 5/69, 6/77, 7/78, 8/90, 9/117

బౌలింగ్: సాంట్నర్ 3-0-10-1, దేశ్‌పాండే 4-0-35-2, గ్లీసన్ 4-0-41-0, జడేజా 4-0-20-3, సిమ్రన్‌జీత్ సింగ్ 3-0-16-2, శార్దుల్ ఠాకూర్ 2-0-12-1.

ప్లే ఆఫ్స్‌పై రైజర్స్ గురి

నేడు ముంబయి ఇండియన్స్‌తో ఢీ

ముంబయి : ఐపీఎల్ 17వ సీజన్లో అసమాన బ్యాటింగ్ విన్యాసాలతో ఆల్‌టైమ్ రికార్డులు బద్దలు కొడుతున్న జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్. పవర్‌ప్లేలో ఊహకందని విధ్వంసం సృష్టిస్తున్న సన్‌రైజర్స్ లక్ష్య ఛేదనలో ఒడిదొడుకులు ఎదుర్కొంటుంది. ప్లే ఆఫ్స్ రేసు రసవత్తరంగా మారటం.. లీగ్ దశలో మరో నాలుగు మ్యాచులే ఆడాల్సి ఉండటంతో బెర్త్ ఖాయం చేసుకునేందుకు హైదరాబాద్ తహతహ లాడుతోంది. కెప్టెన్ పాట్ కమిన్స్‌కు తోడు స్వింగ్‌స్టర్ భువనేశ్వర్ కుమార్, యార్కర్ల హీరో టి. నటరాజన్ సైతం ఫామ్‌లోకి వచ్చారు. సన్‌రైజర్స్ చవిచూసిన బౌలింగ్ కష్టాలు తీరినట్టే కనిపిస్తుంది. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్, నితీశ్ కుమార్ రెడ్డిలు అంచనాలు అందుకుంటే నేడు వాంఖడేలోనూ పరుగుల వరద పారటం ఖాయమే. ఏడో విజయంపై కన్నేసి హైదరాబాద్ బరిలోకి దిగుతుండగా.. తొమ్మిదో పరాజయం నుంచి తప్పించుకునేందుకు ముంబయి ఇండియన్స్ ఆశపడుతుంది. మ్యాచ్ విన్నర్లతో కూడిన ముంబయి ఇండియన్స్ కొత్త కెప్టెన్ హార్దిక్ పాండ్య సారథ్యంలో ఆశించిన ఫలితాలు రాబట్టలేదు. కీలక బ్యాటర్లు ఎవరూ సరైన సమయంలో రాణించలేదు. 11 మ్యాచుల్లో 8 పరాజయాలు చవిచూసిన ముంబయి ఇండియన్స్ పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచింది. చివరి మూడు మ్యాచుల్లోనైనా మెరిసి పాయింట్ల పట్టికలో స్థానం మెరుగు పర్చుకునేందుకు హార్దిక్‌సేన ఎదురుచూస్తుంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68

ఇదేమి నిష్పాక్షికత?

- ఇసి తీరుపై ప్రశ్నలు, సందేహాలు
- సిఎంలనూ అరెస్ట్ చేస్తున్నారు
- మతం పేరుతో ఓట్లను దండుకోవాలని చూస్తున్నారు
- ప్రధాని, మంత్రులు కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు
- సూరత్‌లో బలవంతంగా 'ఏకగ్రీవం' చేయించారు

న్యూఢిల్లీ : ఎన్నికల కమిషన్‌పై ప్రజలు, రాజకీయ పార్టీలకు విశ్వాసం రానురానూ సడలిపోతోంది. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలోనే దాని విశ్వసనీయత, స్వతంత్రతను పలువురు ప్రశ్నించారు. అప్పట్లో లోక్‌సభ ఎన్నికలు ముగిసిన వెంటనే 64 మంది ప్రభుత్వ మాజీ ఉన్నతోద్యోగులు, సాయుధ దళాలకు చెందిన 83 మంది మాజీ అధికారులు కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఉద్దేశిస్తూ ఘాటుగా ఓ లేఖ రాశారు. 2019 లోక్‌సభ ఎన్నికల నిర్వహణను వారు తప్పు పట్టారు. అవి స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగలేదని, గత మూడు దశాబ్దాలలో ఇంత దారుణమైన పరిస్థితిని ఎన్నడూ చూడలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ ఇసి పనితీరులో ఏ మాత్రం మార్పు రాలేదు. ఈసారి కూడా పక్షపాతపూరితంగా వ్యవహరిస్తూ ఎన్నికల ప్రక్రియను ఓ ఫార్సుగా మార్చేసేందుకు కంకణం కట్టుకుంది. గత నెల 11న ప్రభుత్వ మాజీ ఉన్నతోద్యోగులు ఇసికి ఓ లేఖ రాశారు. ఎన్నికల నిర్వహణపై ప్రజలు, రాజకీయ పార్టీల మనసులో ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు ఇసి చేస్తున్నది ఏమీ లేదని మండిపడ్డారు. ఇవిఎంల పనితీరు, వివి ప్యాట్ల లెక్కింపుపై ప్రజలు అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదని తెలిపారు. అధికార పక్షం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తుంటే ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇటీవలి కాలంలో ఇసి చర్యలు వింతగా ఉన్నాయని వ్యాఖ్యానించారు.

పర్యవేక్షణకు స్వతంత్ర కమిటీ

ఎవరెన్ని లేఖలు రాసినా, అభ్యర్థనలు పంపినా ఎన్నికల సంఘం దున్నపోతు మీద వాన పడినట్లే వ్యవహరిస్తోంది. అబద్దాలను పదేపదే వల్లె వేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోంది. ఈ నేపథ్యంలో పౌర సమాజ గ్రూపులు ఒక్కటై ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణకు ఓ స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేశాయి. మార్చి 15న ప్రారంభమైన ఈ కమిటీ స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, కోడ్ ఉల్లంఘనలపై ఇసికి ఎప్పటికప్పుడు నివేదికలు, వారానికి ఒక బులెటిన్ పంపుతోంది. వాటిలోని కొన్ని ముఖ్యాంశాలు....

అరెస్టులతో సమానావకాశాలు ఎలా?

ఎన్నికల షెడ్యూలు ప్రకటనకు కేవలం ఒక రోజు ముందు ఇద్దరు ఎన్నికల కమిషనర్లను తొందరపాటుతో, నర్మగర్భంగా పక్షపాతపూరితంగా నియమించారు. ఏడు దశల సుదీర్ఘ ఎన్నికల ప్రక్రియ అధికార పార్టీకి, దాని స్టార్ క్యాంపెయినర్లు... ముఖ్యంగా ప్రధాని మోడీకి ప్రయోజనం చేకూర్చేలా ఉంది. ఎన్నికల సమయంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం అనేక అనుమానాలు రేకెత్తిస్తోంది. ప్రతిపక్షానికే చెందిన జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్‌ను అరెస్ట్ చేసిన వెంటనే కేజ్రీవాల్‌ను కూడా అరెస్ట్ చేయడం జరిగింది. అలాంటప్పుడు ఎన్నికల ప్రక్రియలో అందరికీ సమానావకాశాలు ఎలా లభిస్తాయి?

మతం పేరుతో ఓట్ల అభ్యర్థన

స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలపై ప్రభావం పడేలా ప్రధాన స్రవంతి మీడియాలో పక్షపాతపూరితమైన, సమతూకంగా లేని వార్తలు వస్తున్నాయి. ఓటర్ల జాబితా నుండి ఓ పద్ధతి ప్రకారం ముస్లింలు, దళితులు, ఇతర అణగారిన వర్గాల వారిని తొలగించారు. ఎన్నికల సీజన్‌లో కాంగ్రెస్ పార్టీ బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేశారు. వామపక్షాలకు ఆదాయపన్ను నోటీసులు ఇచ్చారు. అధికార బిజెపి నేతలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి మతాలను అభ్యర్థిస్తూ ప్రకటనలు ఇస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఓట్లను అభ్యర్థిస్తూ అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ట, రామనవమిని ప్రస్తావిస్తున్నారు.బిజెపి మంత్రులు తమ ఎన్నికల సందేశాలలో సైనిక చిహ్నాలను దుర్వినియోగం చేశారు. మోడీ సైనిక యూనిఫారంలో ఉన్న వీడియోలను పోస్ట్ చేశారు. బిజెపి సీనియర్ నాయకులు మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొడుతుంటే ప్రభుత్వం ఓ పద్ధతి ప్రకారం స్వతంత్ర మీడియాను లక్ష్యంగా చేసుకుంటోంది. ప్రధాని మోడీ తన ఎన్నికల ప్రచారంలో పలు సందర్భాలలో మతపరమైన ప్రస్తావనలు తీసుకొస్తున్నారు. పౌర సమాజం పలు సందర్భాల్లో అనేక ప్రశ్నలు లేవనెత్తుతూ, అందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ ఇసి మాత్రం ఇవిఎంల భద్రత, పనితీరుపై ఒక్క ప్రశ్నకూ సమాధానం ఇవ్వలేదు. దీనిపై కేంద్ర సమాచార కమిషన్ కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.

ఇంత దారుణమా?

ఎన్నికల తరుణంలో కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రతిపక్ష నేతలకు నోటీసులు జారీ చేస్తున్నప్పటికీ ఇసి వాటిని పరిగణనలోకి తీసుకోలేదు. ప్రధాని మోడీ ఏప్రిల్ 21న తన ఎన్నికల ప్రచారంలో ముస్లింలను కించపరిచేలా ప్రసంగించారు. అయినా ఇసిలో కదలిక లేదు. ప్రధాని పేరును ప్రస్తావించకుండా బిజెపికి నోటీసు ఇచ్చి చేతులు దులుపుకుంది. ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వ అధికారులే ఓటర్లను పోలింగ్ కేంద్రాల వద్ద అడ్డుకున్నారు. పోలింగ్ కేంద్రాలను స్వాధీనం చేసుకున్నారన్న ఆరోపణలు కూడా వచ్చాయి. ఎన్నికల ప్రక్రియనే అపహాస్యం చేస్తూ సూరత్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించి, స్వతంత్ర అభ్యర్థులతో బలవంతంగా ఉపసంహరింపజేసి బిజెపి అభ్యర్థి విజయం సాధించినట్లు ప్రకటించారు. ఇండోర్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన వ్యక్తి తన నామినేషన్‌ను ఉపసంహరించుకొని బిజెపిలో చేరిపోయారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి బిజెపి నాయకుల విషయంలో చూసీచూడనట్లు వ్యవహరిస్తూ ప్రతిపక్ష నేతలకు మాత్రం నోటీసులు జారీ చేస్తోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా తొలి దశ పోలింగ్ జరిగిన 11 రోజుల తర్వాత ఓటింగ్ శాతాన్ని వెల్లడించింది.

బాహాటంగానే ముస్లింలపై విద్వేషం

బిజెపి కార్టూన్ వీడియోపై ఎన్నికల కమిషన్ మౌనం

న్యూఢిల్లీ : ముస్లిములపై విద్వేషం వెళ్లగక్కుతూ కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీ, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కేరికేచర్లతో కర్ణాటక బిజెపి శనివారం ఎక్స్‌లో వీడియో పోస్ట్ చేసి 24గంటలు గడిచినా ఎన్నికల కమిషన్ దీనిపై ఇంతవరకు ఎలాంటి చర్య తీసుకోలేదు.

ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బిజెపి బాహాటంగానే మతోన్మాద ప్రచారాన్ని కొనసాగిస్తోంది. కన్నడలో "బీవేర్, బీవేర్, బీవేర్" అనే శీర్షికతో ఒక కార్టూన్ వీడియోను బిజెపి విడుదల చేసింది. అందులో ఒక గూట్లో మూడు గుడ్లు వున్నాయి. వాటిపై ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి అని వున్నాయి. రాహుల్‌గాంధీ ముస్లిం అని వున్న పెద్ద గుడ్డు తీసుకొచ్చి ఆ గూట్లో వేశారు. ఆ తర్వాత ఆ ముస్లిం గుడ్డు పొదగబడి నెత్తిపై టోపీ ధరించిన పెద్ద కోడిపిల్లగా మారుతుంది. మిగతా గుడ్ల నుంచి చిన్న పిల్లలు వస్తాయి. 'నిధులు' అని రాసి వున్న బాక్స్ నుండి ఆహారాన్ని తీసి ముస్లిం అని వున్న కోడి పిల్లకు పెడతారు.

అది మరింత పెద్దగా అవుతుంది. వెంటనే ఎస్‌సి,ఎస్‌టి, ఒబిసి అని రాసిన మూడు గుడ్లను అవతలకు విసిరేస్తుంది. దీన్ని చూసి గాంధీ, సిద్ధరామయ్యలు నవ్వుతున్నట్లు వ్యంగ్య చిత్రాలు ఆ వీడియోలో కనిపిస్తున్నాయి. ఈ వీడియోకు సంబంధించి ది వైర్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది.

ఆదివారం కాంగ్రెస్ కూడా ఇసికి ఫిర్యాదు చేసింది. బిజెపి అధ్యక్షుడు జె.పి.నడ్డా, ఐటి సెల్ ఇన్‌చార్జి అమిత్ మాలవీయ, రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర, సోషల్ మీడియా కర్ణాటక బిజెపి ఇన్‌చార్జిలపై కెపిసిసి మీడియా, కమ్యూనికేషన్ ఛైర్మన్ రమేష్ బాబు ఫిర్యాదు చేశారు. భిన్న మతాల మధ్య అల్లర్లను, శత్రుత్వాన్ని రెచ్చగొట్టడానికే ఉద్దేశపూర్వకంగా నిందితుడు ఈ చర్యకు పాల్పడ్డాడని సృష్టంగా అర్థమవుతోందని ఆ ఫిర్యాదులో రమేష్ బాబు పేర్కొన్నారు. దీనిపై తక్షణమే తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని ఆయన పేర్కొన్నారు. మతాన్ని ఎన్నికల ప్రచారంలో ఉపయోగిస్తున్నా, వాటిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నా, ఇసి ఇంతవరకు స్పందించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని అన్నారు. బిజెపి ప్రచారంలో పెట్టిన ఈ తప్పుడు సమాచారంపై ఇన్‌స్టాగ్రామ్ యూజర్లు కూడా ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులైనవారిపై చర్య తీసుకోవాలని కోరారు.

క్రిమినల్ కేసుల్లో విచారణ

స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరగడం లేదు

- ప్రజల్లో నెలకొన్న ఈ భావనను తొలగించాలి
- పబ్లిక్ ప్రాసిక్యూటర్లు టేప్ రికార్డర్లుగా వ్యవహరించొద్దు
- సిజెఐ చంద్రచూడ్ హితవు

న్యూఢిల్లీ: క్రిమినల్ కేసుల్లో విచారణ 'స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా' జరగడం లేదనే భావన ప్రజల్లో ఎక్కువగా ఉందని, దీనిని తొలగించాల్సిన అవసరముందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది.. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు టేప్ రికార్డర్లలా వ్యవహరించరాదని ధర్మాసనం హితవు పలికింది. స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా విచారణ నేర న్యాయ శాస్త్రానికి పునాది అని పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రాసిక్యూటర్ సాక్షులను విచారించేటప్పుడు వ్యవహరించిన తీరు వారు విరోధిగా మారేలా ఉందని, ఇది సరికాదని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్లను "ట్రయల్ ప్రొసీడింగ్స్‌లో న్యాయమూర్తుల సహచరుల్లాంటివారని అభివర్ణించిన జస్టిస్ పార్దివాలా, " వీరి నియామకం" వంటి వాటిలో రాజకీయ పరిశీలనకు సంబంధించిన అంశాలు ఉండకూడదని కోర్టు తన తీర్పుల ద్వారా పదే పదే చెబుతోంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించేటప్పుడు వ్యక్తి యొక్క యోగ్యతను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలి. ఆ వ్యక్తి సమర్థుడైనంత మాత్రాన చాలదు, నిష్కళంకమైన పాత్ర, చిత్తశుద్ధి కలిగిన వ్యక్తిగా కూడా ఉండాలి అని ధర్మాసనం తరపున తీర్పు రాస్తూ జస్టిస్ పార్థివాలా అన్నారు. అతను ఎటువంటి పరిమితులు, ఆదేశాలు లేకుండా స్వతంత్రంగా పని చేయగల వ్యక్తి అయి ఉండాలి. పబ్లిక్ ప్రాసిక్యూషన్ సర్వీస్, న్యాయవ్యవస్థ మధ్య సంబంధం నేర న్యాయ వ్యవస్థకు మూలస్తంభం వంటిదని అన్నారు.

పిఓకెపై హక్కును వదులుకోం

- రాజ్‌నాథ్ సింగ్

న్యూఢిల్లీ : పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ (పిఒకె)పై తన హక్కును భారత్ ఎన్నటికీ వదులుకోదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. దాన్ని బలవంతంగా స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం లేదని, కాశ్మీర్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూసిన తర్వాత పిఒకె ప్రజలే భారత్‌లో భాగం కావాలని కోరుకుంటారని ఆయన అభిప్రాయపడ్డారు. పిటిఐకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పై అభిప్రాయం వ్యక్తం చేశారు. జమ్ము కాశ్మీర్‌లో మౌలిక సదుపాయాల పరిస్థితి బాగా మెరుగుపడిందన్నారు. ఇక కేంద్ర పాలిత ప్రాంతంలో సాయుధ బలగాల ప్రత్యేక చట్టం – అఫ్సాను ఎంతోకాలం కొనసాగించాల్సిన అవసరం వుండబోదన్నారు. దీనిపై తగు సమయంలో తగు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. కాశ్మీర్‌లో కూడా కచ్చితంగా ఎన్నికలు జరుగుతాయని, దానికి ఒక కాల పరిమితి వుందని అన్నారు.

చర్చలకు నెతన్యాహునే అడ్డంకి

- హమాస్ విమర్శ
- అల్‌జజీరా కార్యాలయాల మూసివేత

జెరూసలెం/గాజా : కాల్పుల విరమణపై ఒప్పందం కోసం జరుగుతున్న యత్నాలను నెతన్యాహు ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటున్నారని హమాస్ విమర్శించింది. గాజాలో ఇజ్రాయిల్ ఆక్రమణకు స్వస్తి పలికేలా సమగ్ర కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవాలని హమాస్ నిజాయితీగా కృషి చేస్తోందని, హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనీయే చెప్పారు. కైరోలో ఇరు పక్షాల మధ్య చర్చలు పునరుద్ధరించాల్సి వుంది, అందుకోసం ప్రతినిధి బృందాన్ని పంపించాల్సి వుంది. రఫా నగరంపై మిలటరీ దాడిని ఇజ్రాయిల్ ప్రారంభించదని అమెరికా గ్యారంటీ ఇవ్వాలని హమాస్ కోరుతోంది. ఒప్పందం కుదురుతుందా లేదా అన్నదానితో సంబంధం లేకుండా దాడి జరిగి తీరుతుందని నెతన్యాహు చెబుతున్నారు. కాల్పుల విరమణకు నెతన్యాహు అంగీకరించాలని, ఒప్పందంలో భాగంగా గాజాలోని బందీలను విడిపించాలని ఇజ్రాయిల్‌లో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనకారులు కోరుతున్నారు. బందీలను విడుదల చేయాలంటే గాజాలో యుద్ధానికి ఇక స్వస్తి పలకాలని హమాస్ చేస్తున్న డిమాండ్‌ను నెతన్యాహు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

అల్‌జజీరా కార్యాలయాల మూసివేతకు ఆదేశం

ఇదిలావుండగా, ఇజ్రాయిల్‌లో అల్ జజీరా కార్యాలయాలన్నింటినీ మూసివేయాలని నెతన్యాహు ప్రభుత్వం ఆదేశించంది. ఇది తక్షణమే అమలులోకి వస్తుందని ఇజ్రాయిల్ కమ్యూనికేషన్స్ మంత్రి చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. అరబిక్, ఇంగ్లీషు భాషలకు సంబంధించి రెండు కార్యాలయాలను మూసివేస్తారు. టెలిఫోన్లు, కంప్యూటర్లు మినహా మిగిలిన పరికరాలన్నింటినీ జప్తు చేస్తారు. దీనివల్ల చర్చలు ఇబ్బందుల్లో పడతాయని నేషనల్ యూనిటీ పార్టీ వ్యాఖ్యానించింది. అక్టోబరు 7నుండి ఇప్పటివరకు అల్‌జజీరా జర్నలిస్టులపై 50కి పైగా దాడులు జరిగాయి. ఈ దాడుల్లో జర్నలిస్టులు తమ కుటుంబాలకు కుటుంబాలనే పోగొట్టుకున్నారని జెరూసలేంలో అల్‌జజీరా బ్యూరో చీఫ్ వాలిద్ ఒమరీ చెప్పారు. కాగా అల్‌జజీరా కార్యాలయాలను మూసివేస్తామనడం ఇజ్రాయిల్ ప్రభుత్వం నిరాశా నిస్పృహలతో తీసుకున్న నిర్ణయమని గాజాలోని పాలస్తీనియన్లు వ్యాఖ్యానించారు.

మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచేందుకు రేవణ్ణను తీసుకొచ్చిన సిట్ అధికారులు

సిట్ కస్టడీకి హెచ్.డి.రేవణ్ణ

బెంగళూరు : హసన్‌లో మహిళలపై అఘాయిత్యాలకు సంబంధించిన దర్యాప్తు కోసం జెడి(ఎస్) నేత, మాజీమంత్రి హెచ్‌డి రేవణ్ణను మూడు రోజుల పాటు సిట్ కస్టడీకి పంపారు. శనివారం సాయంత్రం ఆయనను సిట్ అధికారులు అరెస్టు చేశారు. ఆదివారం సాయంత్రం కోరమంగళలోని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. అంతకుముందు ఆయనకు బౌరింగ్ అండ్ లేడీ కర్జన్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈనెల 8 వరకు దర్యాప్తు బృందం కస్టడీలో వుంటారు. మైసూరులో పనిమనిషి కిడ్నాపింగ్ కేసులో ఆయనను అరెస్టుచేశారు.

కవిత బెయిల్ పిటిషన్‌పై నేడు తీర్పు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ కేసులో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై సోమవారం రౌస్ ఎవెన్యూ కోర్టు తీర్పును వెలువరించనుంది. లిక్కర్ కేసులో సిబిఐ, ఇడి దర్యాప్తు సంస్థలు తనను అక్రమంగా అరెస్టు చేశాయని, తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కవిత వేర్వేరుగా బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ఇటీవల వాదనలు ముగించిన ట్రయల్ కోర్టు తీర్పును వాయిదా వేసింది. సోమవారం ఉదయం పది గంటలకు స్పెషల్ జడ్జి కావేరి బవేజా ఇడి, సిబిఐ కేసుల్లో కవిత బెయిల్ పిటిషన్లపై తీర్పును చదివి వినిపించనున్నారు. లిక్కర్ కేసు వ్యవహారంలో ఈ ఏడాది మార్చి 15న ఇడి, ఏప్రిల్ 11న సిబిఐ కవితను అరెస్ట్ చేశాయి. అనంతరం ఆమెకు ట్రయల్ కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ప్రస్తుతం జైళ్లో ఉన్న తనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలని కవిత రౌస్ ఎవెన్యూ కోర్టును ఆశ్రయించారు.

రేపు కోర్టు ముందుకు కవిత..!

మరోవైపు కవితకు కోర్టు విధించిన జ్యుడీషియల్ కస్టడీ ఈ నెల 7తో ముగియనుంది. దీంతో గత ఆదేశాల మేరకు ఆమెను మంగళవారం ఉదయం కోర్టులో ప్రవేశపెట్టాల్సి ఉంది. సోమవారం వెలువరించే తీర్పులో కవితకు బెయిల్ దక్కితే, జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు ఉండదు.

వియత్నాం యుద్ధాన్ని స్మరించుకుంటూ

అమెరికా విద్యార్థుల నిరసన

గాజాకు సంఘీభావంగా 'శాంతి కోసం యూదు గళం' ఆధ్వర్యాన పలు యూదు విద్యార్థులు, మేధావులు న్యూయార్క్‌లోని అతి పెద్ద ఆర్ట్ మ్యూజియం ఎదుట బైఠాయించిన దృశ్యం. గాజాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమానికి బైడెన్ ప్రభుత్వం మద్దతు కొనసాగించడాన్ని వారు తీవ్రంగా నిరసించారు.

న్యూయార్క్ : గత ఆరు నెలలుగా అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ సాగిస్తున్న క్రూరత్వం, గాజాలో అమాయక ప్రజలపై సాగుతున్న ఊచకోతలకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన నిరసనలు అమెరికన్ క్యాంపస్‌లతో బాటు , ఇతర దేశాల విశ్వవిద్యాలయాలకు వేగంగా విస్తరిస్తున్నాయి. వియత్నాంపై అమెరికా యుద్ధానికి వ్యతిరేకంగా ఆనాడు యూనివర్సిటీ క్యాంపస్‌లు నిరసనలతో హోరెత్తాయి. మళ్లీ అటువంటి దృశ్యాలు ఇప్పుడు అమెరికా క్యాంపస్‌లంతటా కనిపిస్తున్నాయి. అమెరికన్ విద్యార్థులు రగిలించిన పోరాట స్ఫూర్తితో కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్‌లోని యూనివర్శిటీ విద్యార్థులు కూడా టెంట్‌లు వేసి, పోస్టర్లతో నిరసనకు దిగారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దురాక్రమణ, ఊచకోతను వెంటనే ఆపాలని, ఇజ్రాయిల్‌కు ఆయుధాలు సప్లయి చేస్తున్న కంపెనీల పరిశోధనలకు యూనివర్సిటీ నిధుల మళ్లింపును నిలిపివేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ యుద్ధ వ్యతిరేక, ఊచకోత వ్యతిరేక నిరసనల్లో ప్రతిచోటా, క్రైస్తవులు, ముస్లింలు, బౌద్ధులు, హిందువులు, అలాగే అరబ్ ప్రపంచం, దక్షిణాసియా, ఆగ్నేయాసియా, ఆఫ్రికా విద్యార్థులతో సహా విభిన్న జాతులు, మతాల విద్యార్థులు పాల్గొంటున్నారు. ఇజ్రాయిల్ విద్యార్థులు కూడా ఉన్నారు. గాజాలో ఇజ్రాయిల్ మారణహోమానికి తక్షణమే స్వస్తి పలకాలన్నది అన్ని చోట్లా విద్యార్థుల ప్రధాన డిమాండ్. యుద్ధం వద్దు . శాంతి కావాలని వారు నినదిస్తున్నారు. నాగరిక మానవీయ సమాజం కోసం విధ్వంసానికి వ్యతిరేకంగా, శిశు హత్యలకు వ్యతిరేకంగా వారు గళమెత్తుతున్నారు.

గత ఏడు నెలలుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న ఊచకోతలో 35వేల మంది అమాయక పాలస్తీనా పౌరులు చనిపోయారు. గాయపడిన వారి సంఖ్య కొన్ని లక్షలు. మతుల్లో 14 వేల మంది అన్నెంపున్నెం ఎరుగని పసిపిల్లలు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన చిన్నారులు 20 వేల మంది దాకా ఉన్నారు. ఆసుపత్రులు, విద్యా సంస్థలు , నివాసాలు బాంబు దాడుల్లో .పూర్తిగా నాశనమైపోయాయి. . లక్షలాది మంది నిరాశ్రయులైన పాలస్తీనా ప్రజలు తాత్కాలిక సహాయక శిబిరాల్లో ఆకలితో అలమటిస్తూ మృత్యువాత పడుతున్నారు. రఫాలోని ఈ సహాయక శిబిరాలను కూడా ఇజ్రాయిల్ పిశాచాలు వదలడం లేదు.భూతల దాడులకు నెతన్యాహు రంకెలేస్తున్నాడు. ఇంతటి భయంకరమైన నేరాలకు పాల్పడుతున్న ఇజ్రాయిల్‌ను అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ సహా పశ్చిమ దేశాలు నిస్సిగ్గుగా వెనకేసుకొస్తున్నాయి. ఐక్యరాజ్యసమితిలో ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా తీర్మానం వచ్చిన ప్రతిసారి అమెరికా దానిని అడ్డుకుంటూ వస్తోంది.

ఇజ్రాయెల్ ఊచకోతను వ్యతిరేకిస్తున్న టర్కీ ఆ దేశంతో వాణిజ్య సంబంధాలను తెగదెంపులు చేసుకుంది. కొలంబియా, బొలీవియా దేశాలు కూడా ఇజ్రాయిల్‌తో దౌత్య సంబంధాలను తెంచుకున్నాయి. అనేక ఇతర దేశాలు ఇజ్రాయెల్‌ను దూరంగా ఉంచాయి. భారత్ మాత్రం ఇప్పటికీ ఇజ్రాయిల్‌తో మిత్రత్వం నెరపుతూనే ఉంది. ఇజ్రాయిల్ దాష్టీకాలకు వ్యతిరేకంగా విద్యారులు సాగిస్తున్న పోరాటాన్ని అణిచివేసేందుకు పోలీసులు క్రూరమైన చర్యలకు పాల్పడుతున్నారు. ఇప్పటికే రెండు వేల మందికి పైగా విద్యార్థులను అరెస్టు చేశారు. అణచివేత తీవ్రతరమవుతున్నకొద్దీ, విద్యార్థుల నుంచి ప్రతిఘటన కూడా అంతకు రెట్టింపు స్థాయిలో ఎదురవుతోంది. ఇప్పుడు 33 యూనివర్సిటీ క్యాంపస్‌లు నిరసనలతో అట్టుడుకుతున్నాయి..విద్యార్థుల నిరసనకు ప్రొఫెసర్లు పూర్తి మద్దతు పలుకుతున్నారు. అమెరికాలో విద్యార్థులు ఇంత విస్తృతమైన నిరసనలకు దిగడం వియత్నాం యుద్ధం తరువాత ఇదే మొదటి సారి అని సీనియర్ ప్రొఫెసర్లు పేర్కొంటున్నారు.

రాయపడ్డ జవాన్ మృతి

- పూంచ్‌లో తనిఖీలు

ముమ్మరం

పూంచ్ : జమ్ముకాశ్మీర్‌లోని పూంచ్ జిల్లా షాసితార్ సమీపంలో వైమానిక దళ కాన్వాయ్‌పై ఉగ్రవాదుల ఆకస్మిక దాడిలో శనివారం గాయపడిన వైమానిక దళ సిబ్బంది ఒకరు చికిత్స పొందుతూ సైనిక ఆసుపత్రిలో మరణించారు. మరో నలుగురు చికిత్స పొందుతున్నారు. మరణించిన నేవీ అధికారిని కార్పోరల్ విక్కీ పహాడేగా గుర్తించారు. జమ్ము అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఆనంద్ జైన్, ఆర్మీ సీనియర్ అధికారులు, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు సూరంకోట్ ప్రాంతంలోని ఆకస్మిక దాడి స్థలాన్ని సందర్శించారు. ఉగ్రవాదుల ఆచూకీ కోసం ఆర్మీ హెలికాప్టర్‌తో వైమానిక నిఘా కూడా నిర్వహించిందని వారు తెలిపారు. ఉగ్రవాదుల ఆచూకీ కోసం షాసితార్, గుర్సాయ్, సనాయ్ మరియు షిందారా టాప్‌తో సహా అనేక ప్రాంతాల్లో ఆర్మీ, పోలీసులు సమన్వయంతో సంయుక్త ఆపరేషన్ కొనసాగిస్తున్నారని అధికారులు తెలిపారు. ఉగ్రవాదులతో సంబంధాలున్నాయేమో తెలుసుకునేందుకు పలువురిని అదుపులోకి తీసుకున్నట్లు పారా కమాండో బృందాలు తెలిపాయి.

ప్రజ్వల్ అఘాయిత్యాలపై మౌనమా?

- మోడీ, అమిత్ షాలపై ప్రియాంక గాంధీ విమర్శ

హుబ్బాళి : తమ మిత్రపక్షమైన జనతాదళ్(ఎస్)లో చోటు చేసుకుంటున్న పరిణామాల గురించి అస్సలేమీ తెలియనట్లే ప్రధాని మోడీ, అమిత్‌షా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ విమర్శించారు. కర్ణాటకలో ప్రజ్వల్ అఘాయిత్యాలకు సంబంధించి మిత్రపక్షం పాత్రపై వారు మౌనం పాటించడాన్ని ఆమె ప్రశ్నించారు. దావణగెరెలో ఎన్నికల సభలో మాట్లాడుతూ పందలాదిమంది మహిళలపై అత్యాచారాలు చేసిన ఆ వ్యక్తి కోసమే ప్రధాని మోడీ ప్రచారం చేశారని చెప్పారు. అన్ని విషయాలు వెలుగులోకి వచ్చిన తర్వాత దేశం నుండి తప్పించుకోవడానికి కూడా అనుమతించారని విమర్శించారు. అన్నీ తెలిసినా ఏమీ తెలియనట్లే వ్యవహరిస్తున్నారని అన్నారు.

మహిళలకు సాధికారత, మహిళలకు రక్షణ అంటూ మోడీ తన ప్రసంగాల్లో చాలా గొప్పలు చెబుతారని చెప్పారు. అమల్లోకి వచ్చేసరికి వారికి అన్యాయం జరుగుతున్నా పట్టించుకోవడం లేదని, కనీసం మాట్లాడను కూడా లేదని అన్నారు. అణచివేతకు గురైన వారికన్నా అణచివేతకు పాల్పడిన వారికే ఆయన అండగా వుంటున్నారని విమర్శించారు. పేదలకు ప్రయోజనం చేకూర్చే పథకాలను అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీలిస్తూ వుంటే ప్రధాని అకస్మాత్తుగా ఆర్థిక వ్యవస్థ పరిస్థితుల గురించి మాట్ల

బిజెపి ఓటమితోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

- మోడీ పాలనలో రాజ్యాంగ వ్యవస్థలు విధ్వంసం
- సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ.బేబి

ప్రజాశక్తి – అనంతపురం ప్రతినిధి

బిజెపి ఓటమితోనే దేశంలో ప్రజాస్వామ్యం పరిరక్షించబడుతుందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ.బేబీ అన్నారు. అనంతపురంలోని ఓ పంక్షన్ హాలులో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'ప్రజల అజెండాయే– ఎన్నికల అజెండా కావాలి' అన్న అంశంపై ప్రాంతీయ సభను ఆదివారం నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, ఆప్ పార్టీల నాయకులు పాల్గొన్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ.బేబీలు ముఖ్య అతిథులుగా హాజరై ఇండియా వేదిక నాయకులను ఈ సార్వత్రిక ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎంఎ.బేబీ మాట్లాడుతూ.. మోడీ పాలనలో రాజ్యాంగ వ్యవస్థలన్నీ ధ్వంసం అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. చివరకు ఎన్నికల సంఘాన్ని కూడా తమ చెప్పుచేతుల్లో పెట్టుకునే విధంగా నియామకంలో మార్పులు తీసుకొచ్చారని విమర్శించారు. నియామక ప్రక్రియలో గతంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉండేవారని గుర్తు చేశారు. ఇప్పుడు

సదస్సులో ప్రసంగిస్తున్న ఎంఎ.బేబి, వేదికపై ఇతర నాయకులు

ప్రధానమంత్రి, సీనియర్ కేంద్ర మంత్రి, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కలిసి నియమిస్తారన్నారు. ఇందులో మెజార్టీ సభ్యులు అధికారపార్టీకి సంబంధించిన వారే ఉండడంతో వారనుకున్న వారినే నియమిస్తారన్నారు. తద్వారా తమకు అనుకూలంగా ఉన్న వారినే ఎన్నికల కమిషన్‌గా నియమించుకుంటారన్నారు. ఇప్పుడు ఎన్నికల సంఘం నామమాత్రమే అవుతోందని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఇటీవల రాజస్థాన్ ఎన్నికల ప్రచారంలో మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా చర్యల్లేవని బేబీ విచారం వ్యక్తం చేశారు. ప్రసంగాలు చేసిన ప్రధానమంత్రిని కాదని, పార్టీ అధ్యక్షుడికి తాఖీదులిచ్చి వదిలేసిందని తెలిపారు. మీడియా మొదలుకుని అన్ని రాజ్యాంగ వ్యవస్థలనూ మోడీ తమ నియంత్రణలో పెట్టుకుంటున్నారన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి చేటు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితుల్లో బిజెపిని ఓడించడం ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టుకోవడం కోసమేనని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ టిడిపి, వైసిపిలు బిజెపికి అనుకూలంగా మారాయని విమర్శించారు. ఈ ఐదేళ్లు అధికారంలోనున్న వైసిపి మూడు రాజధానులంటూ ఒకటి కూడా లేకుండా చేసిందని విమర్శించారు. బిజెపికి అనుకూలంగానున్న ఈ రెండు పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా మాట్లాడుతూ.. మతత్వాన్ని రెచ్చగొట్టి బిజెపి మరోమారు అధికారంలోకి వచ్చేందుకు చూస్తోందన్నారు. ఎన్నికల ప్రచారాల్లోనూ మతాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు మోడీ చేస్తున్నారని గుర్తు చేశారు. అంతేకాకుండా బిజెపి పాలనలో పేదలను కొట్టి పెద్దలకు పంచిపెట్టారని విమర్శించారు. కార్పొరేట్ సంస్థలకు లక్షల కోట్లు దోచిపెట్టారని దుయ్యబట్టారు. మొదటి రెండు విడతల్లోనే జరిగిన ఎన్నికల తీరు చూస్తుంటే బిజెపికి ఓటమి తప్పదన్నది స్పష్టం అవుతోందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా వేదిక సభ్యులకు ఓటు వేసి ఈ ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ.. రాజ్యాంగం పరిరక్షించబడాలంటే ఇండియా వేదిక సభ్యులను గెలిపించుకోవాల్సిన అవసరముందని అన్నారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఈ పదేళ్ల మోడీ పాలనలో ఎక్కడలేని విధంగా నిరుద్యోగం పెరిగిందన్నారు. 65 శాతానికి నిరుద్యోగం చేరిందని చెప్పారు. పది పోస్టులకు లక్ష మంది పోటీ పడే పరిస్థితులు నెలకొన్నాయని వివరించారు. అధికారంలోకి రాకముందు ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలన్నది మరచిపోయారని పేర్కొన్నారు. మతాన్ని రెచ్చగొడ్డటం.. సంపదను కార్పొరేట్లకు పంచిపెట్టడానికే మోడీ పదేళ్ల పాలన సరిపోయిందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి వి.మల్లికార్జున, అనంతపురం అసెంబ్లీ సిపిఐ అభ్యర్థి జాఫర్, రాప్తాడు కాంగ్రెస్ అభ్యర్థి శంకర్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సావిత్రి, బాలరంగయ్య, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి సత్యసాయి జిల్లా సిపిఐ కార్యదర్శి వేమయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలపై బండరాయి.. ఢీకొన్న గూడ్స్ రైలు

ప్రజాశక్తి – అనంతగిరి
(అల్లూరి సీతారామరాజు జిల్లా)

కొత్తవలస – కిరండూల్ లైన్‌లో బొడ్డవర, శివలింగపురం మార్గమధ్యంలో పట్టాలపై పడిన బండరాయిని గూడ్స్ రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో రైలు పట్టాలు తప్పడం గానీ, పక్కకు ఒరగడం గానీ జరగకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. కిరండూల్ నుంచి ఐరన్ హోల్ లోడుతో విశాఖకు గూడ్స్ రైలు వస్తోంది. ఆదివారం తెల్లవారుజామున శివలింగపురం, బొడ్డవర 44వ మైలురాయి వద్ద అప్పటికే కొండమీద నుంచి బండరాయి పడింది. దీన్ని గమనించిన పైలట్ ఒక్కసారిగా ట్రైన్ బ్రేకులు వేశారు. దీంతో రైలు ముందు భాగం రాయిని ఢీకొట్టి అలానే ఆగిపోయింది. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు అటుగా రాకపోకలు సాగించే రైళ్లను నిలిపివేశారు. రాయిని పట్టాల మీద నుంచి తొలగించే పనులు చేపట్టారు. ఆ తరువాత రైళ్ల సేవలను పునరుద్ధరించారు. ఈ మార్గంలో నడిచే పాసింజర్ రైళ్ల ప్రయాణికులు తాజా ఘటనలో కొంత అసౌకర్యానికి గురయ్యారు.

కెకె లైన్‌లో బండరాయిని ఢీకొన్న గూడ్స్ రైలు

రాజ్యాంగ రక్షణకు ఇండియా వేదిక

- ఏలూరు రోడ్‌షోలో కె.రామకృష్ణ

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. ఇండియా వేదిక అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం జిల్లా కేంద్రమైన ఏలూరులోని పవర్‌పేట రైల్వే స్టేషన్ నుంచి ఆర్ఆర్‌పేట మీదుగా పత్తేబాద రైతుబజార్ వరకూ రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్కు సెంటర్‌లో రామకృష్ణ మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మత విశ్వాసాల పట్ల విద్వేషాలు రెచ్చగొడుతోందని విమర్శించారు. పదేళ్ల బిజెపి పాలనలో ప్రతిపక్షాలు, మేధావులు, ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించారని విమర్శించారు. బిజెపి మతతత్వ పాలనతో ప్రజాస్వామ్యానికి పెనుప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. మళ్లీ అధికారం కోసం బిజెపి కుట్రలు చేస్తోందని, తనకు అనుకూలంగా లేని పార్టీలపై ఇడితో దాడులు చేయించి అక్రమ అరెస్టులు చేయిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.20, రూ.30 కోట్లు ఖర్చు పెట్టే అభ్యర్థులు రంగంలో ఉన్నారని, అలాంటివారు గెలుపొందితే పేదల సమస్యలపై ఏం మాట్లాడతారని ప్రశ్నించారు. పేదలు, కార్మికులు, రైతుల పక్షాన పోరాడే వారే అసెంబ్లీ, పార్లమెంటులో ఉండాలని అన్నారు. అందుకోసం ఇండియా వేదిక తరపున కాంగ్రెస్ అభ్యర్థిగా ఏలూరు ఎంపి స్థానానికి పోటీ చేస్తున్న కావూరి లావణ్యను, ఏలూరు ఎమ్మెల్యే అభ్యర్థి సిపిఐ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావును గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్‌షోలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

కర్నూలులోని వీకర్ సెక్షన్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంఎ.గఫూర్, తదితరులు

గుంటూరు జిల్లా ఆత్మకూరులో జరిగిన ర్యాలీలో జొన్న శివశంకరరావు, జంగాల అజయ్‌కుమార్

పోరాడే వారిని ఎన్నుకోండి

- సిపిఎం అభ్యర్థుల విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-యంత్రాంగం

సమస్యలను పరిష్కరించని వారికి ఓటు వేయొద్దని, ప్రజల కోసం పోరాడే సిపిఎం నేతలను గెలిపిస్తే జనానికి మేలు జరుగుతుందని ఆ పార్టీ అభ్యర్థులు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలుచోట్ల రోడ్ షోలు, ఇంటింటి ప్రచారం చేపట్టారు. సిపిఎంను గెలిపిస్తే నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని వివరించారు. ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. పేదలు, ఆటో కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు ప్రచారంలో పాల్గొని తమ మద్దతు తెలిపారు.

కర్నూలులోని వీకర్ సెక్షన్ కాలనీ, ఎన్‌టిఆర్ బిల్డింగ్స్‌లో పాణ్యం అభ్యర్థి డి గౌస్‌దేశాయ్ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ పాల్గొన్నారు. వీరి ప్రజలు అడుగడుగునా హారతులు పట్టి, పూల వర్షం కురిపించారు. ప్రజా కళాకారులు ప్రచారం ముందు భాగంలో డప్పులు వాయిస్తూ నృత్యం చేస్తూ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ మాట్లాడుతూ పాణ్యం నియోజకవర్గం నుంచి వైసిపి తరుపున రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రజలను పట్టించుకోలేదన్నారు. ఈ ప్రాంత పార్కులు, ఇతర స్థలాలను కబ్జా చేసి రౌడీ మూకలను ప్రోత్సహించారని విమర్శించారు. టిడిపి ఎమ్మెల్యేగా ఒకసారి గెలిచిన గౌరుచరిత కూడా పెద్దగా చేసిందేమిలేదన్నారు. అందుకే సిపిఎం తరుపున ఎమ్మెల్యే అభ్యర్థి డి.గౌస్‌దేశాయిని, కాంగ్రెస్ తరుపున ఎంపిగా పోటీ చేస్తున్న లక్ష్మీనరసింహయాదవ్‌ను గెలిపించాలని కోరారు.

పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండల కేంద్రంలో అరకు ఎంపి అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స విజయాన్ని కాంక్షిస్తూ ర్యాలీ, అనంతరం రచ్చబండ కూడలి వద్ద సభ నిర్వహించారు. ఈ ప్రచారంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాధం మాట్లాడుతూ.. బిజెపి మరోసారి అధికారంలోకి వస్తే మైనింగ్ పేరుతో ఏజెన్సీ ప్రాంతాల్లోని అటవీ సంపదంతా అదానీకి అప్పగించేస్తుందని తెలిపారు. ప్రజలు రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పి సిపిఎం అభ్యర్థి అప్పలనర్స గెలుపునకు కృషి చేయాలని కోరారు. గరుగుబిల్లి మండలంలోని కె.రామినాయుడువలస, గొట్టివలసలో కురుపాం అభ్యర్థి మండంగి రమణ ప్రచారం చేశారు. ఆయనకు గ్రామస్తులు హారతులతో స్వాగతం పలికారు.

గుంటూరు జిల్లా మంగళగిరి మండలంలోని ఆత్మకూరు, తాడేపల్లి మండలంలోని వడ్డేశ్వరం, కొలనుకొండలో సిపిఐ గుంటూరు ఎంపి అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్, సిపిఎం మంగళగిరి అభ్యర్థి జొన్నా శివశంకరరావు రోడ్‌షో నిర్వహించారు. స్థానికులు వారికి ఎక్కడికక్కడ ఘనస్వాగతం పలికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు, వారిని గెలిపించాల్సిన అవసరాన్ని వివరించారు.

విశాఖ జివిఎంసి 74వ వార్డు పరిధిలోని దళివానిపాలెం, ఎస్‌సి కాలనీ, అంబేద్కర్ కాలనీ, వియ్యపువానిపాలెం, సమతానగర్ జంక్షన్‌లో గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం.జగ్గునాయుడు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం పాటుపడతానన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం పెద్ద భీంపల్లి, ఇందుకూరుపేట, పోతవరం, అగ్రహారం కాలనీ తదితర గ్రామాల్లో రంపచోడవరం అభ్యర్థి లోతా రామారావు రోడ్ షో, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సిపిఎం అరకు ఎంపి అభ్యర్థి పి.అప్పలనర్సను గెలిపించాలంటూ జికె.వీధి మండలం ఎ.దారకొండ, చిలకవీధి, నల్ల ముక్కు గ్రామాల్లోనూ, జెర్రల వారపు సంతలోనూ సిపిఎం నాయకులు విస్తృత ప్రచారం చేశారు.

నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని నవాబుపేట, నజీర్‌తోట ప్రాంతాల్లో అభ్యర్థి మూలం రమేష్ ప్రచారం నిర్వహించారు. కార్మికుల, ఉద్యోగుల, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో పోరాటం చేసేది కమ్యూనిస్టులేనని తెలిపారు. నెల్లూరు నగరాభివృద్ధికి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు మిరియం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో సిపిఎం అభ్యర్థి చిగురుపాటి బాబూరావు రోడ్ షో నిర్వహించారు. దేశాన్ని, రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన బిజెపి, టిడిపి, వైసిపి పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. గతంలో టిడిపి ప్రభుత్వం మోడీతో కలిసి రాజధాని అమరావతి పేరుతో ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం ఇప్పుడు మూడు రాజధానులంటూ మూడు ముక్కలాటకు తెరలేపిందన్నారు. ప్రజలందరూ ఆలోచించి సమస్యల పరిష్కారం కోసం పోరాడే వ్యక్తులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు.

కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలంలో గన్నవరం నియోజకవర్గ అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తనను గెలిపిస్తే గన్నవరం అభివృద్ధికి పాటుపడతానని అన్నారు.

వాల్మీకులకు ఎస్‌టి సాధన కోసం కృషి

- వాల్మీకుల ఆత్మీయ సమావేశంలో బాలకృష్ణ

ప్రజాశక్తి-హిందూపురం (శ్రీ సత్యసాయి జిల్లా)

మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి వాల్మీకులకు రాజకీయ గుర్తింపును ఇచ్చారని హిందూపురం టిడిపి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణంలోని జెవివిఎస్ ఫంక్షన్ హాల్లో ఆదివారం సాయంత్రం టిడిపి ఎంపి అభ్యర్థి పార్థసారథితో కలిసి వాల్మీకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తరువాత వాల్మీకులను ఎంపి, ఎమ్మెల్యేలను చేసి చట్ట సభల్లోకి పంపారన్నారు. నాటి నుంచి నేటి వరకు వాల్మీకులందరూ టిడిపికి అండగా నిలిచారన్నారు.

అందువల్లే అనంతపురం ఎంపి స్థానాన్ని హిందూపురం వాసి అంబికా లక్ష్మీనారాయణకు కేటాయించినట్లు తెలిపారు. వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చడం కోసం తనతోపాటు టిడిపి ప్రజా ప్రతినిధులు అందరూ చట్టసభల్లో గళం విప్పుతారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వాల్మీకులందరూ టిడిపికి అండగా నిలవాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న నందమూరి బాలకృష్ణ

కులగణనను వ్యతిరేకించిన

బిజెపితో పొత్తు తగదు

- జస్టిస్ వి ఈశ్వరయ్య

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

కులగణనను వ్యతిరేకిస్తూ ముస్లిం రిజర్వేషన్లు ఏత్తేస్తామని ప్రకటించిన బిజెపితో టిడిపి, జనసేన పొత్తు తగదని జాతీయ బిసి కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వి ఈశ్వరయ్య అన్నారు. గుంటూరులోని ఓ హోటల్‌లో ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడారు. తాను అన్ని రాష్ట్రాలు తిరిగి బిసిల స్థితిగతులపై అధ్యయనం చేశానని, సిఎం జగన్ కులగణన ప్రారంభించడం సంతోషదాయకమని అన్నారు. ఇది ఎన్నికల కారణంగా తాత్కాలికంగా ఆగినా నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పూర్తి చేస్తారనే నమ్మకం ఉందన్నారు. రూ.వేల కోట్లు కేటాయించి ప్రభుత్వ బడులు, ఆస్పత్రులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దడం హర్షణీయమన్నారు. సమావేశంలో హైకోర్టు న్యాయవాది రాగూర్ యాదవ్, న్యాయవాది పోకల వెంకటేశ్వరరావు, బిసి నాయకులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మాఫియా రాజ్యం

- ఎర్రగుంట్ల, ఆదోనిలో రాజ్‌నాథ్‌సింగ్

ప్రజాశక్తి – కడప, కర్నూలు ప్రతినిధులు

రాష్ట్రంలో లిక్కర్, ఇసుక, మైన్స్ మాఫియాలు రాజ్యమేలుతున్నాయని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆరోపించారు. వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం ఎర్రగుంట్లలోనూ, కర్నూలు జిల్లా ఆదోనిలో నిర్వహించిన సభలు, రోడ్ షోల్లో ఆయన పాల్గొన్నారు. ఎన్‌డిఎ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రూ.13.5 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. జమిలి ఎన్నికలు, జమ్ముకాశ్మీర్ స్వయం ప్రతిపత్తి రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు వంటి వాటి గురించి ఆయన మాట్లాడుతూ బిజెపి చర్యలను సమర్థించుకున్నారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి నిధులు ఇచ్చినా వాటిని ఖర్చు చేయడంలో వైసిపి విఫలమైందన్నారు. కడప స్టీల్ గురించి, రాయలసీమ ప్రాంతాభివృద్ధికి బిజెపి ఏం చేసిందనే విషయంపై కానీ ఆయన నోరు మెదపలేదు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని కూడా ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఆదోనిలో మాట్లాడుతున్న రాజ్‌నాథ్‌సింగ్

సదస్సులో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు, చిత్రంలో ఎమ్మెల్సీ ఐవి. బి.వెంకట్, విజయరావు తదితరులు

వనరులను కార్పొరేట్లకు అప్పగించే కుట్ర

- రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి – రంపచోడవరం (అల్లూరి జిల్లా)

బిజెపి హయాంలో అడవులను, సహజ వనరులను కార్పొరేట్లకు అప్పగించే కుట్రలు తీవ్రమయ్యాయని రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. అల్లూరి జిల్లా రంపచోడవరంలో 'భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం' పేరిట ఆదివారం జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన స్వేచ్ఛా స్వాతంత్ర్యం, పౌర హక్కులకు మోడీ హయాంలో భంగం కలుగుతోందన్నారు. అటువంటి బిజెపికి రాష్ట్రంలో టిడిపి, జనసేనలు ప్రత్యక్షంగా, వైసిపి పరోక్షంగా మద్దతు తెలపడం దారుణమన్నారు. మోడీకి చంద్రబాబు, జగన్ ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. ఏజెన్సీ అభివృద్ధికి ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం అరకు ఎంపి అభ్యర్థి పి.అప్పలనర్స, రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావులను గెలిపించాలని కోరారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాలకుల తీరుతో ఆదివాసీల బతుకులు రోజురోజుకూ దుర్భరంగా మారుతున్నాయన్నారు. గిరిజనులకు ఈ మాత్రమైనా హక్కులు వచ్చాయంటే దానికి కారణం వామపక్ష పార్టీలే కారణమన్నారు. ఎఐఎడబ్ల్యుయు జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ మాట్లాడుతూ దేశానికి కమ్యూనిస్టులు అధికారంలో ఉన్న కేరళ రోల్ మోడల్‌గా నిలుస్తోందన్నారు. గుజరాత్‌లో అభివృద్ధి డొల్లగా మారిందని విమర్శించారు. ఎన్‌డిఎ కూటమిని దేశ ప్రజలు ఓడించాలని, ఇండియా వేదికను గెలిపించాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు ఎం వాణిశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సింహాద్రి ఝాన్సీ, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక కో – కన్వీనర్ కె విజయరావు, మాజీ ఐఎఎస్ అధికారి శ్రీనివాస్, ఇండియా బ్లాక్ నాయకులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే 20 లక్షల ఉద్యోగాలు

- నారా లోకేష్

ప్రజాశక్తి – ఏలూరు అర్బన్, సిటీ

నెల రోజుల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, వచ్చిన వెంటనే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, ఉద్యోగం లేనివారికి నిరుద్యోగ భృతి ఇస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. ఏలూరులోని క్రాంతి కల్యాణ మండపం వద్ద ఆదివారం విద్యార్థులతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పేరు చెబితే గుర్తుకొచ్చేది పంట చేలు, సంప్రదాయంగా నిర్వహించే కోడిపందేలని అన్నారు. ఈ ఎన్నికలతో జగన్ పని అయిపోయిందని, సిఎం సీటు నుంచి దిగిపోవాల్సిందేనని అన్నారు. 2014 ఎన్నికల్లో తండ్రి చనిపోయారని సానుభూతి కోసం ప్రయత్నించారని, 2019 ఎన్నికల్లో బాబాయిని చంపి, కోడి కత్తి డ్రామా ఆడి గెలిచారని అన్నారు. ఇప్పుడు గులకరాయి డ్రామా ఆడుతున్నారని అన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ల్యాండ్ గ్యాబ్లింగ్ యాక్ట్‌గా అభివర్ణించారు. మన తాతలు కొన్న భూమి పట్టాలపై జగన్ ఫొటో ఎందుకని ప్రశ్నించారు. దాని గురించి మాట్లాడితే తనపై సిఐడి కేసులు పెట్టారని, కేసులకు భయపడబోనని పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలో కియా మోటార్స్‌ను తీసుకొచ్చామని, రెండుసార్లు డిఎస్‌సి విడుదల చేశామని చెప్పారు. చింతలపూడి లిఫ్ట్, పోలవరం ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండో సంతకం ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపైనే ఉంటుందని, భూమి రిజిస్ట్రేషన్లు పాత పద్ధతిలోనే జరుగుతాయని అన్నారు. రహదారులను వేస్తామని, ఆక్వా రంగాన్ని, ఐటి రంగాన్ని అభివృద్ధి చేస్తామని, రాష్ట్రానికి కంపెనీలను తీసుకొస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో నెలకొన్న అన్ని సమస్యలకు పరిష్కారం చూపిస్తామని చెప్పారు.

దేశమంతటా బిజెపి వ్యతిరేక గాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రజా సంఘాలు, గిరిజన సంఘాలు, లెఫ్ట్ పార్టీలు సహా ప్రత్యామ్నాయంగా ఏర్పడి 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌కు రాష్ట్ర హోదా, పోలవరం, రైల్వే జోన్ కోసం ఎన్నికల బరిలో దిగామన్నారు. 2018లో దేశ ప్రధాని మోడీ విశాఖపట్నం వచ్చి ఎన్నో హామీలు కురిపించి వెళ్లారని అందులో రైల్వేజోన్‌కు నేటికీ అతీగతి లేదన్నారు. ప్రత్యేక హోదా ఎలాగూ కాగితాలకే పరిమితం అయిపోయిందన్నారు. పోలవరం ప్రాజెక్టును కేంద్రమే పూర్తి చేయాల్సి ఉన్నా మోడీ ప్రభుత్వం ఇన్నాళ్లూ ఏం చేసిందని ప్రశ్నించారు. పోలవరం ముంపు ప్రాంతాల్లో తాను పర్యటిస్తానని, గిరిజనులు, నిర్వాసితుల కోసం ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు.

బాక్సైట్ దోపిడీకే బిజెపి అభ్యర్థి పోటీ

రాజ్యాంగం ద్వారా గిరిజనులకు దక్కిన హక్కులకు విశాఖపట్నం ఏజెన్సీలో రక్షణ లేదన్నారు. అనకాపల్లి ఎన్‌డిఎ కూటమి (బిజెపి) అభ్యర్థి సిఎం రమేష్‌పై ఇల్లీగల్ మైనింగ్ కేసులున్నాయని ఇలాంటి వారిని గెలిపించాలని ప్రధాని నరేంద్రమోడీ విశాఖ కశింకోటలో ప్రచారానికి రావడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. బాక్సైట్ భూముల్లో మైనింగ్ చేసేందుకే సిఎం రమేష్ అనకాపల్లి ఎంపిగా బరిలోకి దిగారని వ్యాఖ్యానించారు.

స్టీల్‌ప్లాంట్‌పై మోడీ కుట్రలు

పోర్టులు కేంద్ర ప్రభుత్వ అధీనంలోకి వచ్చే దేశ సంపద కాగా విశాఖలోని గంగవరం పోర్టును అదానీకి కట్టబెట్టారని ప్ర